

## పిల్లలో కనీస విద్యా ప్రమాణాలు పెంచేందుకు దృష్టి సారించాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**విద్యా శాఖ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్**

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

2వ పేజీలో...


# కరీంనగర్ వార్త

కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్నసిరిసిల్ల

శుక్రవారం 09, జనవరి 2026 | 16 పేజీలు


# కాంగ్రెస్, బీఆర్ఎస్ పాపాలే రాష్ట్రానికి.. శాపాలైనయ్




**నీళ్లు నిధులు నియామకాల ట్యాగ్ లైన్ తోనే దోపిడీకి తెరదీశాయ్**

**అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలాడారు**

**కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్**

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త

కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల పాపాలే...తెలంగాణ ప్రజల పాలిట శాపాలయ్యాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. నీళ్ల నిధులు నియామకాల ట్యాగ్ లైన్ తోనే ఆ రెండు పార్టీలు దోపిడీకి తెరదీశాయని మండిపడ్డారు. క్రిష్ణా జలాల వాటాలో తెలంగాణకు అన్యాయం జరగిందని,అందులో మొదటి దోషి కాంగ్రెస్సే అని దుయ్యబట్టారు. కేసీఆర్ 10 ఏళ్ల పాలనలో తెలంగాణకు తీరని నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలోని 89వ సెక్షన్ లో పలు ప్రాజెక్టులున్నప్పటికీ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ప్రస్తావనే లేదని కుండ బద్దలు కొట్టారు. అట్లాంటప్పుడు జాతీయ హోదా ఎట్లా అడిగారని ప్రశ్నించారు.గురువారంకరీంనగర్ రేకుర్తిలో ఓ గార్డెన్స్ లో కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల నాయకులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ నీళ్ల విషయంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకులు తెలంగాణ ప్రజలకు చేసిన మోసాలను ఎండగడుతూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత వారం పదిరోజులుగా నీళ్ల పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పొలిటికల్ డ్రామాలాడుతున్నాయన్నారు. 6 గ్యారంటీలపై చర్చ జరగకుండా కాంగ్రెస్, అవినీతిపై విచారణ లేకుండా బీఆర్ఎస్ కలిసి నాటకాలాడుతున్నయనీ తెలిపారు.నిజానికి కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసిన పాపాలు...తెలంగాణ ప్రజలకు

2 లో..



2 లో..

# ఎరువుల పంపిణీలో ఇబ్బందులు రావద్దు

**జిల్లాలో కొరత లేదుఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**హాజరైన ఎస్పీ మహేష్ బి గీతే**

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

జిల్లాలో ఎరువుల కొరత లేదని, పంపిణీలో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. యూరియా పంపిణీ, ఇతర అంశాల పరిశీలన, జిల్లా, మండల టాస్క్ ఫోర్స్ టీమ్ ఏర్పాటు తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి గురువారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గీతేతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,87,000 ఎకరాల్లో వివిధ పంటల సాగు అవుతున్నాయని, దానికి 21 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని తెలిపారు. 13 వేల మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని వెల్లడించారు. ఇంకా రెండు వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. యూరియా ఇబ్బందులు రాకుండా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఆపేరల పార్కులో నిల్వ చేశామని వెల్లడించారు. పంటల సాగుకు అనుగుణంగా ఎరువులు తెప్పిస్తున్నామని వివరించారు. పీ ఏ సీ ఎస్, ఐకేపీ, డీసీఎంఎస్, ప్రైవేట్ ఫెర్టిలైజర్




2 లో..

# పురపాలక ఎన్నికలకు కాంగ్రెస్ విస్తృత వ్యూహం

**రామగుండం కేంద్రంగా అభ్యర్థుల ఎంపికపై పీసీసీ కసరత్తు**

**అభ్యర్థుల ఎంపిక, సమన్వయం, బీఫాంల అందజేత మంత్రుల చేతిలో?....**

గోదావరిఖని, ప్రభాతవార్త

రానున్న మున్సిపల్ ఎన్నికలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ.. ఈసారి అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణకు శ్రీకారం

## కాంగ్రెస్,బీఆర్ఎస్ పాపాలే రాష్ట్రానికి శాపాలైనయ్

**(మొదటి పేజీ తరువాయి..)**

శాపాలైనయ్ అని విమర్శించారు.అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలాడారనీ ఆరోపించారు. పాలమూరు రంగారెడ్డి విషయంలో బీఆర్ఎస్ తీరుపై ఉద్యమం చేసింది బీజేపీయే, ఆనాడు కాంగ్రెస్ ఎన్నడైనా ఉద్యమాలు చేసిందా అని ప్రశ్నించారు.కేసీఆర్ పై ఒత్తిడి తెచ్చి మెడలు వంచింది బీజేపీయే అని చెప్పారు.తెలంగాణకు నీళ్ల అన్యాయం చేసిన మొట్టమొదటి దోషి కాంగ్రెస్సే అని తెలిపారు.ఉమ్మడి ఏపీలో క్రిష్ణా వాటాలో 811 టీఎంసీలుంటే...ఏనాడూ తెలంగాణకు 200 టీఎంసీలకు మించి నీటిని వాడుకోకుండా ఇక్కడి ప్రజలను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్సే అని తెలిపారు. గోదావరిలో 1486 టీఎంసీల నీటి వాటా ఉంటే.... తెలంగాణలో ఎన్నడూ 500 టీఎంసీలకు మించి వాడుకోలేదన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంపై సీఎం రేవంత్ అబద్దాలాడారనీ తెలిపారు. ప్రజలను డైవర్ట్ చేసేందుకు "కాళేశ్వరం" పేరుతో కూలేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో దోపిడీకి స్కెచ్ వేసిన నాయకుడు కేసీఆర్ అని విమర్శించారు. రూ.30 వేల కోట్ల ప్రాజెక్టును రూ.లక్ష కోట్లకు పెంచి వేల కోట్లు దోచుకున్నారని పేర్కొన్నారు.ఇయాళ కాంగ్రెస్, బీఆర్ఎస్ అసెంబ్లీ సాక్షిగా బూతులు తిట్టుకుంటూ, అబద్దాలాడుతూ ప్రజలను మోసం చేస్తున్నాయన్నారుకమీషన్ల కోసమే ప్రాజెక్టులు కట్టాలనే మైండ్ సెట్ ను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మార్చుకోవాలన్నారు.అప్పుడే తెలంగాణకు న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణకు న్యాయం చేసే విషయంలో కేంద్రం నిరంతరం సహకరిస్తూనే ఉంటుందని తెలిపారు..

## ఎరువుల పంపిణీలో ఇబ్బందులు రావద్దు

**(మొదటి పేజీ తరువాయి..)**

డీలర్లు ఈపాస్ యంత్రాల ద్వారానే ఎరువులు విక్రయించాలని, రిజిస్టర్లలో పట్టాదారు పాసుపుస్తకం రైతుల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.

పీఏసీఎస్ ల వద్ద రైతుల కోసం షామియానా ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. టాస్క్ ఫోర్స్ టీమ్ లు తనిఖీ చేయాలిజిల్లాలో ఎరువుల పంపిణీ, నిలువలు తదితర అంశాలను టాస్క్ ఫోర్స్ టీమ్ లు తనిఖీ చేయాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. మండల, జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేస్తున్నామని, జిల్లా స్థాయి టీమ్ లో కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా సహకార అధికారి, డి ఆర్ డి ఓ, మార్క్ ఫెడ్ డిఎం తదితరులు ఉంటారని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ టీమ్ లో తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి, ఎస్ హెచ్ ఓ ఉంటారని వెల్లడించారు మండల స్థాయి టాస్క్ ఫోర్స్ టీం తమ పరిధిలోని రెండు షాపులను రోజూ తనిఖీ చేయాలని సూచించారు. ఆయా షాపులలో ఉదయం స్టాక్ నిలువలు, రాత్రి స్టాక్ నిలువల రిజిస్టర్లు తనిఖీ చేయాలని ప్రస్తుతం రిజిస్టర్ లో స్టాక్ నిలువలు దుకాణంలో నిలువలు పరిశీలించాలని ఆదేశించారు. ఏమైనా తేడాలు ఉంటే మండల వ్యవసాయ అధికారి ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఎరువులు వ్యవసాయానికి వినియోగించేలా చూడాలని, పక్కదారి పట్టించి ఇతర అవసరాలకు వాడకుండా పర్యవేక్షించాలని టాస్క్ ఫోర్స్ టీంలకు ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. అనవసర ఆందోళనలు, అసత్య ప్రచారాలు చేసే వారిపై దృష్టి సారించాలని ఆదేశించారు. సరైన లైసెన్స్ లేకుండా ఎరువుల విక్రయాలు, నకిలీ యూరియా విక్రయాల పై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

## పురపాలక ఎన్నికలకు కాంగ్రెస్ విస్తృత వ్యూహం

**(మొదటి పేజీ తరువాయి..)**



చుట్టింది. గత పంచాయతీ ఎన్నికల అనుభవాలను లోతుగా విశ్లేషించిన పార్టీ, కొన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో చోటుచేసుకున్న పరిణామాలే పరాజయాలకు కారణమయ్యాయని అంచనాకు వచ్చింది. ముఖ్యంగా కాంగ్రెస్ కార్యకర్తలే పెద్ద సంఖ్యలో తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలోకి దిగడం వల్ల ఓట్లు చీలిపోయి ప్రతిపక్షాలకు అనుకూలంగా ఫలితాలు వచ్చాయని పార్టీ పరిశీలనలో తేలింది. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో అలాంటి పరిస్థితులు మళ్లీ పునరావృతం కాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని పీసీసీ నిర్ణయించింది.రామగుండం కేంద్రంగా జరగనున్న పార్టీ స్థాయి సమావేశాల్లో అభ్యర్థుల ఎంపిక, నేతల మధ్య సమన్వయం, ప్రచార వ్యూహాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరగనుంది. ప్రతి మున్సిపాలిటీలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా, క్రమబద్ధంగా నిర్వహించేందుకు ఎమ్మెల్యేలు, జిల్లా స్థాయి మంత్రులను పూర్తి స్థాయిలో బాధ్యులుగా చేయాలన్న ఆలోచనలో పార్టీ ఉంది. వార్డు వారీగా కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న అభ్యర్థుల పేర్లను సేకరించడం, వారి రాజకీయ అనుభవం, పార్టీ పట్ల నిబద్ధత, స్థానిక ప్రజల్లో ఉన్న ఆదరణ వంటి అంశాలను పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇచ్చి, అందరినీ కలుపుకొని ముందుకెళ్లాలని పార్టీ భావిస్తోంది.రామగుండం నియోజకవర్గ పరిధిలో గతంలో చోటుచేసుకున్న పరిణామాలను పార్టీ పెద్దలు ప్రత్యేకంగా ప్రస్తావిస్తున్నారు. ఎమ్మెల్యేలు, స్థానిక నేతల మధ్య సమన్వయం లోపించడం వల్లనే కొన్ని ప్రాంతాల్లో తిరుగుబాటు అభ్యర్థులు రంగంలోకి దిగారని, దాంతో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ చీలిపోయిందని పార్టీ విశ్లేషిస్తోంది. ఈసారి అలాంటి పరిస్థితులు రాకుండా ముందుగానే విభేదాలను గుర్తించి పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పీసీసీ యోచిస్తోంది. ఎక్కడైనా ఎమ్మెల్యేలకు, స్థానిక నాయకులకు మధ్య విభేదాలు ఉన్నట్లయితే వాటిని ఆసరాగా చేసుకొని తిరుగుబాటు అభ్యర్థులు బరిలోకి దిగకుండా ముందే హెచ్చరించాలని నిర్ణయించింది. అవసరమైతే పార్టీ క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.అభ్యర్థుల ఎంపికలో గెలుపు అవకాశాలే ప్రధాన ప్రమాణంగా ఉండాలని పార్టీ భావిస్తోంది. కేవలం పదవుల ఆశతో కాకుండా, ప్రజల్లో పట్టున్న వారికే టికెట్లు ఇవ్వాలన్న దిశగా పీసీసీ ఆలోచిస్తోంది. ప్రతి వార్డులో పార్టీ బలాబలాలు, ప్రత్యర్థుల స్థితిగతులు, స్థానిక సమస్యలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని వ్యూహాలు రచించనున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ప్రజలను ప్రభావితం చేసే మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధం, రహదారులు, ఉద్యోగ అవకాశాలు వంటి అంశాలను ప్రచారంలో ప్రధానంగా ఉంచాలని పార్టీ నిర్ణయించింది."ఎక్కడికక్కడ నేతలను సమన్వయపరిచి అభ్యర్థుల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా చర్చిస్తాం. పురపాలక ఎన్నికల్లో ఘన విజయం సాధించడమే లక్ష్యం. ఒక్కో మున్సిపాలిటీకి అనుగుణంగా ప్రత్యేక వ్యూహాలు అమలు చేస్తాం" అని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సమావేశాల్లో గెలుపు సాధించే అవకాశాలున్న వార్డులను గుర్తించడం, బలహీన ప్రాంతాల్లో అనుసరించాల్సిన ప్రచార విధానాలపై కూడా లోతుగా చర్చ జరగనుంది.రామగుండం కేంద్రంగా పార్టీ ప్రచార వ్యూహాలను కూడా పీసీసీ సమీక్షించనుంది. వార్డు స్థాయిలో ఇంటింటి ప్రచారం, కార్యకర్తల బృందాల ఏర్పాటు, స్థానిక సమస్యలపై ప్రజలతో ప్రత్యక్ష సంభాషణ వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. యువత, మహిళలు, కార్మిక వర్గాన్ని ఆకట్టుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా సింగరేణి కార్మికులు, పారిశ్రామిక ప్రాంతాల్లో నివసించే కార్మిక వర్గం సమస్యలను ప్రచారంలో ముందుకు తెచ్చి, అధికార పార్టీగా పరిష్కారాలపై భరోసా కల్పించాలన్నది పార్టీ ఆలోచనగా తెలుస్తోంది.మొత్తంగా మున్సిపల్ ఎన్నికల్లో 80 నుంచి 90 శాతం వరకు వార్డులు, మున్సిపాలిటీలను గెలుచుకునే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీ సమగ్ర వ్యూహాన్ని అమలు చేయాలని భావిస్తోంది. రామగుండం కేంద్రంగా రూపొందిస్తున్న ఈ కార్యాచరణ విజయవంతమైతే, రాష్ట్రవ్యాప్తంగా పార్టీకి బలమైన ఊతం లభిస్తుందని నాయకత్వం విశ్వసిస్తోంది. అంతర్గత విభేదాలకు తావివ్వకుండా, ఐక్యతతో ముందుకెళ్లడమే విజయానికి మార్గమన్న భావనతో కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.



## పిల్లలో కనీస విద్యా ప్రమాణాలు పెంచేందుకు దృష్టి సారించాలి

**(మొదటి పేజీ తరువాయి..)**

పిల్లలో కనీస విద్యా ప్రమాణాలు పెంచేందుకు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష విద్యా శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పాఠశాలలో విద్యా నాణ్యత పెంపొందించేందుకు మండల విద్యాశాఖ అధికారి, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్, విద్యా శాఖ జిల్లా ఉన్నతాధికారులు నిర్వహించే తనిఖీలు, తీసుకునే రివ్యూ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. పాఠశాలల తనిఖీ నిమిత్తం విద్యా శాఖ ఉన్నతాధికారులు వీక్లీ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని, ప్రతి మండలంలో నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం పాఠశాలల తనిఖీలను ప్రతి అధికారి కనీసం 80 శాతం పూర్తి చేయాలని అన్నారు. ప్రతి పాఠశాల తనిఖీ నాణ్యతతో ఉండాలని, చెక్ లిస్ట్ ప్రకారం ప్రతి అంశాన్ని పరిశీలించి పాఠశాల పర్యటన సంబంధించి రిపోర్టు తయారు చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు ఉండే విధంగా కృషి చేయాలని, పిల్లలు ప్రస్తుత విద్యా ప్రమాణాల స్థితిగతులను సరిగ్గా నమోదు చేయాలని అన్నారు. విద్యా ప్రమాణాలు సరిగ్గా లేకున్నా అంతా బాగుందని చూపెట్టేందుకు తప్పుడు వివరాలు ఇవ్వవద్దని అన్నారు. ప్రాథమిక విద్య మిడ్ లైన్ చెకింగ్ లో పెద్దపల్లి జిల్లా ప్రస్తుతం 17వ స్థానంలో ఉందని, తెలుగు రాయడం, చదవడం లో విద్యార్దులు చాలా వెనుకబడి ఉన్నారని, క్షత్రస్థాయి పర్యటన సందర్భంగా అధికారులు ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకొని పాఠశాల సిబ్బందికి తగు సూచనలు జారీ చేయాలని అన్నారు. జనవరి 31, ఫిబ్రవరి 5, ఫిబ్రవరి 23 నాడు 3 సార్లు ప్రాథమిక స్థాయి విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాల పై మాక్ టెస్ట్ నిర్వహించాలని, ప్రతి పరిక్షకు విద్యార్థులలో ఇంప్రూవ్మెంట్ ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. బట్టి పద్దతులలో కాకుండా పిల్లలకు విషయ పరిజ్ఞానం అందేలా పిల్లలను ఇంటరాక్ట్ చేస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన జరగాలని అన్నారు. పాఠశాలల తనీఖీకి సమయంలో అధికారులు ప్రతి తరగతి గదిలో కనీసం 3 విద్యార్థుల ప్రమాణాలను ర్యాండంగా చెక్ చేయాలని అన్నారు. గణితం ప్రమాణాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అన్నారు. తరగతి గదిలో ప్రతి రోజు గంట నుంచి రెండు గంటల వరకు పిల్లల రీడిరగ్ స్కిల్స్, గ్రహణ శక్తి పెంచే విధంగా కార్యాచరణ చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శారద, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు పిఎం.షేక్, మల్లేశం, జిసిడిఓ కవిత, మండల విద్యా ధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## జంతు వధ శాలను పునరుద్ధరించాలి

### నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి

### ఖాజీపేట కమేలా ను క్షేత్ర స్థాయిలో పరిశీలన

**వరంగల్ సిటీ జనవరి 8 ప్రభాతవార్త**

ఖాజీపేట లో గల జంతు వధ శాల (కమేలా)ను పునరుద్ధరించాల్సి న అవసరం ఉందని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అభిప్రాయపడ్డారు. గురువారం బల్దియా పరిధి 63 వ డివిజన్ పరిధి లోగల కమేలా, 28 వ డివిజన్ ఇంతేజాజ్ గంజ్ ప్రాంతం లో మేయర్ శానిటేషన్ తనిఖీలు చేశారు. ప్రతి కమర్షియల్ దుకాణానికి టైం షెడ్యూల్ కేటాయించి చెత్త సేకరణ జరపాలని ఎవరైనా దుకాణ దారులు చెత్తను రోడ్డుపై వేస్తే పెనాల్టీ లు విధించాలని అన్నారు. అనంతరం ఖాజీపేట లో గల కమేలా తో పాటు ఇంటిగ్రేటెడ్ నాన్ వెజ్ మార్కెట్ ను మేయర్ క్షేత్ర స్థాయిలో సందర్శించారు, స్లాటర్ హౌస్ (కమేల) ను పరిశీలించి అధికారుల ఆదేశించిన మేయర్ పూర్తి స్థాయిలో జంతు వధ శాలను పునరుద్ధరించాలని అన్నారు. సమీపం లో గల ప్రభుత్వ భూమిని శుభ్రం చేసి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, అందులో ఏలాంటి నిర్మాణం చేపడితే ఉపయుక్తంగా ఉంటుందనే విషయాన్ని ఇంజనీరింగ్ అధికారులు నిర్ధారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ శ్రీ రజాలే, సి ఎం హెచ్ ఓ డా.రాజారెడ్డి, ఏ ఈ విజయ లక్ష్మీ పాల్గొన్నారు.

# పెండింగ్  వీహబ్ భవన పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

వీహబ్ భవన పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి మండలంలోని రంగంపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న వీహబ్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, నూతన వీహబ్  పెండిరగ్ పనులు  త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.  మహిళలను  పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన శిక్షణ, అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించేలా వీహబ్ భవనాన్ని నిర్మిస్తున్నామని, దీని ద్వారా జిల్లాలో మహిళలకు చాలా మేలు చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. వీహబ్ కేంద్రంలో మహిళలకు శిక్షణ అందించేందుకు అవసరమైన ఫర్నిచర్, పరికరాలకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట  జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, పంచాయతీ రాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ పవన్, సంబం ధిత అధికారులు,  తదితరులు పాల్గొన్నారు.



## వార్త ఎఫెక్ట్..
## వార్త కథనానికి అద్భుతమైన స్పందన

స్పందించిన మండల ఎలక్ట్రికల్ ఇంజనీర్ శ్రీనివాస్

ప్రమాదకరంగా ఉన్న సింగల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ తొలగింపు

నూతన కరెంట్ పోల్ ఏర్పాటు

**-వార్త పత్రిక యాజమాన్యానికి అభినందనల వెల్లువ**

బీర్ పూర్ ప్రభాత వార్త:




జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలంలోని తుంగూరు గ్రామంలో కొత్తపేట వాడలో ప్రమాదకరంగా ఉన్న సింగల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ గురించి సోమవారం రోజున వార్త పత్రిక లో ప్రచురితమైన కథనానికి మండల ఎలక్ట్రికల్ ఇంజనీర్ శ్రీనివాస్ స్పందించారు. జనావాసాల మధ్య మృత్యువు నిడ పట్టించుకోని విద్యుత్ శాఖ అనే వార్త కథనానికి విద్యుత్ శాఖ నుంచి అద్భుతమైన స్పందన లభించింది. వార్తాపత్రికలో వచ్చిన కథనం ద్వారా విద్యుత్ అధికారులలో కదలిక వచ్చి గురువారం రోజున కొత్తపేటలో ఉన్న సింగల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ స్థలాన్ని సందర్శించి ప్రమాదకరంగా ఉన్న సింగల్ ఫేస్ ట్రాన్స్ఫార్మర్ను తొలగించి సేఫ్టీగా ఉండే విధంగా ఎత్తులో అమర్చారు. అదేవిధంగా ప్రమాదకరంగా ఉందా కరెంట్ పోల్ను తొలగించి నూతన స్తంభాన్ని ఏర్పాటు చేశారు. జనావాసాల మధ్య ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియకుండా భయం భయంగా ఉన్న కొత్తపేట వాసులకు





విద్యుత్ శాఖ వారి స్పందన ద్వారా ఊరట  లభించినట్టు తెలుపుతున్నారు. ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్ గురించి వార్తాపత్రికలో కథనంగా ప్రచురించిన వార్తాపత్రిక యాజమాన్యాన్ని ఎలక్ట్రిక్ ఇంజనీర్ శ్రీనివాస్, గ్రామ ప్రజలు యువత పాలకులు అభినందించారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రమాదకరంగా ఉన్న సమస్యతో ఇబ్బంది పడుతున్న ఎవరు పట్టించుకోలేదని వార్తాపత్రికలో కథనం ప్రచరితం కావడం ద్వారా మా సమస్య కు పరిష్కారం లభించిందని సంతోషంతో కొత్తపేట స్థానిక ప్రజలు తెలుపుతున్నారు.ప్రజల సమస్యలను తెలుసుకొని సమస్య పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న పత్రికకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఏది ఏమైనా ఎన్నో రోజులుగా తీరని సమస్య రెండు రోజులలో తీరడం చాలా అద్భుతంగా ఉందని ఇంత తొందరగా విద్యుత్ శాఖ ద్వారా స్పందన లభించడం తక్షణం రక్షణ చర్యలు చేపట్టి ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని తొలగించడం అసలు ఊహించలేకపోయామని కథనానికి స్పందించి వెంటనే మరమ్మత్తులు చేసేలా కృషిచేసిన వార్తాపత్రిక విలేకర్ కు యజమాన్యానికి, తక్షణ మరమత్తులు చేసిన విద్యుత్ శాఖ సిబ్బందికి, మరబత్తులు చేపించిన ఎలక్ట్రికల్ ఇంజనీర్ కు కొత్తపేట వాసులు ధన్యవాదాలు తెలిపారు.

## ఆయిల్ ఫామ్ పంటపై రైతులకు అవగాహన కార్యక్రమం

బీర్ పూర్ ప్రభాత వార్త.



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని  కోమనపల్లి గ్రామం నందు ఉద్యాన, వ్యవసాయ  శాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ కంపెనీ ల ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ పామ్ పంటపై అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్టు ఏ ఈ ఓ శిరీష తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల ఉద్యాన విస్తరణ  అధికారి బి . రాజేష్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ మొక్క నాటిన 3 సంవత్సరాలనుండి దిగుబడి ప్రారంభమై 30 సంవత్సరాల వరకు కొనసాగునని తెలిపారు. మొక్కలను 90 శాతం సబ్సిడీ పై 20 రూపాయలకే ఇస్తున్నామని, డ్రిప్ పై 80శాతం100శాతం సబ్సిడీ అందిస్తున్నామని, ప్రతి ఎకరానికి సంవత్సరానికి 4200 రూపాయల చొప్పున 4 సంవత్సరాల వరకు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తున్నామని, జిల్లాలో ఇప్పటివరకు 5000 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటలు ఉన్నాయని, వరి పంటతో పోలిస్తే అకాల వర్షాలు, వడగళ్ళ వానలవల్ల నష్టం ఉండదని, కోతుల బెడద ఉండదని,1993 ఆయిల్ పామ్ చట్టం ప్రకారం గెలలను ప్రభుత్వం నిర్దారించిన రేట్ కు కంపెనీ కొనుగోలు చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో  వ్యవసాయ విస్తరణ అధికారి శిరీష ,ఆయిల్ పామ్ కంపెనీ ఫీల్డ్  ఆఫీసర్ ఎల్. రాజేష్ , గ్రామ కార్యదర్శి మధుసూదన్ మరియు గ్రామ  రైతులు  పాల్గొన్నారు.

## జగిత్యాల  నూతన ప్రెస్ క్లబ్ నూతన టియుడబ్ల్యూజె (ఐజెయూ) కార్యవర్గానికి పొలాస లో సన్మానం

వేద మంత్రోచ్ఛారణల మధ్య ప్రెస్ క్లబ్ సభ్యుల ఆశీర్వచనం

జగిత్యాల రూరల్ ప్రభాతవార్త:






జగిత్యాలలో నూతనంగా ఎన్నికైన టియూడబ్ల్యూజె (ఐజెయూ) అనుబంధ జగిత్యాల పట్టణ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులను జగిత్యాల రూరల్ పొలాస సహస్ర వేయి లింగాల ఆలయ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా ఆలయానికి ఆహ్వానించినారు.ఈ నేపథ్యంలో ఆలయంలో వేద బ్రాహ్మణుల చేత ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం కార్యవర్గ సభ్యులందరికి ఆ సంఘ బాధ్యులు శుభాకాంక్షలు తెలిపి,వేద బ్రాహ్మనులచే ఆశీర్వచనాలు,స్వామి వారి ప్రసాదాలు అందించి,ఆలయ ట్రస్టీ,చైర్మన్ నలమాసు గంగాధర్,మేనేజింగ్ డైరెక్టర్ కొయ్యడ రమేష్, ట్రెజరర్ కొయ్యడ శేఖర్,కార్యవర్గ సభ్యులు తిరుపతి గౌడ్,చంద్ర శేఖర్ లు కండువాలు కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎల్లాల రాజేందర్ రెడ్డి,ప్రధాన కార్యదర్శి కందుకూరి శశిధర్, ఉపాధ్యక్షులు శనిగరపు శ్రీనివాస్,కోశాధికారి బోయినిపల్లి శ్రీధర్ రావు,ఆర్గనైజింగ్ కార్యదర్శి కడార్ల రంజిత్ కుమార్, సంయుక్త కార్యదర్శి గాజుల మహేష్,కార్యవర్గ సభ్యులు నీరటి గంగాధర్, ఎల్ల క్రాంతి కుమార్,సామ మహేష్ ,కట్కూరి సంతోష్, ఎండి సాబేర్ అలీ లు పాల్గొన్నారు.

## నేరాలు-దారుణాలు

## వీధి కుక్కల దాడిలో వ్యక్తికి గాయాలు

### -భయం భయంగా గ్రామ ప్రజలు

గొల్లపల్లి, ప్రభాతవార్త :



మండల కేంద్రంలో విచ్చలవిడిగా వీధి కుక్కల సంతతి పెరిగిపోవడంతో గ్రామ ప్రజలు రోడ్లమీద నడవాలంటే భయపడుతున్నారు. ఇటీవల వ్యక్తులపై వీధి కుక్కలు దాడులు పెరిగిపోవటంతో గ్రామ ప్రజలు భయం భయం గా తమ పనుల నిమిత్తం బయటకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.ఇటీవల జరిగిన వీధి కుక్కల దాడిలో గత రెండు నెలల క్రితం ఒక మహిళపై శునకం దాడి చేయగా గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం మండల కేంద్రానికి చెందిన పెనాల అశోక్ పై వీధి కుక్క దాడి చేసి తీవ్ర గాయాలు చేసింది. గ్రామంలో పిల్లలు ,పెద్దలు,వృద్ధులు వివిధ పనుల నిమిత్తం బయటకు  వెళ్లాలంటే  భయపడే పరిస్థితి నెలకొంది.ప్రతి ఒక్కరూ భయపడుతూ  వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు.ఇప్పటికైనా అధికారులు,గ్రామ పాలకవర్గం స్పందించి ప్రత్యేక శ్రద్ధ వహించి వీధి కుక్కల పట్ల చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## అదుపుతప్పి చెట్టుకు ఆటో ఢీ..
### -పలువురికి గాయాలు

గంభీరావుపేట, ప్రభాతవార్త:

అదుపుతప్పి ఆటో చెట్టుకు ఢీ కొట్టి పలువురికి గాయాలైన సంఘటన గురువారము సాయం త్రము గంభీరావుపేట మండలంలో చోటుచేసు కుంది. కామారెడ్డికి చెందిన 12 మంది క్యాటరింగ్ చేసే వ్యక్తులు మండల కేంద్రంలోని ఒక వివాహ కార్యక్రమం నిర్వహించేందుకు ఆటోలో తరలివస్తున్నారు.  మండల పరిధిలోని ముస్తఫనగర్ గ్రామ శివారులో ఆటో అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న 12 మందిలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో  పదిమందికి గాయాలు కాగా వారిని తక్షణము చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన ఇరువురు వ్యక్తులను మెరుగైన చికిత్స కై కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మోటార్ సైకిల్ దొంగ అరెస్ట్

మెట్ పల్లి టౌన్, ప్రభాతవార్త:

మెట్ పల్లి పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న చంద్రకాంత్ బట్ అనే వ్యక్తిని మోటర్ సైకిల్ దొంగతనం కేసులో గురువారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు మెట్ పల్లి ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. ఆయన వివరాల మేరకు... పట్టణంలోని వెంకట్రావుపేట  శివారులో పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా వెంకట్రావుపేట శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న చంద్రకాంత్ బట్ ను పట్టుకుని విచారించగా గతంలో పట్టణంలోని పద్మాక్షి  హాస్పిటల్ ఎదుట పార్కు చేసిన రాయల్ ఎన్ఫీల్డ్ మోటార్ సైకిల్ ను దొంగతనం చేసినానని ఒప్పుకున్నట్లు ఎస్సై తెలిపారు. దొంగతనం చేసిన రాయల్ ఎన్ఫీల్డ్ బైక్, ఇనుప రాడ్, కొన్ని వస్తువులు స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా అతనికి మేజిస్ట్రేట్ జ్యూడిషియల్ కస్టడీకి పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

## బేగంపేటలో వృద్ధురాలు
## మెడలో నుంచి చైన్ స్నాచింగ్

**రామగిరి, ప్రభాతవార్త:** రామగిరి మండలం బేగంపేట గ్రామంలో గురువారం చైన్ స్నాచింగ్ ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుంట మల్లమ్మ అనే వృద్ధురాలి మెడలో నుంచి గుర్తు తెలియని దుండగులు ఇంట్లో ఆరు బయట ఉన్న సమయంలో అదను చూసిన దుండగులు మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలు రామగిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ పుటేజాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

# గడి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సందడి

**తల్లులు-విద్యార్థుల సమ్మేళనంతో**

**ముగ్గుల పోటీల సందడి**

**ప్రధానోపాధ్యాయులు**

**నూనావత్ రాజు**



కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :

కోరుట్ల మండలం గడి కల్లూరు రోడ్‌లోని ప్రాథమిక పాఠశాల ఎస్.ఆర్.ఎస్.పి క్యాంప్ గడిలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల వారి తల్లులతో కలిసి ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయడం విశేషంగా నిలిచింది. సంక్రాంతి పండుగకు ప్రత్యేక గుర్తింపుగా నిలిచే ముగ్గులు మన సంప్రదాయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలను ప్రతిబింబిస్తాయి. లక్ష్మీ మ్రదేవిని ఆహ్వానించడానికి, ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపేందుకు సంక్రాంతి వేళ వేయబడే చుక్కల ముగ్గులు, గొబ్బెమ్మల అలంకరణలు, భోగి మంటల చుట్టూ వేయబడే ముగ్గులు పండుగ శోభను మరింత పెంచుతాయి. ఈ సంప్రదాయాన్ని పిల్లలకు దగ్గర చేయాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు వారి తల్లులతో కలిసి రంగురంగుల కలర్స్ తో అద్భుతమైన ముగ్గులు వేసి అందరినీ ఆకట్టుకున్నారు. సాంప్రదాయ రూపకల్పనలతో పాటు సృజనాత్మకతకు ప్రతీకగా నిలిచే డిజైన్లతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. పిల్లలలో సాంస్కృతిక అవగాహన పెంపొందించడమే కాకుండా, తల్లులు-పిల్లల మధ్య అనుబంధాన్ని మరింత బలపరిచేలా ఈ కార్యక్రమం సాగింది. ముగ్గులు వేసిన విద్యార్థులకు, తల్లులకు అందరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నునావత్ రాజు, ఉపాధ్యాయులు పూర్ణ చందర్, అబ్దుల్ రవూఫ్, ధన లక్ష్మి ృ, సుమలత, సరస్వతి, భవానితో పాటు విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు.

# కోరుట్ల వార్త

## ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు

మేడిపల్లి, ప్రభాతవార్త :

మండలంలోని కట్లకుంట గ్రామంలో రైతులకు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి గడ్డం శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ వరి, మొక్కజొన్న పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు వలన రైతుకు నాలుగవ సంవత్సరం నుండి దిగుబడి వస్తున్నందు వలన ఈ నాలుగు సంవత్సరాలు రైతులు తమ సాంప్రదాయ పంటలైన కూరగాయలు, పసుపు, మొక్కజొన్న, ప్రత్తి, పప్పు దినుసులకు సంబంధించిన ఇతర పంటలను అంతర పంటలుగా వేసుకొని లాభాలు పొందవచ్చని తెలిపారు. ఆయిల్ పామ్ సాగులో కోతుల బెడద, అడవి పందుల బెడద మరియు చీడపీడలు, అకాల వర్షాలు, వడగండ్ల వానల వలన ఎలాంటి నష్టం ఉండదని తెలిపారు. ఆయిల్ పామ్ మార్కెటింగ్ విషయంలో రైతులకు ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా ప్రభుత్వం పైన నమ్మకం ఉంచి జగిత్యాల జిల్లాకు కేటాయించిన లోహియా ఎడిబుల్ ఆయిల్స్ కంపెనీ ద్వారా కొనుగోలు చేసే విధంగా ఒప్పందం చేయబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కట్లకుంట గ్రామ సర్పంచ్ సుమలత ఉప సర్పంచ్ జలంధర్ రెడ్డి, ఏఈవో రాధ , హెఈఓ అనిల్ కుమార్, లోహియా కంపెనీ ఎఫ్ఓ శ్రావణ్, గ్రామ రైతులు పాల్గొన్నారు

## మంత్రి లక్ష్మణ్ కుమార్ ను కలిసిన రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు

కోరుట్ల, ప్రభాతవార్త :



తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను గురువారం హైదరాబాద్ లో ని మంత్రి నివాసం లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ను కూడా నిర్వహిస్తున్న లక్ష్మణ్ కుమార్ కు కోరుట్ల నియోజకవర్గంలోని ఏ ఎస్సార్ తండా పాటి మీది తండా లకు గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలకు నిధుల మంజూరు తో పాటు కోరుట్ల నియోజకవర్గం లోని పలు తాండలలో ఉన్నపలు సమస్యల ను పరిష్కారం చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్లు జువ్వాడి కృష్ణారావు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మోదీ కానుక

**అట్టహాసంగా సైకిళ్ల పంపిణీ**

**చదువులో రాణించి బండి సంజయ్‌కు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలి**

**వేములవాడ బీజేపీ ఇంచార్జి**

**డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు**

భీమారం, ప్రభాతవార్త :

కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర మంత్రి వర్యులు బండి సంజయ్ కుమార్ ఖీమోదీ కానుకఖీగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న సైకిళ్ల పంపిణీ కార్యక్రమం భీమారం మండలంలో గురువారం అట్టహాసంగా జరిగింది. మండలంలోని గోవిందారం, లింగంపేట, మన్నెగూడెం, వెంకట్రావుపేట ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు వేములవాడ నియోజకవర్గ బీజేపీ ఇంచార్జి డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు హాజరై, విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వికాస్ రావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ అలవరుచుకోవాలని, దురలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై ఏకాగ్రత పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి పడుతున్న ఇబ్బందులను గమనించి, కేంద్ర మంత్రి బండి సంజయ్ ఈ సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. ఎన్నికల సమయంలోనే కాకుండా, ప్రజల కష్టాలను గుర్తించి స్పందించే గొప్ప నాయకత్వం బండి సంజయ్ ది అన్నారు.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని విద్యా కేంద్రంగా తీర్చిదిద్దడమే ఆయన లక్ష్యమని, సైకిళ్లు అందుకున్న విద్యార్థులు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలి అంటే, అది మంచి మార్కులతో పరీక్షలు ఉత్తీర్ణత సాధించడమేనని అన్నారు. విద్యే అభివృద్ధికి మూలమని నమ్మే భారతీయ జనతా పార్టీ, విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తోందని వికాస్ రావు తెలిపారు. సైకిళ్లు అందుకున్న విద్యార్థులు, తల్లిదండ్రులు కేంద్ర మంత్రి బండి సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమారం మండల బీజేపీ అధ్యక్షులు నాగం శివకుమార్, మండల ఎంపీటీసీ మధుసూదన్ రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, బీజేపీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## మన్నెగూడెం గ్రామంలో 1200 గొర్రెలకు సిపాక్స్ టీకాలు

**రైతులు ఉచిత పశు వైద్య సేవలను**

**సద్వినియోగం చేసుకోవాలి**

భీమారం, ప్రభాతవార్త:



భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామంలో పశు వైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గొర్రెల్లో ప్రాణాంతక వ్యాధులను నివారించేందుకు సుమారు 1,200 గొర్రెలకు సిపాక్స్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశు వైద్య అధికారులు మాట్లాడుతూ పశుసంపద ఆరోగ్యంగా ఉంటేనే రైతులు, గొర్రెల పెంపకదారులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని, అలాగే వివిధ రకాల ఆరోగ్య సమస్యలను నివారించడంలో ఈ టీకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. సిపాక్స్ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యలు అత్యంత అవసరమని వివరించారు. ప్రభుత్వం పశు వైద్య మరియు పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న ఉచిత టీకాల కార్యక్రమాలు, చికిత్స సేవలను రైతులు, గొర్రెల పెంపకదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దుంపల నివేదిత మనోజ్ రెడ్డి, పశు వైద్యులు డా. వెన్నెల, అలాగే రిటైర్డ్ జేవీవో మురళి, ఓస్ గంగాధర్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అడవికి నిప్పంటిస్తే కఠినమైన శిక్షలు తప్పవు

మల్యాల/ప్రభాతవార్త



గ్రామాల్లో అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమా దాలు సంభవించకుండా గ్రామ స్తులు కాపాడుకోవాల్సి న అవసరం ఉందని ఫారెస్ట్ ఓబులాపూర్ సెక్షన్ అధికారి రత్నమ్మ అన్నారు, గురువారం మండలంలోని మద్దుట్ల గ్రామంలో అటవీ ప్రాంత అగ్ని ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలపై గ్రామపంచాయతీ వద్ద ప్రజలకు అవగాహన కల్పించారు, అటవీ ప్రాంతంలో విలువైన అటవీ సంపద తో పాటు, ఎన్నో జంతువులు జీవిస్తుంటాయని, అటవీ ప్రాంతంలో బీడీ తాగి పడేయడం , కావాలని అడవికి నిప్పంటించడం నేరమని ఇందుకు అటవీ సెక్షన్లలో తీవ్రమైన శిక్షలు ఉంటాయని సెక్షన్ అధికారి రత్నమ్మ అన్నారు, కార్యక్రమంలో మద్దుట్ల ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మహమ్మద్ వసీముద్దీన్, ఉప సర్పంచ్ రాజు ,మాజీ సర్పంచ్ పోతాని రవి ,నాయకులు కెల్లేటి రమేష్ పాల్గొన్నారు

## సీఎం సహాయ నిధి ద్వారా కొండగట్టు అగ్ని ప్రమాద బాధితులకు సహాయం

**నేడు బాధితులకు కొండగట్టు లో చెక్కుల అందజేత**

మల్యాల/ ప్రభాతవార్త

కొండగట్టు దిగువ ప్రాంతంలో నవంబర్ 29 అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో చిరు వ్యాపారుల దుకాణాలు కాలిపోగా, బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందించేందుకు ప్రభుత్వం అనుమతించింది, ఈ మేరకు బాధితులకు రూ, 83 లక్షల12 వే లను మంజూరు చేశారు, అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి జిల్లాకు చెందిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ మంత్రి జీవన్ రెడ్డి లు సందర్శించి బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు, సంఘటన అనంతరం తక్షణ సహాయం ఐదు వేల తో పాటు మరుసటి రోజు 20 వేల చొప్పున జిల్లా కలెక్టర్ ఆదేశం మేరకు తహసీల్దార్ తక్షణ సహాయం అందజేశారు, అగ్ని ప్రమాదంపై మంత్రి అడ్లూరి ఎమ్మెల్యే సత్యంలో కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి స్వయానా వినతి పత్రం అందజేసి బాధితులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు, దీంతోప్రభుత్వం ప్రమాద ఘటన నివేదికను పరిశీలించిన అనంతరం, బాధితులకు సీఎం గ్రాంట్ ద్వారా సహాయం అందజేసేందుకు నిర్ణయించింది, ఈ మేరకు శుక్రవారం కొండగట్టులో బాధితులకు ఆర్థిక సహాయ చెక్కులను అందచేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# సింగరేణి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు నియామకాలలో అక్రమాలు

**-స్థానికులకు, భూ నిర్వాసితులకు అన్యాయం**

**-సింగరేణి చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను నిలదీసిన స్థానిక నాయకులు**

రామగిరి, ప్రభాతవార్త:

సింగరేణి ఆర్జీ 3 ఏరియా ప్రవేట్ సెక్యూరిటీ గార్డు ఉద్యోగ నియామకాలలో స్థానికులకు, భూ నిర్వాసితులకు ఇవ్వకుండా, సింగరేణి అధికారులు, సెక్యూరిటీ కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఇతరులకు అమ్ముకుంటున్నారని కాంగ్రెస్, బిజెపి నాయకులు అగ్ర వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు సెక్యూరిటీ అధికారి శబిరుద్దీన్ కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. స్థానిక యువతకు రావాల్సిన ఉద్యోగాలను దూరం చేసి, డబ్బు ఉన్నవారికి మాత్రమే అవకాశాలు కల్పించడం అన్యాయమని పేర్కొన్నారు. ఈ అక్రమ నియామకాలను వెంటనే రద్దు చేసి, స్థానికులు మరియు భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తోట చంద్రయ్య పటేల్,



మాజీ ఎంపీటీసీ ముస్త్యాల శ్రీనివాస్, బిజెపి జిల్లా నాయకులు మోల్మూరి శ్రీనివాస పటేల్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోతుక్కూరి అవినాష్ గౌడ్, కాళేశ్వర దేవస్థాన డైరెక్టర్ కాటం సత్యం, జిల్లా బీజేపీ నాయకులు ముల్మూరి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సిద్దం మురళి, కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు ఉడుత శంకర్, బండ కిరణ్ రెడ్డి, సంతోష్ గౌడ్, నాయకులు శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ జాబితా నుంచి తొలగించండి

## -తహశీల్దార్ సుమన్

రామగిరి, ప్రభాతవార్త:



మృతి చెందిన, డబుల్ పేర్లున్న, స్థానికంగా ఉండకపోయిన వారిని గుర్తించి, వారిని ఓటర్ జాబితా నుండి తొలగించాలని రామగిరి తహశీల్దార్ పర్నంది సుమన్ సూచించారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటర్ జాబితా కేంద్ర ఎలక్షన్ కమిషన్ నిబంధనలను సరిగ్గా నిర్వహిస్తున్నారా.. లేదా..అని గురువారం పరిశీలించారు. 2002లో ఓటర్ లిస్టులో పేరు ఉండి, ప్రస్తుతం 2025లో పేర్లు ఎలా ఉన్నాయో పరిశీలించాలని ఆయన సూచించారు. బిఎల్ఓలు ఓటర్ లిస్టును క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహశీల్దార్ యజ్ఞంభట్ల మానస, పంచాయతీ కార్యదర్శి గంగుల సంతోష్, కారోబార్ కొండపర్తి శ్రీనివాస్ ఉన్నారు.

# బిఎల్‌వోలు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాలి

అడిషనల్ కలెక్టర్ గడ్డం నగేష్

చందుర్తి ప్రభాతవార్త



భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు జాబితాతో బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని ఇంటింటికి వెళ్లి పరిశీలించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. గురువారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో రెవిన్యూ అధికారులు, సూపర్వైజర్లు, బీఎల్ఓ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఎస్.ఆర్ 2025 జాబితాలో 40 ఏళ్ల పైబడిన వారిని ఎస్.ఐ.ఆర్ 2002 జాబితాతో మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. రెండు జాబితాలో ఉన్న కామన్ వ్యక్తులకు ఎస్.ఐ.ఆర్.2025 వర్తించదని తెలిపారు. అనంతరం మూడపల్లి లో గల మినీ స్టేడియం స్థలాన్ని పరిశీలించారు. స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఆరా తీయగా సంబంధిత అధికారులు ఆరు ఎకరాలు కేటాయించామని తెలిపారు, ఈ కార్యక్రమంలో తహసిల్దార్ భూపతి,ఆర్ ఐలు మహేందర్,శ్రీనివాస్, సర్వేయర్ చామంతి,జిపిఓ లు పాల్గొన్నారు.

# మల్కపేటలో ఉచిత వైద్య శిబిరం

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:




కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గురువారంకరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 200 మందికి ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ప్రకాష్ వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్, బీపీ, ఈసీజీ పరీక్షలు చేపట్టి రోగనిర్దారణ చేశారు . ఈ సందర్భంగా మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతోనే ఈ ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించామన్నారు . మెడికవర్ ఆసుపత్రిలో 24 గంటల పాటు అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ శిబిరంలో గ్రామ సర్పంచ్ బోయిని దేవరాజు, వార్డు సభ్యులు, మెడికవర్ మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, శ్రీకాంత్, లక్ష్మిరాజంలు పాల్గొన్నారు.

# గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలి

-పకడ్బందీగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలి

-జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య

**-పంచాయతీ కార్యదర్శులతో సమావేశం**

ముత్తారం, ప్రభాతవార్త:



గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ముత్తారం ఎంపిడిఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ఆయన బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో నిరక్ష్యం వహించవద్దని, సకాలంలో పన్నులు వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధం నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని, ప్రజలకు ఎక్కడా ఎలాంటి సమస్యలు ఎదురవ్వకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ సురేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# జాతీయ సదస్సులో పాల్గొన్న వెనుగుమట్ల ఉపాధ్యాయుడు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఇండియా భాగస్వామ్యంతో అకాడమీ ఫర్ సైన్స్, టెక్నాలజీ అండ్ కమ్యూనికేషన్ (ఏఎస్‌టీసీ) అనే సంస్థ 'ఈనాడు'తో కలిసి గురువారం హైదరాబాద్‌లో 'శాస్త్ర విజ్ఞానాన్ని ప్రయోగశాల నుంచి సమాజంలోకి తీసుకెళ్లడంలో సమాచార పాత్ర వికసిత్ భారత్2047 నిర్మాణం' అనే ఇతివృత్తంతో,మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ డాక్టర్ సౌమ్య స్వామినాథన్ ముఖ్య అతిథులుగా బి.ఎం.బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో నిర్వహించిన ఈ సదస్సులో గొల్లపల్లి మండలం లోని వెనుగుమట్ల ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు తిరుపతి పాల్గొన్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైన్స్ ఉపాధ్యాయులను.. పరిశోధకులు, కమ్యూనికేటర్లు, నిపుణులతో సమ్మిళితం చేసి సైన్స్‌ను ప్రయోగశాల నుంచి సమాజంలోకి తీసుకురావడమే ముఖ్య ఉద్దేశంగా ఈ సదస్సు జరిగినట్లు తెలిపారు.

# విధులు నిరక్ష్యం వహించిన రికార్డు అసిస్టెంట్ పి.లక్ష్మణ్ సస్పెండ్

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

విధులలో నిరక్ష ్యం వహిస్తున్న పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయం రికార్డు అసిస్టెంట్ పి.లక్ష ్మణ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న పి.లక్ష ్మణ్ పూర్తి నిరక్ష్యపు ధోరణితో వ్యవహరిస్తున్నారని, ఎటువంటి సమాచారం అందించకుండా విధులకు గైర్హాజరు కావడం, సమయ పాలన పాటించకపోవడం వంటివి గమనించి అనేక సార్లు మెమోలు, శోకస్ నోటీసుల ద్వారా హెచ్చరించినప్పటికీ ఎటువంటి మార్పు చెందకుండా అదే నిరక్ష ్య ధోరణితో ఉన్నందున రికార్డ్ అసిస్టెంట్ ను సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# విజేతలకు బహుమతుల ప్రదానం

రామగిరి, ప్రభాతవార్త:

రామగిరి మండలం జల్లారం గ్రామ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. గత నాలుగు రోజుల నుండి గ్రామంలో ఈ ప్రీమియర్ క్రికెట్ పోటీలు జరుగుతుండగా వివిధ టీములు పోటీపడ్డాయి. ఫైనల్‌లో మైసమ్మ టీం, బబ్లు టీంలు, పోటీ పడగా ఫైనల్‌లో మైసమ్మ టీం విజేతగా నిలిచి ట్రోఫీతో పాటు 3000 రూపాయల ప్రైజ్ మనీ



దక్కించుకుంది. బబ్లు టీం సెకండ్ ప్రైజుతోపాటు 2000 రూపాయలతో దక్కించుకుందని నిర్వాహకుడు ఏలువాక సతీష్ కుమార్ తెలిపారు.

# ఇండియన్ స్కూల్ టాలెంట్ సెర్చ్ పరీక్ష అబ్బుర పరిచిన గాయత్రి విద్యార్థులు

**-విద్యార్థులకు అంతర్జాతీయ ర్యాంకులు**

పెద్దపల్లి, ప్రభాతవార్త:

విద్యార్థుల అకాడమిక్ ప్రతిభను గుర్తించేందుకు వేసవికాలంలో నిర్వహించిన ఇండియన్ స్కూల్ టాలెంట్ సెర్చ్ (బెంగళూరు) పరీక్షలో పెద్దపల్లిలోని గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు అబ్బుర పరిచారు. ఉత్తమ ప్రతిభ కనబరిచి విద్యార్థులు సర్టిఫికెట్లు, పతకాలు అందుకున్నారు. ఈ పరీక్షలో జంగంపల్లి సాత్విక (9వ తరగతి) 43 అంతర్జాతీయ ర్యాంకు సాధించగా, చాట్ల శ్రీమాన్ (8వ తరగతి ) 48వ ర్యాంక్ సాధించి విశిష్ట ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ శ్రీనివాస్ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించి, కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు.




# సింగరేణి ఆర్జీ 3 జిఎంను కలిసిన ఐఎన్‌టియుసి నాయకులు

రామగిరి, ప్రభాతవార్త:



సింగరేణి ఆర్జీ 3 నూతన జిఎం సుంకర మధుసూదన్‌ను ఐఎన్‌టియుసి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిఎంకు శాలువా కప్పి సన్మానించి, నాయకులను పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి నాయకులు ఎల్లంకి రామారావు, మేకల మారుతి, బత్తుల రమేష్, రామిండ్ల మనోహర్ తదితరులున్నారు.

# మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిజిస్ట్రేషన్ ఛార్జీలు ఉండవు

ప్రిన్సిపాల్ డాక్టర్ కే. వేంకయ్య



**మెట్పల్లి అర్బన్,ప్రభాతవార్త :** మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ లు తీసుకునే విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు ఉండవని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే వేంకయ్య ప్రకటించారు. జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం రోజున బడి బాట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.సంజీవ్ అధ్యక్షతన జరిగిన కార్య క్రమంలో మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య మాట్లాడుతూ, దోస్త్ ద్వారా కళాశాలలో అడ్మిషన్ లు జరుగుతాయని, ఆ సమయంలో విద్యార్థులకు మొదటి దశలో రిజిస్ట్రేషన్ ఛార్జీల పేరుతో సుమారు 200 రూపాయలను ప్రభుత్వానికి చెల్లించ వలసి ఉంటుందని, రెండవ దశలో మాత్రం సుమారు 400 రూపాయలు చెల్లించ వలసి ఉంటుందని అన్నారు. అందువల్ల మొదటి దశలోనే విద్యార్థులు అధిక సంఖ్యలో చేరాలని హితవు పలికారు. ఈ కళాశాలలో చేరిన విద్యార్థులకు ఆ రిజిస్ట్రేషన్ ఛార్జీలను తామే భరిస్తామని స్పష్టం చేశారు. పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వేంకయ్య ప్రకటించారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తౌంటి దేవన్న మాట్లాడుతూ, విద్యార్థులకు జ్ఞానాన్ని అందించి, పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తామని అన్నారు. అనంతరం కళాశాల అకాడమిక్ కో ఆర్డినేటర్ బిల్ల రాజేందర్, కళాశాల కామర్స్ హెచ్. ఓ .డి. ఏ.మనోజ్ కుమార్ తో పాటు లెక్చరర్లు అంజయ్య, శ్రీకాంత్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్లు మధు, సంతోష్, రికార్డు అసిస్టెంట్ శ్రీనివాస్, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కరపత్రాన్ని బోధన, బోధనేతర సిబ్బంది ఆవిష్కరించారు.

# మెట్‌పల్లి వార్త



## ఓటర్ల ముసాయిదా అభ్యంతరాలను పరిశీలించండి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.రాజా గౌడ్



**మెట్ పల్లి టౌన్, ప్రభాతవార్త:** రానున్న మున్సిపల్ సాధారణ ఎన్నికల ప్రక్రియ లో భాగంగా మున్సిపల్ పరిధిలోని ఓటర్ల ముసాయిదా పై అభ్యంతరాలు ఆక్షేపణలను పరిశీలించాలని జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మెట్ పల్లి మున్సిపల్ ప్రత్యేక అధికారి బి రాజా గౌడ్ కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. మున్సిపల్ సాధారణ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డులలో ఓటరు ముసాయిదాపై అభ్యంతరాలను పరిశీలించాలని కమిషనర్ ను కోరారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఎన్నికల నిర్వహణ ప్రక్రియను చేపట్టాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి మోహన్, మేనేజర్ వెంకటలక్ష్మి, డిప్యూటీ ఈఈ నాగేశ్వరరావు, టిపిఒ రాజేంద్రప్రసాద్, టి పి ఎస్ అశోక్, ఆర్ వో మీర్జా అజ్మతుల్లా బేగ్, సానిటరీ ఇన్స్పెక్టర్ అక్షయ్ కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూగ జీవాల వ్యాధుల నివారణకు చర్యలు

పశువైద్య,పశు సంవర్ధక శాఖ ఏ డి డాక్టర్ నరేష్.



**మెట్ పల్లి,ప్రభాతవార్త:** మూగ జీవాల వ్యాధుల నివారణకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటుందని పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఏడి డాక్టర్ బోనగిరి నరేష్ అన్నారు. మండలంలోని వెల్లుల్ల గ్రామంలో పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగిన గొర్రెలకు, మేకలకు పోచమ్మ వ్యాధి నివారణ ఉచిత టీకాల శిబిరాన్ని పశు వైద్య, పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డా. భోనగిరి నరేష్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా అయన వ్యాధి గురించి గొర్ల కాపరులకు అవగాహన కల్పిస్తూ.. ఇది వైరస్ వల్ల వచ్చే వ్యాధి, వ్యాధి సోకిన జీవాల్లో జ్వరం, కంటి, ముక్కు స్రావాలు, శ్వాస తీసుకోడంలో ఇబ్బంది, శరీరం అంత బొబ్బలు ఏర్పడి సరిగా మేత తీసుకోక జీవాలు నీరసించి చనిపోతాయని పేర్కొన్నారు. వ్యాధి సోకిన జీవాల నుండి ఇతర జీవాలకు ప్రత్యక్షంగా వైరస్ సోకిన జంతువుల లాలాజలం, మూత్రం, మలంలో, చర్మ వచ్చే స్కాబ్స్, అలాగే కీటకాలు, ఈగల వల్ల వ్యాప్తి చెందుతుందని వివరించారు. వ్యాధి సోకిన జీవాలను వేరు చేసి, లక్షణాలను బట్టి వైద్యం అందించాల్సి ఉంటుందని, అందువల్ల మూడు నెలల వయస్సు దాటిన అన్ని జీవాలకు టీకాలు వేయించాలని సూచించారు. షెడ్లను శుభ్రంగా ఉంచడం, కీటకాలు, ఈగలు రాకుండా పొగ వేయడం, పురుగుమందులను పిచికారీ చేయడం ద్వారా వ్యాధి రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ కొమ్మెర మనీషా పటేల్, పశువైద్య సహాయక సిబ్బంది రమణయ్య, ఆఫీస్ సబార్డినేట్ దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

## అడవికి నిప్పు ప్రగతికి ముప్పు

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :



అడవికి నిప్పు పెట్టడం వల్ల అనేక నష్టాలు జరుగుతాయని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ అరుణ్ కుమార్ అన్నారు. నిప్పు అడవికి ప్రగతికి ముప్పు అనే కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఇబ్రహీంపట్నం తహసిల్దార్ బి.ఎస్ వరప్రసాద్, ఎంపీడీవో గణేష్ ఫారెస్ట్ బీట్ అధికారులు మధుసూదన్, ప్రదీప్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అటవీ అధికారులు మాట్లాడుతు అడవికి నిప్పు పెట్టడం వల్ల కలిగే నష్టాల గురించి దాని నివారణ గురించి గ్రామస్తులకు వివరించారు. అడవిలో ఉండే జీవరాసులు అన్య కాంతం అవుతాయని వివరించారు. అడవులు వల్ల ఎన్నో లాభాలు ఉన్నాయని ఫారెస్ట్ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘ సభ్యులు ఓపెన్ స్కూల్లో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించాలి

జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.రాజా గౌడ్



**మెట్ పల్లి టౌన్, ప్రభాతవార్త:** మహిళా స్వశక్తి సంఘ సభ్యులు అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో చదవడం రాయడం నేర్చుకుని ఓపెన్ స్కూల్లో పదవ తరగతి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. గురువారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా మహిళా భవనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి పథకమైన యు ఎల్ ఎల్ ఏ ఎస్ ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ మహిళా స్వశక్తి సంఘాల సభ్యులకు అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో చదవడం, రాయడం నేర్చుకోవాలనే శిక్షణ కార్యక్రమానికి జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ డి రాజా గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలందరూ చదవడం, రాయడం నేర్చుకోవాలని అమ్మకు అక్షరమాల కార్యక్రమం నిర్దేశించిన పాఠ్యాంశాల సిలబస్ పూర్తి చేసుకుని తెలంగాణ ఓపెన్ స్కూల్ సిస్టం ద్వారా పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ టీ.మోహన్, ఏవో శ్రీనివాస్ గౌడ్, ఉల్లాస్ ప్రత్యేక అధికారి ప్రతాప్ రావు, డిఎంసి సునీత, టీఎంసీ సోమిరెడ్డి శివకుమార్, సిఒ జ్యోతి, మహిళా సంఘ సమాఖ్య ప్రతినిధులు, పద్మ ,లత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజెన్ క్యాలెండర్ ఆవిష్కరణ



**మెట్ పల్లి,ప్రభాతవార్త:** సీనియర్ సిటిజన్ క్యాలెండర్, డైరీ లను పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో శ్రీనివాస్ గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ.. సీనియర్ సిటిజెన్లకు, వారి కార్యవర్గానికి నూతన సంవత్సర, ముందస్తు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో సీనియర్ సిటిజన్ మెట్పల్లి డివిజన్ అధ్యక్షులు ఒజ్జల బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సౌడాల కమలాకర్, ఉపాధ్యక్షులు మద్దెనపల్లి స్వామి, రాజారాం, గంగారం తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవ వేడుకలు

**మెట్ పల్లి టౌన్, ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం వేడుకల్లో భాగంగా నూతనంగా క్లబ్ మెంబర్ గా వెంకట్రావుపేటకు చెందిన గోపనవేణి తిరుపతి జాయిన్ అయ్యారు. ఆయన ముగ్గురు రైతులు కాయితి లింగం, బేదుగం నవీన్, జి రాజన్న లను దత్తత తీసుకొని వారికి యూరియా, గడ్డి మందు, పురుగుల మందులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు వెల్ముల శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు ఇల్లెందుల శ్రీనివాస్, పోహార్ తుకారాం, మర్రి భాస్కర్, రఘుపతిరావు, గోపన్నవేని తిరుపతి, ఆల్ రౌండర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :



ఇబ్రహీంపట్నం మండలంలోని బర్దిపూర్ గ్రామంలో గురువారం సంఘం నర్సింగో ఆస్పత్రి మెట్ పల్లి వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు రామచందర్ రెడ్డి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 150 మందికి పైగా చికిత్స చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సంగం అమృత, ఉప సర్పంచ్ బీంకర్ అఖిలేష్, మాజీ సర్పంచ్ సంగం సాగర్ వార్డు సభ్యులు వంశీ, రాకేష్ పంచాయితీ కార్యదర్శి దివాకర్, గ్రామస్థాయి వైద్యులు నవీన్, కిషన్ గ్రామ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**.తంగళ్ళపల్లి,ప్రభాతవార్త..**

రోడ్డు పై వెళ్లే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలో రవాణా శాఖా ఆద్వర్యంలో డ్రైవర్లు, స్కూల్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా,ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్,ఎస్పీ మహేష్ బి గీతే హాజరయ్యారు.ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు రోడ్డు భద్రతా బాధ్యత ప్రమాదాల నివారణ పై పాటలు ఆలపించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అధికారులు, డ్రైవర్లు, స్కూల్ విద్యార్థులు రహదారి ప్రతిజ్ఞ చేశారు.ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. దేశంలో గత ఏడాది 4,80,000 ప్రమాదాలు జరిగాయని, దానిలో 1,70,000 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు.

**డ్రైవింగ్ లో ఉన్నప్పుడు ఫోన్ వాడవద్దు**

డ్రైవింగ్ చేసేటప్పుడు ప్రతి డ్రైవర్ ఫోన్ వినియోగించవద్దని ఎస్పీ మహేష్ బీ గీతే సూచించారు. అపరిచిత డ్రైవర్లు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. స్కూల్ ఆటోలు, బస్సులలో పరిమితికి మించి



విద్యార్థులను తరలించవద్దని స్పష్టం చేశారు. ఎక్కువ ప్రమాదాలు డ్రంక్ అండ్ డ్రైవ్ తోనే అవుతున్నాయని తెలిపారు. సెల్ ఫోన్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్ వాహనదారులు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని, సైకిల్ నడిపే పిల్లలు దానికి వాడే హెల్మెట్ వినియోగించాలని తెలిపారు తెలంగాణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ అండ్ స్కిల్స్ (టైడ్స్)ను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బీ గీతే కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సిములేటర్ పై ఎస్పీ కూర్చుని దాని వినియోగం తెలుసుకున్నారు. అలాగే అక్కడ ఏర్పాటు చేసిన ఇంజిన్, ఇతర వాహనాల విడిభాగాల వినియోగం తదితర దురై మురుగన్ వివరించారు.

## నూతన సర్పంచ్‌కు ఘన సన్మానం

**తంగళ్ళపల్లి,ప్రభాతవార్త..**



తంగళ్ళపల్లి మండలం నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ చంద్రిక రెడ్డి ఆధ్వర్యంలో సారంపల్లి గ్రామ సర్పంచ్ గుగ్గిళ్ల లావణ్య ను శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో నేరెళ్ల సర్పంచ్ పొన్నం లక్ష్మణ్, సిహెచ్ఓ కృష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ కరుణాకర్,సూపర్వైజర్ రాంబాయి,ఏఎన్ఎంలు,ఆశ కార్యకర్తలు,గుగ్గిళ్ల శరత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

## కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షినటరాజన్ ను కలిసిన కాంగ్రెస్ నేతలు

**తంగళ్ళపల్లి,ప్రభాతవార్త.**

.హైదరాబాదు లోని ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లను సిరిసిల్ల నియోజకవర్గ మండల కాంగ్రెస్ అధ్యక్షులు,మార్కెట్ కమిటీ అధ్యక్షులు,నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పార్టీ వ్యవహారాలపై చర్చించారు.

## వెల్జీపూర్ లో పాలక వర్గ సమీక్షా సమావేశం

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**

మండలములోని వెల్జీపురం గ్రామంలో నూతనంగా ఎన్నికైన పాలక వర్గం గురువారం స్థానిక అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు.సర్పంచ్ నాయిని నవీన్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో వార్డుల్లోఉన్న సమ స్యను గుర్తించి పరిష్కార మార్గాన్ని కనుకోవాలని సూచించారు.విద్య, వైద్యంకు గ్రామములో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.త్వరలోనే వార్డు సభ్యుల సహకారంతోనూతన పనులకు శ్రీకారం చుడతామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## రేపాకలో పాలకవర్గ ఆధ్వర్యంలో గ్రామ సభ

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



మండలములోని రేపాక గ్రామములోనూతన పాలక వర్గం ఆధ్వర్యంలోగురువారం గ్రామ సభ నిర్వహించారు.సర్పంచ్ కాత మల్లేశం అధ్యక్షతన జరిగిన సమావేశములోశాఖల వారీగా రివ్యూ నిర్వహించారు.ప్రధాన శాఖలలోఉన్న సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడానికి తీర్మానం చేశారు.ఈకార్యక్రమం లో ఉపసర్పంచ్ మహేష్,వార్డు సభ్యులు,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి చెట్టుకు ఆటో ఢీ పలువురికి గాయాలు

**గంభీరావుపేట, ప్రభాతవార్త:**

అదుపుతప్పి ఆటో చెట్టుకు ఢీ కొట్టి పలువురికి గాయాలైన సంఘటన గురువారము సాయంత్రము గంభీరావుపేట మండలంలో చోటుచేసుకుంది. కామారెడ్డికి చెందిన 12 మంది క్యాటరింగ్ చేసే వ్యక్తులు మండల కేంద్రంలోని ఒక వివాహ కార్యక్రమం నిర్వహించేందుకు ఆటోలో తరలివస్తున్నారు. మండల పరిధిలోని ముస్తఫనగర్ గ్రామ శివారులో ఆటో అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న 12 మందిలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో పదిమందికి గాయాలు కాగా వారిని తక్షణము చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్ర గాయాలైన ఇరువురు వ్యక్తులను మెరుగైన చికిత్స కై కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షున్ని కలిసిన మండల నాయకులు

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షున్ని మండల పార్టీ నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ను రాష్ట్ర అధ్యక్షునిగా ఎంపిక చేయడముతో హైదరాబాదులోని సీఎల్పీ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలోపార్టీ మండల శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి,మాజీ ఎంపీపీలు ఉట్కూరి వెంకటరమణారెడ్డి,గుడిసె ఐలయ్య,ఇల్లంతకుంట సర్పంచ్ మామిడి రాజు ఉన్నారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవు

**సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త**

జిల్లా ఎస్పీ మహేష్ బి. గితేరోడ్డు ప్రమాదాల నివారణకే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలుబహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవు అని జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే అన్నారు.బుధవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 61 మందిపై , మద్యం సేవించి వాహనాలు నడిపిన 55 మందిపై కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజాశాంతి భద్రతలు,రోడ్డు ప్రమాదాల నివారణయే లక్ష్యంగా జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం , మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తోందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే ప్రాంతాలపై నిరంతరం నిఘా ఉంచుతున్నామని, అందులో భాగంగానే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రత్యేకంగా రాత్రి సమయాల్లో లైటింగ్ తక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి అక్కడ మరింత సమర్థవంతంగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన వ్యక్తుల యొక్క డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని ఆ యొక్క లైసెన్స్ రద్దుకు సంబంధిత రవాణా శాఖ అధికారులకు సిఫారసు చేయడం జరుగుతుందని తెలిపారు.




## మండల అధికారులను కలిసిన మండల సర్పంచ్‌లు.

**.తంగళ్ళపల్లి,ప్రభాతవార్త.**



.తంగళ్ళపల్లి మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు పూర్మనీ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల అధికారులు ఎమ్మార్వో జయంత్,ఎంపీడీవో లక్ష్మీనారాయణ,ఎస్సై ఉపేందర్ చారి లను మండల నూతన సర్పంచులు,నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా అధికారులు నూతన సర్పంచులకు శుభాకాంక్షలు తెలిపారు.

## విద్యార్థులకు చట్టాలపై అవగాహన అవసరం

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



విద్యార్థులు ముఖ్యంగా చట్టాల గూర్చి అవగాహన పెంచుకోవాలని ఎస్ ఐ అశోక్ తెలిపారు. మండలములోని రహింఖాన్ పేట ఆదర్శ పాఠశాలలోగురువారం బాలికల సాధికారత అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ట్రాఫికింగ్ బాల్య వివాహల నివారణ,మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాల గూర్చి వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్,కన్వీనర్ రాగవ నాలిక,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## అధికారులను మర్యాద పూర్వకంగా కలిసిన సర్పంచ్



**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**

మండలములోఉన్న వివిధ శాఖల అధికారులను నూతనంగా ఎన్నికైన వల్లంపట్ల సర్పంచ్ నేరెళ్ల విజయ్ గౌడ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు.తహసీల్దార్ ఫారూక్,ఎంపిడివో,ఎస్సై, వైద్యాధికారితో పాటు తదితర శాఖల అధికారులను కలిశారు.ఈ కార్యక్రమంలోకాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## తహసీల్దార్ కు రాజ్యాధికార పార్టీ నాయకుల వినతి

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



స్థానిక తహసీల్దార్ ఫారూక్ కు తెలంగాణ రాజ్యాధికారి పార్టీ నాయకులు గురువారం వినతి పత్రం అందించారు.పార్టీ వ్యవస్థాపకులు తీన్మార్ మల్లన్న పిలుపుమేరకు బీసీ సబ్ ప్లాన్ వెంటనే అమలు చేయాలనీ వినతిలో పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలోమండల అధ్యక్షులు మొగిల్ల బాబు,ప్రధాన కార్యదర్శి ఓల్లాల రమేష్ ఉన్నారు.

# న్యాయవాదులను ప్రభుత్వాలు గుర్తించాలి

-న్యాయవాదులకు రక్షణ చట్టం రావాలి

-మన హక్కులు మనం కాపాడుకోకపోతే మనుగడ ప్రశ్నార్థకమే

-తెలంగాణ బార్ కౌన్సిల్ అభ్యర్థి వి.రఘునాథ్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



న్యాయవాదులను ప్రభుత్వాలు గుర్తించాలిన్యాయం కోసం చట్ట బద్దంగా పోరాటం చేసే న్యాయవాదులకే రక్షణ లేకుండా పోయిందని, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని హై కోర్టు సీనియర్ న్యాయవాది, హై కోర్ట్ న్యాయవాదుల అసోసియేషన్ మాజీ అధ్యక్షులు వి.రఘునాథ్ అన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులుగా పోటీ చేస్తున్న ఆయన గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని కోర్టుకు ఎన్నికల ప్రచారం నిమిత్తం విచ్చేశారు. జగిత్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాచకొండ శ్రీరాములు అధ్యక్షతన బార్ అసోసియేషన్ హాల్ లో ఆయన న్యాయవాదులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులతో పాటు జర్నలిస్టుల రక్షణ కోసం కూడా ప్రత్యేక చట్టాలు తీసుకు రావాల్సిన అవసరం ఉందని అన్నారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారం కోసం, కోర్టు లలో మోలిక వసతుల ఏర్పాటు కోసం, న్యాయవాదుల, పౌరుల హక్కుల సాధన కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. న్యాయవాదుల కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఆరోగ్య భీమా, కనీస జీవిత బీమా పథకం అమలు అయ్యేలా పోరాటం



చేస్తానని తెలిపారు. యువ న్యాయవాదులకు, మహిళా న్యాయవాదులకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టులలో తగు వసతుల ఏర్పాటుతో పాటు లైబ్రరీలు ఏర్పాటు చేపిస్తామని పేర్కొన్నారు. న్యాయస్థానాలలో న్యాయ మూర్తులకు, న్యాయవాదులకు, కోర్టు లలో పని చేసే అధికారులు, సిబ్బందికి గల సమస్యలు, రాజ్యం పరంగా జరుగుతున్న తీర్పులపై పోరాటం చేద్దామన్నారు. తెలంగాణ బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులు, న్యాయ పోరాటం, హై కోర్టు తో సహా రాష్ట్రంలోని అన్ని కోర్టులలో గల సమస్యల పరిష్కారం కోసం, న్యాయవాదుల రక్షణ కోసం, న్యాయవాదుల హక్కుల సాధన కోసం, న్యాయ వృత్తికి సమాజంలో మంచి గుర్తింపు కోసం పోరాడుతూ అందరికీ అన్ని వేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తానని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ లో కూడా అనేక మార్పులు తీసుకొచ్చి, అందరికీ బార్ కౌన్సిల్ సేవలు అందించాలనే లక్ష్యం తోనే ఈ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్ లో సీనియర్ న్యాయవాదులతో పాటు యువ, మహిళా న్యాయవాదులకు, సరైన గౌరవం దక్కేలా కృషి చేస్తానని అభయమిచ్చారు. అనంతరం కోరుట్ల, మెట్పల్లి బార్ అసోసియేషన్ లలో కూడా ఆయన బృందంతో స్వయంగా కలిసి తోటి న్యాయవాదుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమావేశాలలో ఆయన మాట్లాడారు. జగిత్యాల, మెట్ పల్లి బార్ అసోసియేషన్ ల అధ్యక్షులు రాచకొండ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి అందె మారుతి, బండ భాస్కర్ రెడ్డి, గోవిందుల రాజన్న, దామోదర్ రావు, బిరుదుల లక్ష్మణ్, కరవత్తుల భూమయ్య, భూమి రమణ, కందుకూరి కృష్ణా రెడ్డి, పాదం తిరుపతి, పాదం హారిక, పాదం రాజేందర్, క్యాస రఘునాథ్, ఉమా మహేష్, మల్లేష్, బొల్లె రాజన్న, పసునూరి శ్రీనివాస్ తదితరుల తో పాటు అనేక మంది న్యాయవాదులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత నియమాలు పాటించడం మనందరి భాధ్యత

-ముందు జాగ్రత్త తోనే ప్రమాదాలకు నివారణ

-జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

-జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం - 2026

బైక్ ర్యాలీ కార్యక్రమం విజయవంతం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లాలో రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆధ్వర్యంలోజాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం – 2026" బైక్ ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. గురువారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవం – 2026 బైక్ ర్యాలీని జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యమని



తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాల్సిన అవసరం ఉందన్నారు. మద్యం సేవించి వాహనం నడపరాదని హెచ్చరించారు. అధిక వేగం ప్రమాదాలకు ప్రధాన కారణమని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదన్నారు. వాహన పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. రోడ్ సేఫ్టీ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ ర్యాలీ కలెక్టరేట్ నుండి కొత్త బస్టాండ్ వరకు కొనసాగింది. హెల్మెట్ ధరించండి – ప్రాణాలు కాపాడుకోండి" అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం లో అధికారులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ)బి.ఎస్. లత, జిల్లా అధికారులు, రవాణా శాఖ, పోలీస్, కలెక్టరేట్ సిబ్బంది, వివిధ స్థాయిల అధికారులు, ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల వార్త

## నీరజ చంద్రన్‌కు సభా సమన్వయ కర్త పురస్కారం

జగిత్యాల టౌన్ ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ ఆంధ్ర సారస్వత సమితి ఆధ్వర్యంలో గుంటూరులో మూడు రోజులపాటు జరిగిన మూడవ ప్రపంచ తెలుగు మహాసభలలో కవి సమ్మేళనం వేదిక సమన్వయకర్తగా వ్యవహరించిన కళాశ్రీ ఈశ్వరమ్మ సాహితీ పీఠం జగిత్యాల సమూహ ప్రధాన అడ్మిన్ రచయిత్రి చౌటపల్లి నీరజ చంద్రన్ ను అదే వేదికపై ఘనంగా సన్మానించారు. 1058 కవులతో జరిగిన కవి సమ్మేళన వేదికకు కవయిత్రి నీరజ చంద్రన్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ వేదికపై చౌటపల్లి. నీరజ చంద్రన్ హైకోర్టు న్యాయమూర్తి బి. కృష్ణ మోహనరావు, ఆంధ్రప్రదేశ్ సభాపతి అయ్యన్న పాత్రుడు, గజల్ శ్రీనివాస్ తదితర ప్రముఖులు ఆమెను గౌరవ సభా సమన్వయ కర్త పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా కళాశ్రీ అధినేత గుండేటి రాజు, మాడిశెట్టి శ్రీనివాస్, కవయిత్రి లక్కరాజు శ్రీలక్ష్మి, ఓదెల గంగాధర్ తదితరులు హర్షం వెలిబుచ్చారు.

## కండ్లపల్లి చెరువు మత్తడి ధ్వంసం

అధికారులపై మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఆగ్రహం

జగిత్యాలరూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల పట్టణంలో గల ఇందిరా భవన్‌లో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డిని కలిసిన కండ్లపల్లి గ్రామ రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. కండ్లపల్లి చెరువు మత్తడిని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం వల్ల నీరు వృధాగా పోతోందని, దీనివల్ల వందలాది ఎకరాల్లో వేసిన పంట నారు ఎండిపోయి తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన మాజీమంత్రి తాడిపర్తి జీవన్ రెడ్డి నీటి పారుదల శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడి చెరువు మత్తడిని ధ్వంసం చేసిన వారిని గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఒకవేళ ప్రభుత్వ అధికారులే మరమ్మతుల కోసం మత్తడిని తొలగించి ఉంటే, రైతులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, క్రాప్ హాలిడే ప్రకటించకుండా ఇలా చేయడం సరైన పద్ధతి కాదని ఇప్పటికే రైతులు పంట నారు పోసుకున్నందున, పంటలు ఎండిపోకముందే యుద్ధప్రతిపాదికన మత్తడికి మరమ్మతులు చేసి నీటిని నిల్వ చేయాలని సూచించారు. మరమ్మతులు ఏవైనా ఉంటే పంటలు చేతికి వచ్చే మార్చి నెలతర్వాత చేపట్టాలని, రైతుల ప్రయోజనాలను దెబ్బతీయవద్దని అధికారులను కోరారు. రైతుల పక్షాన నిలిచిన జీవన్ రెడ్డి, వెంటనే మత్తడిని పూడ్చి సాగు నీరు వృధా కాకుండా చూడాలని అధికారులకు సూచించారు.

# జాగృతి విద్యా విహార్ విద్యార్థుల పొలం బడిబాట కార్యక్రమం

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ జాబితాపూర్ గ్రామంలో సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా జాగృతి విద్యా విహార ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పొలం బడిబాట కార్యక్రమం కనువిందుగా సాగింది. మన సాంస్కృతి సంప్రదాయలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో పాఠశాల యజమాన్యం ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించింది. ఈ కార్యక్రమన్నీ మాజీ ఎంపీపీ జంగిలి రాజిరెడ్డి ప్రారంభించి గ్రామ పంచాయతీ కార్యాలయం నుండి విద్యార్థులు ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన భోగి మంటల కార్యక్రమంలో అందరూ పాల్గొని పాత జ్ఞాపకాలను వీడి కొత్త వెలుగులు వైపు సాగాలని ఆకాంక్షించారు. మాజీ జెడ్పిటిసి జంగిలి సత్తమ్మ, పాఠశాల ప్రిన్సిపల్ జంగిలి తిరుపతి నేతృత్వంలో విద్యార్థులు పొలాల్లోకి వెళ్లి ప్రకృతిలో మమేకమయ్యారు. వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ నిర్వహించిన ఈ పొలంబడి బాట పిల్లలకు కొత్త అనుభూతిని అందించింది. సాంప్రదాయ దుస్తులు చిన్నారులు చేసిన సందడి గ్రామంలో పండుగ వాతావరణాన్ని ముందే తీసుకొచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జంగిలి తిరుపతి మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక జ్ఞానంతో పాటు మన మూలమైన వ్యవసాయం, పొలం బాడిబాట విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. పంటలు పండించే విధానం రైతు కష్టం, ప్రకృతి ప్రాముఖ్యతను పండుగ విశిష్టతలను తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోనీశెట్టి మహేష్, ఉప సర్పంచ్ మారిశెట్టి లక్ష్మణ్, వార్డ్ నెంబర్స్ గర్వందుల కళ్యాణి జలంధర్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.







# ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

### ప్రత్యేక సిలబస్, నాణ్యమైన విద్యజిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

*తిమ్మాపూర్, ప్రభాత వార్త:*

విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారులను చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలోని ప్రభుత్వ పూర్వ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ప్రీ ప్రైమరీ చిన్నారులకు యూనిఫామ్, పుస్తకాలు, స్టేషనరీ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 33 ప్రభుత్వ పూర్వ ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించామని తెలిపారు. నైపుణ్యం గల శిక్షణ పొందిన ఉపాధ్యాయులు నాణ్యమైన బోధనను అందిస్తారని అన్నారు. ప్రత్యేక సెలబస్ ద్వారా పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే పూర్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత, నాణ్యమైన విద్య అందుతోందని యూనిఫాం, పుస్తకాలు వంటివి ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. ప్రీ ప్రైమరీ చిన్నారులకు ఉచితంగా షూ అందజేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ప్రీ ప్రైమరీ స్కూళ్లలో పిల్లల నమోదు, హాజరు పెంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సందర్శన.. పర్లపెల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. మూడవ తరగతి విద్యార్థులతో పాఠాలు చదివించారు. రోజు చదవడం, రాయడం తప్పనిసరిగా అలవర్చుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు పాఠాన్ని చెప్పడమే కాకుండా విషయాన్ని అర్థం చేయించడం చాలా ముఖ్యమని తెలిపారు. బుధవారం బోధనను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, గ్రామ సర్పంచ్ సూరం స్వప్న, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్, హెచ్ ఎం మంజుల తదితరులు పాల్గొన్నారు.



# హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోండి

### జిల్లా జడ్జి శివకుమార్

*కరీంనగర్ లీగల్,ప్రభాతవార్త:*

హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా జడ్జి ఎస్. శివకుమార్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలకు అనుగుణంగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలో గురువారం హెల్మెట్ ధరించడంపై అవగాహనా ర్యాలీని చేపట్టారు. జనవరి 5 నుండి 9 వరకు జిల్లా న్యాయ సేవా ధికార సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న రోడ్ సురక్షా అభియాన్, రహదారి భద్రత అభియాన్ ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా జిల్లా కోర్టు ప్రాంగణం నుండి ఇందిరా గాంధీ కూడలి వరకు ప్లే కార్డులు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా రవాణా శాఖ,ట్రాఫిక్ పోలీస్ లు సంయుక్తంగా చేపట్టిన ర్యాలీ ని జిల్లా జడ్జి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ను తప్పక ధరించాలని, మోటారుకారు నడుపుతున్న వ్యక్తులు విధిగా సీట్ బెల్ట్ లను పెట్టుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి సురక్షితంగా వాహనాలను నడపాలని కోరారు. రోడ్డు నియమాలను పాటించకపోవడంతో చాల మంది మరణిస్తున్నారని, కొంత మంది అంగవైకల్యము పొందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాశాఖ కమిషనర్ పి. పురుషోత్తం,ట్రాఫిక్ ఏసిపి స్వామి, కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, జనరల్ సెక్రెటరీ కే. అరుణ్ కుమార్, డిప్యూటీ లీగల్ ఏడ్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేష్, పబ్లిక్ ప్రసిక్యూటర్లు గౌరు రాజిరెడ్డి, మంచికట్ల రాజేశం, సర్దార్ రవీందర్ సింగ్, శ్రీధర్ రావు, న్యాయవాదులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల సందర్శన

*కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త:*

శాతవాహన యూనివర్సిటీ సమీపంలోని ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి గురువారం సందర్శించారు. ఆశ్రమ పాఠశాల తరగతి గదులను పరిశీలించారు. డైనింగ్ హాల్, కంప్యూటర్ గది, హాస్టల్ తదితర వసతులను పరిశీలించారు. విద్యార్థులు ఏ యే రంగాల్లో ఉత్సాహంగా ఉన్నారో వాటిలో శిక్షణ ఇప్పించేందుకు ప్రిన్సిపాల్ ను ఆదేశించారు. సంగీతం, గానంలో మరింతగా శిక్షణ ఇవ్వాలని మ్యూజిక్ టీచర్ కు సూచించారు. పెయింటింగ్స్, అల్లికలు వంటి కళల్లో రాణిస్తున్న వారికి వివిధ సదుపాయాలు కల్పించాలని, అవసరమైన మెటీరియల్ సమకూర్చాలన్నారు. బధిర విద్యార్థులు సైతం విభిన్న రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో కుట్టు మిషన్, కంప్యూటర్ రంగంలో శిక్షణ ఇస్తున్నామని అన్నారు. ఇందుకోసం ఒకేషనల్ టీచర్లను కేటాయించామని తెలిపారు. ఈ రకమైన శిక్షణల వల్ల వారు భవిష్యత్తులో విభిన్న రంగాల్లో స్థిరపడతారని, మార్కెటింగ్ పై కూడా అవగాహన వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ రాంబాబు, ప్రిన్సిపాల్ భాస్కర్, సంగీత ఉపాధ్యాయుని సరళ పాల్గొన్నారు.



# బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష

*కరీంనగర్ కల్చరల్, ప్రభాతవార్త:*

జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో గల శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆలయ చైర్మన్లు, దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులతో సమీక్షించారు. వెంకటేశ్వ రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 23 నుంచి 30 వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాల నిర్వహణపై గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, షామియానాకు, క్యూ లైన్లు, బారికేడ్లు తదితర అన్ని సౌకర్యాలు కల్పిస్తూ ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆలయ పరిసరాల్లో పారిశుద్ధం లోపించకుండా చూడాలని, ఆహార వ్యర్థాలు రోడ్లపై పడేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ట్రాఫిక్, పోలీస్, ఫైర్, రెవెన్యూ, మున్సిపల్ తదితర విభాగాలు సమన్వయంతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలని పేర్కొన్నారు. క్యూ లైన్లు ఏర్పాటు చేసి బారికేడ్లతో బందోబస్తు నిర్వహించాలన్నారు. స్టేజి, లైటింగ్, సౌండ్, డెకరేషన్ పై ప్రత్యేక దృష్టి సారించాలని, షార్ట్ సర్క్యూట్ జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆలయ చైర్మన్లు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో సుధాకర్, ఆలయ అర్చకులు నాగరాజు పాల్గొన్నారు.



## కరీంనగర్ వార్త

# అల్ఫోర్స్ మహిళా కాలేజీ కామర్స్ మీట్

*కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త:*

కరీంనగర్ కెమిస్ట్ భవన్ లో అల్ఫోర్స్ ఉమెన్స్ డిగ్రీ, పీజీ కాలేజీ, కరీంనగర్ కామర్స్ క్లబ్ ట్రేడ్ టైటాన్స్ ఆధ్వర్యం లో నిర్వహించిన తొలి కామర్స్ మీట్ సినర్జీ ఘనంగా గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి శాతవాహన యూనివర్సిటీ కామర్స్ విభాగ అధిపతి డా. డి .హరికాంత్ ముఖ్య అతిథిగా పాల్గొనగా అల్ఫోర్స్ మహిళ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు. హరికాంత్ మాట్లాడుతూ వాణిజ్య విద్య ప్రస్తుత అవసరం, భవిష్యత్ అవకాశాలపై ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. కళాశాల కరెస్పాండెంట్ రవిందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యార్థుల్లో వాణిజ్య విజ్ఞానం, సృజనాత్మక ఆలోచనలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించబడ్డాయనీ తెలిపారు. జీఎస్టీ ప్రభావం, భారతదేశంలో క్యాష్‌లెస్ ఎకానమీ, ఈ-కామర్స్ పాత్ర, వ్యాపార నమూనాల రకాలు వంటి అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లతో వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, కామర్స్ అధ్యాపకులు, విద్యార్థినిలు పాల్గొన్నారు.



# నెహ్రూ చరిత్రపై కాంగ్రెస్ పార్టీకి అవగాహన లేదు..

### కాంగ్రెస్ కు రాహుల్ గాంధీ ఐరన్ లెగ్..

### బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు..

*మానకొండూర్, ప్రభాతవార్త:*

స్వతంత్ర సమరయోధుడు నెహ్రు చరిత్రపై కాంగ్రెస్ పార్టీకి అవగాహనలేదని, ఆయన చరిత్ర కాంగ్రెస్ నేతలకు తెలవకపోవడం సిగ్గుచేటని బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు ఆరోపించారు. గురువారం మానకొండూరు మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవి రామకృష్ణారావు మాట్లాడుతూ.. పార్లమెంటులో నెహ్రూపై బిజెపి నేతలు దాడులు చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ నేతలు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ మంత్రులు కేటీఆర్ పై చేసిన వ్యాఖ్యలకు జివిఆర్ దీటుగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో ఇందిరాగాంధీ ఐరన్ లేడీ, నెహ్రూ స్వతంత్ర సమరయోధుడు, రాహుల్ గాంధీ ఐటి విప్లవానికి పునాది వేసిన గొప్ప నేత, అదే కుటుంబంలో రాహుల్ గాంధీ ప్రభావం కాంగ్రెస్ పార్టీలో శూన్యం మని, రాజకీయంగా రాహుల్ గాంధీ ఐరన్ లెగ్ అన్నారు. రాహుల్ గాంధీ పై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను బిఆర్ఎస్ పార్టీ సంపూర్ణంగా సమర్థిస్తున్నామని అన్నారు. విబి రాంజీ పథకం పేరుతో మోడీ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వంకు ఉచ్చు బిగించిందన్నారు. కేటీఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పిటిసి శేఖర్ గౌడ్, పచ్చునూర్ సర్పంచ్ పార్నంది కిషన్, బిఆర్ఎస్ నేతలు శాతరాజు యాదగిరి, పిట్టల మధు, బోడ రాజశేఖర్, సందీప్, అభిలాష్, బి ఆర్ ఎస్ నేతలు పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం..

## ఎసిపి మాధవి హెచ్చరిక..

### 8ట్రాక్టర్ల పట్టివేత.. గ్రామాల్లో భద్రత భరోసాపై సమావేశాలు..

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనింగ్ శాఖ నిబంధనల మేరకు ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై ఉక్కుపాదం మోపుతామని చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హుజూరాబాద్ ఎసిపి వాసంశెట్టి మాధవి హెచ్చరించారు. గురువారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండల పరిధిలోని గండ్రపల్లి, వావిలాల, తనుగుల, విలాసాగర్ గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణ, అక్రమ కార్యకలాపాల నియంత్రణపై ప్రజల్లో నమ్మకం పెంపొందించడమే లక్ష్యంగా ఎసిపి మాధవి ఆధ్వర్యంలో జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ గౌడ్, రూరల్ సిఐ లక్ష్మీనారాయణ, ఎస్సైలు ఎం నాగరాజు, క్రాంతి కుమార్, పోలీసు బలగాలతో గ్రామాలలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాలలో గ్రామ కూడళ్ల వద్ద ప్రజలతో సమావేశం ఏర్పాటు చేసి ముఖాముఖి సమావేశం అయ్యారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు అక్రమ ఇసుక రవాణా, గంజాయి వినియోగం, అసాంఘీక కార్యకలాపాలు యువతపై పడుతున్న ప్రతికూల ప్రభావం, రోడ్డు భద్రత నియమాలు, మహిళల, వృద్ధుల భద్రత అంశాలపై గ్రామాలలో ప్రజలకు ఎసిపి మాధవి సూచనలు చేసారు. గ్రామాలలో గుర్తుతెలియని వ్యక్తులు సంచరించిన, అనుమానం వచ్చిన సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు. ఇసుక రవాణాదారులు ఎంతటివారైన సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎసిపి మాధవి హెచ్చరించారు. కమ్యూనిటీ కాంట్రాక్ట్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీలలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 8ట్రాక్టర్లను పోలీసులు సీజ్ చేసారు. ఇసుక మాఫియాగా కొంతమంది ఏర్పడి గ్రామీణ ప్రాంతాలను కేంద్రాలుగా చేసుకుని అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఈ దాడులు నిర్వహించినట్లు ఎసిపి వెల్లడించారు. ప్రభుత్వ ఆస్తుల దోపిడి అక్రమ ఇసుక రవాణా అసాంఘీక కార్యకలాపాలపై నిఘా ఏర్పాటు చేసామని ఎవ్వరు చట్టాన్ని అదిగమించిన చర్యలు తప్పవని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని ఆమె హెచ్చరించారు. గ్రామాలలోని ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని ఎవరైన అక్రమ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు దృష్టికి వస్తే తక్షణమే సమాచారం అందించాలని వివరించారు. ప్రజల సహకారంతోనే నేర రహిత సమాజం సాధ్యమవుతుందని ఎసిపి మాధవి పేర్కొన్నారు. జమ్మికుంట మండల వ్యాప్తంగా అక్రమ ఇసుక రవాణా మధ్యం, అక్రమ విక్రయాలు, అసాంఘీక కార్యకలాపాలపై నిరంతర నిఘా కొనసాగిస్తామని అన్నారు. అవసరమైతే ఆకస్మిక తనిఖీలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులతో పాటు సివిల్ పోలీస్ బలగాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి.



## కన్నుల పండుగగా.. శ్రీ వెంకటేశ్వరస్వామి ఉంజల్‌సేవ.. అశేశంగా హజరైన భక్తులు..

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త;;;

కలియుగ ప్రత్యేక్ష దైవం శ్రీ ఏడుకొండల వెంకటేశ్వరస్వామికి కరీంనగర్ జిల్లా జమ్మికుంట వెంకటాద్రినగర్‌లోని స్వామివారి ఆలయంలో భక్తుల విరాళాలతో సహస్ర దీపాలంకరణ సేవ, ఉంజల్‌సేవ కార్యక్రమాలు ధనుర్మాస పర్వదినాల సందర్భంగా గురువారం తెల్లవారుజామున అత్యంత భక్తిశ్రద్దలతో కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కసుబోజ్జల వేణుగోపాలచార్యులు, అర్చకులు డింగరి హరికృష్ణమాచార్యులు చేతుల మీదుగా సహస్ర కళాశాభిషేకం వైభవంగా నిర్వహించారు. ధనుర్మాస పాశురాలలో భాగంగా 24వ రోజు ఆలయాన్ని సర్వంగా సుందరంగా అలంకరించారు. గత 17 సంవత్సరాలుగా పట్టణంలోని ఆండాల్ సేవసమితి మహిళ సభ్యులు 30మంది ఆరులక్షల పైచిలుకు విరాళాలుగా వేసుకుని సహస్ర కళాశపూజకు 1108 దీపాలతో బ్రాస్ (స్టాండ్) చేయించి ఈ ఉత్సవాల సందర్భంగా అశేశంగా హజరైన వందలాది మందిభక్తులతో దీపాలను వెలిగింపజేసారు. ఆలయ కమిటి పాలకవర్గ చైర్మన్ ముక్క జితేందర్ గుప్తా ఆలయ పాలకవర్గ సభ్యులు సకల ఏర్పాట్లు చేసారు. చల్లటి ఈదురుగాలలను సైతం లెక్క చేకుండా వందలాది కుటుంబాలో ఉదయం 4.30 గంటల సమయంలో పాశురాల గీతాలాపనలో పాల్గొనగా, ఉంజల్ సేవ కార్యక్రమంలో పల్లకిపై శ్రీ భూనీల సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి



ఉతసవామూర్తులను పల్లికిలో ఆసిన్నులను గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు పల్లకిని ఆలయం చుట్టూ పలు ప్రదక్షిణలు గావించారు. ఇక నుండి ప్రతి శనివారం సాయంత్రం స్వామివారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వెల్లడించింది. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, బచ్చు వీరలింగం, పి సంపత్‌రావు, పుల్లూరి శ్రీనివాస్, శివనాథుని కిషన్, నీలకంఠ వేణుగోపాల్, వెంకటిరెడ్డి, అయిత మురళి ఆండాల్ సేవాసమితి సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నూతన జీపి సర్పంచులకు సన్మానం

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఎన్నికైన ముగ్గురు సర్పంచులను గురువారం హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హుజురాబాద్ మండలం రాజపల్లి సర్పంచ్ గా ఎంపికైన గూడూరు మల్లారెడ్డిని, సైదాపూర్ మండలం రాముల పల్లె సర్పంచ్ గా ఎన్నికైన అనుమాండ్ల రామ్ రెడ్డిని, ఎలబోతారం సర్పంచ్ గా ఎంపికైన నమ్మిండ్ల రవీందర్ లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. వాకర్స్ అసోసియేషన్ లో సభ్యులుగా ఉన్న వీరు ప్రజా ప్రతినిధులుగా ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. వారు ప్రజాసేవలో మంచి పేరు సాధించి మరిన్ని ఉన్నత పదవులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, హాకీ క్లబ్ మాజీ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, సామాజికవేత్త వర్ధినేని రవీందర్ రావు,



నాగార్జున డైరీ అధినేత పుల్లూరి ప్రభాకర్ రావు, మాజీ కౌన్సిలర్లు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, చింత శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపిపి పొడిశెట్టి వెంకట రాజం, పివి జిల్లా సాధన సమితి నాయకులు భీమోజు సదానందం, ఈశ్వర్ రెడ్డి, వేల్పుల రత్నం, ధనవర్ష రాజు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కార్యదర్శి ఎండి. మతిన్, కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి, కందాల రమేష్, మాజీ అధ్యక్షులు గోవర్ధన్, పాక సతీష్, సొల్లు సారయ్య, ఉప్పు శ్రీనివాస్ పటేల్, వేల్పుల ప్రభాకర్, సమ్మయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మహిళా టౌన్ సిఐ గా రఫీక్ ఖాన్

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:

మహిళా టౌన్ ఇన్స్పెక్టర్ గా రఫీక్ ఖాన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. కొద్దిరోజుల క్రితం మహిళా టౌన్ సిఐ గా పని చేసిన శ్రీలత బదిలీ కాగా అప్పటినుంచి ఇన్స్పెక్టర్గా ఎవరిని నియమించలేదు. భార్యాభర్తల మధ్య ఒక కేసు విషయంలో సిఐ శ్రీలత వేధింపులకు గురి చేసిందని రెవెన్యూ ఉద్యోగి సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మృతి చెందాడు. ఈ ఘటనపై ఆరోపణలు ఎదుర్కొన్న పలువురు పోలీసు అధికారులపై విచారణకు కూడా ఆదేశించారు. ఈ క్రమంలోనే ఇన్స్పెక్టర్ శ్రీలతపై బదిలీ వేటపడగా అప్పటినుంచి మహిళా టౌన్ సిఐ గా ఎవరిని నియమించలేదు. గురువారం కరీంనగర్ కమిషనర్ వెయిటింగ్ లో ఉన్న ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్ కు పోస్టింగ్ ఇవ్వడంతో విధుల్లో చేరారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీసు ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.

హుజూరాబాద్ వార్త

## ఆత్మహత్యకు పాల్పడిన మాజీ కౌన్సిలర్ పొనగంటి సారంగం..

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపాలిటీలోని 7వ వార్డు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పొనగంటి సారంగం గురువారం రాత్రి తన వ్యవసాయ భూమి వద్ద గడ్డిమందు త్రాగి ఆత్మహత్య పాల్పడడంతో



ఆలస్యంగా గుర్తించిన కుటుంబీకులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. సారంగం ప్రైవేట్ ఫైనాన్సర్‌గా, వ్యవసాయదారునిగా చలామని అయ్యాడు. గత మున్సిపల్ ఎన్నికలలో 7వ వార్డులో పోటీచేసి బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్‌గా గెలుపొందాడు. కొంత కాలం క్రితం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నాడు. కొద్ది రోజుల్లో జరుగనున్న మున్సిపల్ ఎన్నికలలో తిరిగి పోటీ చేయడానికి సన్నద్దం అవుతున్న సారంగం ఆర్థికపరమైన అంశాలలో సతమతమవుతున్నట్లు తాను స్వయంగా రాసిన సూసైడ్ నోట్‌లో వెల్లడించారు.



సారంగం ఆత్మహత్యయత్నానికి ఆర్థిక సమస్యలే ప్రధాన కారణమా..? ఇంక ఏమైన కారణాలు ఉన్నాయా అన్న కోణంలో కుటుంబీకులు శోదిస్తున్నారు. సారంగం ఆరోగ్యంగా క్షీణించడంతో వరంగల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రి నుండి ఎంజిఎం ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. సుమారు రాత్రి 8గంటల ప్రాంతంలో మృతి చేందినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు. ఒక ప్రజాప్రతినిధి ఆత్మహత్యకుపాల్పడడం పట్ల జమ్మికుంట మున్సిపల్ పరిదిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

## పివి జిల్లా ఏర్పాటుకై భారీ ర్యాలీ

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

హుజురాబాద్ ని కేంద్రంగా చేస్తూ పివి జిల్లాను ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం హుజురాబాద్ పట్టణంలో పివి జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గురువారం హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం నుండి పలువురు



ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మేధావులు, యువకులు, ఉద్యోగులు ర్యాలీగా నినాదాలు చేస్తూ అంబేద్కర్ చౌరస్తా మీదుగా పివి విగ్రహం వరకు ఊరేగింపు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి, పివి విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేయడం సంతోషకరమని, హుజురాబాద్ ను కేంద్రంగా చేస్తూ పివి జిల్లా ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. మన దేశానికి ప్రధాన మంత్రిగా పనిచేసి అనేక సంస్కరణలు తెచ్చిన గొప్ప మేధావి పివి ఈ ప్రాంతం వాడని అన్నారు. అలాంటి మేధావిని గుర్తు చేసుకోవడం కోసం హుజురాబాద్ ను కేంద్రంగా చేస్తూ పివి జిల్లాను ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రజల కోరిక మేరకు హుజురాబాద్ ను పివి జిల్లాగా ప్రకటిస్తే ప్రపంచ మేధావిగా చెప్పబడిన పివి నరసింహారావు కు మనం ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు, యువకులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు ఈ విషయంలో ఐక్యంగా ఉండి ప్రభుత్వం జిల్లా ప్రకటించే వరకు శాంతియుతంగా పోరాటం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పివి జిల్లా సాధన సమితి నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కొత్తూరు రమేష్, మాజీ కౌన్సిలర్ ముక్క రమేష్, సాదుల రవీందర్, ప్రభాకర్ రెడ్డి, రావుల వేణు, ఉద్యోగులు, యువకులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

# సింగరేణి మనుగడ ప్రశ్నార్థకం



### రూ.47 వేల కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలి
### కొత్త గనులు ఇవ్వకపోతే సంస్థ భవిష్యత్తే ప్రమాదంలో
### ఏఐటీయూసి నాయకుల ఘాటు హెచ్చరిక

**గోదావరిఖని , ప్రభాత వార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిరక్ష్య ధోరణి కొనసాగితే సింగరేణి కాలరీస్ కంపెనీ భవిష్యత్తే ప్రమాదంలో పడుతుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసి) నాయకులు తీవ్రంగా హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.47 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. గురువారం గోదావరిఖని ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఏఐటీయూసి గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌లు మాట్లాడుతూ.. సింగరేణి ఉత్పత్తి చేసిన బొగ్గు, విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన విద్యుత్ సంస్థలు వినియోగించుకొని ఇప్పటి వరకు భారీగా రూ.47 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టాయని విమర్శించారు. ఈ నిరక్ష్యమే సంస్థ ఆర్థిక పరిస్థితి దారుణంగా మారడానికి కారణమని పేర్కొన్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో సంస్థలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పూర్తిగా ఆగిపోయాయని, కార్మికులకు నెలవారీ వేతనాలు చెల్లించేందుకు కూడా బ్యాంకుల నుంచి అప్పులు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొందని వారు తెలిపారు. కొత్త యంత్రాలు కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో పాత యంత్రాలతోనే బొగ్గు ఉత్పత్తి కొనసాగించాల్సి వస్తోందని, దీని వల్ల ప్రమాదాలు పెరిగి కార్మికులు ప్రాణాపాయంలో పనిచేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి కొనసాగాలంటే కొత్త గనులు తప్పనిసరిగా అవసరమని, అవి ప్రైవేటు సంస్థలకు కాకుండా పూర్తిగా సింగరేణికే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్త గనులు రాకపోతే భవిష్యత్తులో సింగరేణి మనుగడే కష్టమని హెచ్చరించారు. సంస్థకు శాశ్వత సి అండ్ ఎండీ, డైరెక్టర్ ఫైనాన్స్ నియమించకపోవడం వల్ల యాజమాన్యం – గుర్తింపు సంఘం మధ్య అంగీకరించిన డిమాండ్లపై సర్క్యులర్లు జారీ కావడం లేదని, ఫలితంగా కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆరోపించారు. వెంటనే ఈ కీలక పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మారుపేర్ల సమస్య, విజిలెన్స్ కేసులు, మెడికల్ బోర్డు నిర్వహణ లోపం, సొంత ఇంటి పథకం అమలు, పెర్క్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ యాజమాన్యం చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలన్న అంశాలపై ఇప్పటికే ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇచ్చినా నెలలు గడిచినా స్పందన లేదని విమర్శించారు. ఇది పూర్తిస్థాయి ప్రభుత్వ నిరక్ష్యానికి నిదర్శనమని అన్నారు. సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమంపై కోల్‌బెల్ట్ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చట్టసభల్లో మాట్లాడకపోవడం బాధాకరమని అన్నారు. సీపీఐ ఎమ్మెల్యే కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు మాత్రమే ఈ అంశాలను నిరంతరం లేవనెత్తుతున్నారని ప్రశంసించారు. గుర్తింపు సంఘం కాలపరిమితి 2026 సెప్టెంబర్ వరకు ఉన్న విషయం తెలిసినా, కొన్ని కార్మిక సంఘాలు కార్మికులను తప్పుదోవ పట్టిస్తూ ఎన్నికల పేరుతో గందరగోళం సృష్టిస్తున్నాయని ఆరోపించారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో గుర్తింపు కాలపరిమితి మించిపోయినా ఎన్నికలు ఎందుకు కోరలేదని ప్రశ్నించారు. ఇప్పుడు మాత్రమే ఎన్నికలు కావాలని కోరడం హాస్యాస్పదమని అన్నారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు కే.సారయ్య, కందికట్ల వీరభద్రయ్య, మడ్డి ఎల్లా గౌడ్, ఆర్జీ1 బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం సహ పలువురు నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సు

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:





మండలంలోని పెగడపల్లి సన్ షైన్ లెర్నింగ్ పాఠశాలలో గురువారం రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల నీ అసిస్టెంట్ వెహికల్ ఇన్స్పెక్టర్ వంశీకృష్ణ అన్నారు జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాలలో భాగంగా, విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహనా కల్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ట్రాఫిక్ నిబంధనలను తెలుసుకుని, వాటిని కట్టుబాటుగా పాటిస్తే భవిష్యత్తులో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్ట్ తప్పనిసరిగావినియోగించాలని సూచించారు. వాహనాలు నడుపుతున్న సమయంలో మొబైలవినియోగించకూడదని హెచ్చరించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రాణాపాయాలు, అధిక వేగం వల్ల జరిగే ప్రమాదాలు, ట్రాఫిక్ సిగ్నల్స్ మరియు రోడ్డుపై ఉన్న సూచిక బోర్డుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. జీబ్రా క్రాసింగ్ వినియోగం, రోడ్డును దాటేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాదచారుల భద్రత వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నియమాలను తాము పాటించడంతో పాటు, తమ కుటుంబ సభ్యులు మరియు మిత్రులు కూడా వాటిని పాటించేలా ప్రోత్సహించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కుంగ్ ఫు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ఆవార్డు గ్రహిత గ్రాండ్ మాస్టర్ కొండిల్ల సదానందం అశోక్ కానిస్టేబుల్, పాల్గొన్నారు. విద్యార్థులకు మంచి అవగాహన సదస్సు కల్పించినందుకు పాఠశాల కరెస్పాండెంట్ సయ్యద్ నసిర్ ఉపాధ్యాయుల బంధం కలిసి అసిస్టెంట్ వెహికల్ ఇన్స్పెక్టర్ వంశీకృష్ణ కు సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# కలెక్టరేట్‌లో ఆకట్టుకున్న రంగవల్లులు

### -పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళా ఉద్యోగులు

పెద్దపల్లి, ప్రభాతవార్త:

సంక్రాంతి సంబరాలలో భాగంగా పెద్దపల్లి టిఎన్‌జిఓ సంఘం ఆధ్వర్యంలో పెద్దపల్లి ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్స్ కాంప్లెక్స్ (కలెక్టరేట్)లో డిపార్ట్మెంట్‌ల మధ్య రంగవల్లుల పోటీలను గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళా ఉద్యోగులందరూ ఉత్సాహంగా పాల్గొని, తమ సృజనాత్మకతను, తమ డిపార్ట్మెంట్‌కి చెందిన ప్రత్యేకతను జోడిరచి అద్భుతంగా రంగవల్లులను తీర్చిదిద్దారు. పోటీల్లోని విజేతలకు కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష చేతుల మీదుగా నగదు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా టిఎన్‌జిఓ అధ్యక్షులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జెఏసి చైర్మన్ బొంకూరి శంకర్ మాట్లాడుతూ పెద్దపల్లి జిల్లాలో ప్రతి పండుగను ఇలా జరుపుకుంటూ మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఉద్యోగులు తమ వంతు బాధ్యతగా కృషి చేస్తున్నారని, ఒక్క పిలుపుతో ఉద్యోగులు ఇలా కలిసి రావడం సంతోషకరంగా ఉందని, ఈ స్ఫూర్తిని తన నాయకత్వానికి మరింత బాధ్యత పెంచుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బండి ప్రకాష్, పిఏఓ ప్రభాకర్, డీఈఓ శారద, జిల్లా సహ అధ్యక్షులు అనిత, కోశాధికారి ఆడెపు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు అయిరెడ్డి సందీప్ రెడ్డి, కార్యదర్శి ప్రవీణ్, స్వప్న, శ్రీధర్, విష్ణు, రవి, శ్రీనివాస్, శిల్ప, సౌమ్య, సరిత, సంగీత, శిరీష, నిరోషా, నిత్య, రమాదేవి, శ్రీవాణి, వాసవి, శ్రీలత, అన్విత, ఉమ, శ్రీనివాస్, రాజేష్, రజీ, ప్రమోద్, తిరుపతి, సాధిక్, అఖిల్, నిఖిల్, టిఎన్‌జిఓ సంఘ సభ్యులు పాల్గొన్నారు.



# సర్పంచ్, ఉప సర్పంచ్‌కు సన్మానం

రామగిరి, ప్రభాతవార్త:

రామగిరి మండలం రత్నాపూర్ నూతన సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు, ఉపసర్పంచ్ బాద్రపు ప్రవళిక ప్రశాంత్‌లను రిటైర్డ్ డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ (డిపిఎంఓ) కొప్పుల తిరుపతి రావు జయలక్ష్మి దంపతులు గురువారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల ఎన్నికలలో వీరిద్దరు గెలుపొందడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు.



# పెద్దపల్లి వార్త



## వికలాంగునికి వీల్ చైర్ అందజేత

సుల్తానాబాద్, ప్రభాతవార్త



సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని క్యాడర్ దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థికి ఆపరేషన్ స్మైల్ టీం పెద్దపల్లి ఆధ్వర్యంలో ఎస్సై వేణుగోపాల్ వికలాంగునికి వీల్ చైర్ అందించారు. కార్యక్రమంలో లేబర్ అధికారి హేమ, చైల్డ్ కేర్ రమ, చైల్డ్ కేర్ ప్రొటెక్షన్ టీం దివ్యాంగుల పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న జెఎన్‌టియు సంక్రాంతి సంస్కృతి పోటీలు

రామగిరి, ప్రభాతవార్త:



సంక్రాంతి పురస్కరించుకొని మంథని జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన వివిధ సంస్కృతి పోటీలు ఆకట్టుకున్నాయి. కళాశాలలో గురువారం గాలి పటాలు, రంగోలి పోటీలు అలరించాయి. కళాశాల ఆవరణలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య క్రీడామైదానంలో జరిగిన ఈ వేడుకల్లో ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ ముఖ్య అతిథిగా హాజరై మైదానంలో ఏర్పాటు చేసిన పొయ్యిపై పాలను పొంగించే పోటీలను ప్రారంభించారు. అనంతరం ప్రిన్సిపల్ స్వయంగా కైట్‌ను ఎగురేసి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో గాలిపటాలను ఎగురేశారు. రంగవ ల్లులు పోటీలలో విద్యార్థినీలు పెద్ద సంఖ్యలో హాజరై వేసిన రంగు రంగుల ముగ్గులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు 26న బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజల ఆశలను నిలబెట్టే పాలన చేయాలి

### గ్రామ అభివృద్ధికై అలుపెరుగని కృషి చేయాలి
### నూతన పాలకవర్గం ఆదర్శంగా నిలవాలి
### అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర నాయకులు
### మారం తిరుపతి యాదవ్

**జూలపల్లి, ప్రభాతవార్త:**

ప్రజల ఆశలను నిలబెట్టే పాలన చేయాలి అని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర నాయకులు మారం తిరుపతి యాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం జూలపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన పాలకవర్గం సర్పంచ్ పాఠకుల అనూష, ఉప సర్పంచ్ కొప్పుల మహేష్, వార్డు సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తిరుపతి యాదవ్ మాట్లాడుతూ సరైన నాయకత్వంగా భావించి ఓట్లు వేసి గెలిపించిన ప్రజల ఆలోచన మేర గ్రామ అభివృద్ధికై అలుపెరుగని కృషి చేయాలి అని నూతన పాలకవర్గాన్ని కోరారు. నూతన పాలకవర్గం పాలన జిల్లాలోనే ఆదర్శంగా నిలవాలి అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాఠకుల అనూష, ఉప సర్పంచ్ కొప్పుల మహేష్, వార్డు సభ్యులు, మారం రమణ యాదవ్, నాయకులు అమరగాని ప్రదీప్ కుమార్, మల్లెత్తుల అంజి, మల్లెత్తుల కనకయ్య, మారం రాకేశ్, మారం వెంకయ్య, బొంగాని రమేష్ తదితరులు పాల్గొన్నారు.



చొప్పదండి వార్త

# గాయత్రి పంపు హౌస్ నుండి నీటి విడుదల

**అన్నదాతల హర్షం**

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**కృషి అభినందనీయం**

**కాంగ్రెస్ శ్రేణుల సంబరాలురాలు**

మడుగు ప్రభాతవార్త,



గాయత్రి పంపుహౌస్ నుండి నీటిని విడుదల చేశారు చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ప్రత్యేక చొరవతో అన్నదాతలకు సాగునీటి విడుదల కావడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేయగా కాంగ్రెస్ శ్రేణులు సంబరాలను రైతులతో పంచుకుంటున్నారు ఈ మేరకు రామడుగు మండలంలోని లక్ష్మీ ్రపూర్, వెంకట్రావుపల్లె ,కిష్టంపల్లె, దత్తోజిపేట్,గ్రామాల పంట పొలాలకు నీటి కొరత ఏర్పడకుండా రైతుల కోరిక మేరకు నీటిపారుదల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తో మాట్లాడి లక్ష్మీ ్రపూర్ గాయత్రి పంపు హౌస్ నీటిని విడుదల చేయించిన చొప్పదండి శాసన సభ్యులు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా మేడిపల్లి సత్యం నీటిని విడుదల చేసిన సందర్భంగా ఈ గ్రామాల రైతుల పక్షాన మండలాల ప్రజల పక్షాన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చొప్పదండి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి రామడుగు మండల కాంగ్రెస్ అధ్యక్షులు జవ్వాజి హరీష్ మాట్లాడుతూ రామడుగు మండలం లక్ష్మీ ్రపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి గోదావరి నది జలాల ఎత్తుపోతాలు యసంగి పంటకు సాగునీరు అందించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది ఒక పంపుతో 3,300 క్యూసెక్కుల ఎత్తిపోతల జలాలను తరలిస్తున్నామని అన్నారుఈ కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు లక్ష్మీ ్రపూర్ సర్పంచ్ అనంతరెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పిండి సత్యం, ఉప సర్పంచ్ల అధ్యక్షులు కటుకం మనీష్, వెంకట్రావు పల్లె సర్పంచ్ కత్తి సమత మధు, ఉపసర్పంచి కట్ల రవళి వెంకటేష్, ఈశ్వర్, రామడుగు మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్ నాయకులు బండారి భువన్ కుమార్ తడగొండ లక్ష ్మణ్, రవీందర్, బిట్టు దేవ కిషోర్, రామ్ రెడ్డి, మహేష్, వేణు, సాయి, అనిల్, రైతులు కాంగ్రెస్ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## రాంపూర్‌లో విద్యుత్ అధికారుల ప్రజా బాట

మల్యాల/ప్రభాతవార్త

గ్రామాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకే ప్రజా బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జగిత్యాల విద్యుత్ డివిజనల్ ఇంజనీర్ గంగారాం అన్నారు, గురువారం మండలంలోని రాంపూర్ వడ్డెర కాలనీలో నిర్వహించిన ప్రజా బాట కార్యక్రమం విద్యుత్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించి అనంతరం, గ్రామస్తులతో కలిసి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు, గ్రామాలలో లో వోల్టేజ్ సమస్య రాకుండా అవసరమైన అదనపు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు, రైతులు తమ వ్యవసాయ బావి మోటార్లకు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని ,విద్యుత్ మరమ్మత సమయాల్లో జాగ్రత్తలు వహించాలని, వ్యవసాయదారులతోపాటు, గృహ వినియోగదారులు విద్యుత్ ప్రమాదాల పట్ల జాగ్రత్తలు వహించాలన్నారు, కార్యక్రమంలో రామన్నపేట విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు,




## నూతన సర్పంచులతో మల్యాల సిఐ ముఖాముఖి

మల్యాల/ప్రభాతవార్త



మల్యాల మండలంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లతో గురువారం మల్యాల సిఐ నీలం రవి ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు, ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధికి మూలమైన సర్పంచులు , గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, కూడా పోలీసులకు సహకరించాలని అన్నారు, గ్రామంలో గంజాయి, డ్రగ్స్ నివారణ చర్యలకు సహకరించాలని, గ్రామస్తులు సమన్వయంతోగ్రామస్థాయిలోనే కట్టుదిట్టం చేసుకుంటూ, వాటి సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు, గ్రామంలో ఆవాంఛనీయ సంఘటనలు జరిగినా,అసాంఘిక శక్తులపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు, అంతేకాకుండా కమ్యూనిటీ పోలీసింగ్ పై సిఐ వివరించారు, ముఖ్యంగా యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా, డ్రగ్స్ కు అలవాటు కాకుండా గ్రామస్థాయిలో నే కృషి చేయాలని కోరారు, కార్యక్రమంలో మల్యాల ఎస్ఐ నరేష్ కుమార్ పాల్గొన్నారు

# పండుగలపై విద్యార్థులకు అవగాహన తప్పనిసరి

**సంక్రాంతి పండగకు ప్రత్యేక విశిష్టత**

**సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి**

చొప్పదండి ప్రభాతవార్త,



ప్రతి విద్యార్థికి విద్యార్థులు దశలోనే పండగలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత దాసరి శ్రీపాల్ రెడ్డి అన్నారు ఈ మేరకు చొప్పదండి పట్టణంలోని సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ముందస్తుగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీ వెంకటేశ్వర విగ్రహానికి పూలమాల వేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో వివిధ రంగవళ్ళులతో చక్కగా అలంకరించి, వాటి మధ్యలో గొబ్బెమ్మలను తిలకించి, భోగి మంటలను వెలిగించారు. తదనంతరం ఎడ్ల బండి పై వచ్చి అక్కడ ఏర్పాటు చేయబడిన వరి నాటు మడిని పరిశీలించి వరి నాటునందించారు. తదుపరి పల్లె వాతావరణంగా ఏర్పాటు చేయబడిన బొమ్మల కొలువును తిలకించి, పిల్లలపై భోగి పళ్ళను పోశారు. చక్కని వేషధారణలో వచ్చిన విద్యార్థి హరిదాసులకు కానుకలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి చైర్మన్ మాట్లాడుతూ ప్రతి ఏటా మార్గశిర మాసంలో వచ్చే మకర సంక్రాంతికి ఎంతో విశిష్టత ఉన్నదని, ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్న మన హిందూ ధర్మంలో భాగంగా సంక్రాంతి పండుగ విశిష్టత గురించి తెలుసుకోవడం ఎంతైనా అవసరం అన్నారు. ప్రతి పండుగలో ఎన్నో సంస్కృతి, సాంప్రదాయాలు దాగి ఉంటాయని వాటిని విద్యార్థులు చూసి అర్థం చేసుకోవాలని తెలిపారు. అనాదిగా మన పూర్వీకులు పాటిస్తున్న ఆచారాలను తప్పకుండా మనం అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం సంప్రదాయ దుస్తులతో వచ్చిన వివిధ తరగతులకు చెందిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. చిన్నపిల్లలు పతంగులు ఎగురవేసి తమ కోలాహాలం సృష్టించారు.దీనిలో భాగంగా సాంప్రదాయ దుస్తుల్లో వచ్చిన ఉపాధ్యాయునిలు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. స్కూల్ ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఈనెల 11న రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీలు

**రాష్ట్ర అధ్యక్షులు గడమల్ల శ్రీనివాస్**

కరీంనగర్ టౌన్ ప్రభాతవార్త,



కరీంనగర్ నగరంలో రాష్ట్రస్థాయి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు శ్రీ శ్రీనివాస మ్యారేజ్ బ్యూరో మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గడమల్ల శ్రీనివాస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల కుమార్ రాష్ట్ర కోశాధికారి రేవతి తెలిపారు. ఈ మేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తమ మ్యారేజ్ బ్యూరో కొనసాగిస్తున్న మహిళల కోసం రాష్ట్రస్థాయిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు కరీంనగర్ నగరంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో పోటీలను నిర్వహిస్తున్నమని తెలిపారు ఈ పోటీలలో పాల్గొని పోటీలలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందించి పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రోత్స హితులను అందజేస్తామని తెలిపారు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళా లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు

## పదవ తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

మల్యాల/ప్రభాతవార్త



మల్యాల మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్ ను గురువారం నోడల్ అధికారి ప్రత్యేక తనిఖీ బృందం అధికారులు సందర్శించారు, పదవ తరగతి విద్యార్థులు 2026 వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని నోడల్ అధికారి మానుపాటి బన్నా అన్నారు. ఈ సందర్భంగా తనిఖీ బృందం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను సబ్జెక్టుల వారీగా వారి సామర్థ్యాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన తీరు, రికార్డులు,సైన్స్ ల్యాబ్ నిర్వాహణ, క్రీడలు, ఆరోగ్యవిద్య ,మధ్యాహ్న భోజన పథకం అమలు పనితీరును నోడల్ ఆఫీసర్ మానుపాటి బన్నా బృందం పరిశీలించింది. పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వాహణ తీరును పరిశీలించారు. అంతేకాకుండా, విద్యార్థుల మార్కుల మూల్యాంకనం రికార్డులను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో మల్యాల మండల విద్యాధికారి జయసింహ రావు, వివిధ సబ్జెక్టుల టీం ఉపాధ్యాయులు పాల్గొన్నారు,

## 10 న మల్యాలలో ఉపాధి హామీ ప్రజా వేదిక

మల్యాల/ ప్రభాతవార్త

మల్యాల మండలంలో గల 19 గ్రామాలలో 1 ఏప్రిల్ 224 నుండి 31 మార్చి 2025 ఆర్థిక సంవత్సరం వరకు జరిగిన ఉపాధి హామీ పనుల పై మల్యాల మండల కేంద్రంలో ఈనెల 10 శనివారం మండల ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు, మండలంలోని గ్రామాలలో ఈనెల 2 నుండి ఈజీఎస్ పనులపై తనిఖీ బృందలతో పనులను తనిఖీ చేసి జాబితాలను తయారు చేయడం జరిగిందని, తుది సామాజిక తనిఖీ నివేదికలను ప్రజా వేదికలో అందజేయడం జరుగుతుందన్నారు, శనివారం ఉదయం 10 గంటలకు మండల స్థాయిలో జరిగే ప్రజావేదికను విజయవంతం చేయాలని ఎంపీడీవో కోరారు,

# బిటి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**ప్రజలకు,వాహనదారులకుతీరనున్న దుమ్ము కష్టాలు**

వేములవాడ టౌన్, ప్రభాతవార్త:

వేములవాడ పట్టణ ప్రజలకు, వ్యాపారులకు ఎట్టకేలకు దుమ్ము ధూళి నుండి విముక్తి కలగనుంది. వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ నుండి చెక్కపల్లి బస్టాండ్ వరకు సుమారు 600 మీటర్ల మేర నూతన బిటి రోడ్డు నిర్మాణ పనులు గురువారం ప్రారంభమయ్యాయి...గత రెండు నెలల క్రితం కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మట్టిని తొలగించి వదిలేశారు. దీనివల్ల వాహనాలు వెళ్తున్నప్పుడు విపరీతమైన దుమ్ము లేచి అటువైపుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొన్నారు. ము ఖ్యంగా రోడ్డు పక్కన ఉన్న దుకాణదారులు దుమ్ము వల్ల తమ వ్యాపారాలు దెబ్బతిం టున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ వచ్చా రు.ప్రజల ఇబ్బందులను గమనించిన



అధికారులు, కాంట్రా క్టర్ గురువారం తెలం గాణ చౌక్ నుండి పాత రోడ్డును తొల గించి కొత్త బిటి రోడ్డు వేసే పనులను మొద లుపెట్టారు. ఆధునిక యంత్రాలతో పనులు చకచకా సాగుతున్నాయి. వేములవాడ పట్టణంలోచాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్డు పనులు ఎట్టకేలకు ప్రారంభం కావడంతో పట్టణ ప్రజలు, షాపుల యజమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యతతో కూడిన రోడ్డును త్వరితగతిన పూర్తి చేసి అందు బాటులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు.

# ఆరె ఆర్య క్షత్రియ కుల సంక్షేమానికి కృషి చేయాలి

రాష్ట్ర ఆరే ఆర్య క్షత్రియ కుల
సంక్షేమ సంఘం అధ్యక్షులు చెట్టిపల్లి శివాజీ
ఆరె ఆర్య క్షత్రియ కుల సర్పంచ్‌లను సన్మాన కార్యక్రమం

వేములవాడ టౌన్, ప్రభాతవార్త:

వేములవాడ పట్టణంలో ఆరె ఆర్య క్షత్రియ కుల సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు మరియు వార్డు సభ్యుల ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టేపల్లి శివాజీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన కుల బాంధవులు తమ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని, పారదర్శకమైన పాలనతో గ్రామాలను రాష్ట్రానికే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఆకాంక్షి ంచారు. రాజకీయాల్లో రాణిస్తూనే సమాజ సేవలో ముందుండాలని, కుల గౌరవాన్ని పెంపొందించేలా పని చేయాలని



ఆయన పిలుపునిచ్చారు. అనం తరం ఆరేపల్లి గ్రామ సర్పంచ్ ఇటిక్యాల రాజు, బొల్లారం సర్పం చ్ సందే సరి సౌజన్య మల్లికార్జున్, జయవరం సర్పంచ్ ఏంద్రాల ప్రసాద్, బోయినపల్లి మండలం రత్నంపేట సర్పంచ్ కౌడగాని వెంకటేష్, వెంకట్రావుపల్లి సర్పంచ్ ఇరువాలా సంధ్యా మనోహర్, ఇల్లంతకుంట ఆరేపల్లి సర్పంచ్ మరిజ మోహన్ రావులతో పాటు పలువురు ఉపసర్పంచులు మరియు వార్డు సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ వేడుకలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సూరారం శివాజీ, రాష్ట్ర కన్వీనర్ జెండా రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోహర్, సంఘం జిల్లా అధ్యక్షులు సిలువేని మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు సూరే దేవారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు కుల బాంధవులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన ప్రజాప్రతినిధులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# యాదవులు రాజకీయల్లో క్రీయశీలకంగా ఎదగాలి

**-రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్**

**-యాదవ సంఘం ఆధ్వర్యంలో నూతన యాదవ సర్పంచ్ లకు సన్మానం**

వేములవాడ టౌన్, ప్రభాతవార్త:





రాష్ట్రంలో అత్యధిక జనాభ కలిగిన యాదవులు రాజకీయంగా మారింతగా రాణించాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గురువారం వేములవాడ పట్టణంలోని త్రినేత్ర పంక్షన్ హాల్లో జిల్లాలో నూతన యాదవ సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డుమెంబర్లకు వేములవాడ శ్రీ కృష్ణ బలరామ యాదవ సంక్షేమ సంఘం అధ్వర్యంలో సన్మాన మహోత్సవం కి విప్ అది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన యాదవ సర్పంచ్ ఉప సర్పంచ్ వార్డు సభ్యులకు అభినందించారు. ప్రజలు పలు సందర్భాల్లో ప్రశ్నించే గొంతుకలకు అవకాశం ఇస్తున్నారని అందులో భాగంగా నేడు మీరందరూ గెలిచి రావడం జరిగింది అన్నారు. గెలిచిన వారికి మరింత బాధ్యత పెంచుతుందని ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ముందుకు పోవాలని అన్నారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని అన్నారు. తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. కులం ఒక బలం బలగం అని ఇతర కులాలను కలుపుతూ ముందుకు పోవాలన్నారు. యాదవులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, మొన్న జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా నవీన్ యాదవ్న ప్రభుత్వం గుర్తించి గెలిపించిందన్నారు. రాష్ట్రంలో అతి పెద్ద కులం కలిగిన యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. నా గెలుపులో సైతం యాదవులు క్రీయశీలంగా పనిచేశారన్నారు. యాదవుల సభ్యులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానాని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబటి సంతోష్ యాదవ్, జెకె యాదవ్, సంఘ స్వామి యాదవ్, చంద్రశేఖర్ యాదవ్, తిరుపతి బాబు యాదవ్, సిర్రం ప్రసాద్ యాదవ్, మామిండ్ల పర్శురాములు యాదవ్, కాశవేని మహేష్, మల్లేశం, సత్తయ్య యాదవ్, జక్కుల మహేష్ యాదవ్ పాల్గొన్నారు.

# వేములవాడ 11వ వార్డులో భారీగా నకిలీ ఓట్లు నమోదు చేశారు

జిల్లా మాజీ ఏబీవీపీ అధ్యక్షులు మోహన్
విచారణ చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

వేములవాడ టౌన్, ప్రభాతవార్త:

వేములవాడ 11వ వార్డులో భారీగా ఇతర ప్రాంతాల వారి ఓట్లు నమోదు చేసి ఎన్నికలలో కొందరు గెలవాలని ప్రయత్నిస్తున్నారని జిల్లా మాజీ ఏబీవీపీ అధ్యక్షులు పుప్పాల మోహన్ అన్నారు. 11వ వార్డులో భారీగా ఓట్ల నమోదుపై గురువారం మున్సిపల్ అధికారులకు ఆయన ఫిర్యాదు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ వార్డులో ఈ ప్రాంతానికి సంబంధం లేని వారి ఓట్లను కొందరి ఇంటి నెంబర్ లో ఓటర్లుగా నమోదు చేశారని అన్నారు. దీనివల్ల 11 వ వార్డులో భారీగా ఓటర్లు పెరిగారని దీనిపై మున్సిపల్ అధికారులు విచారణ చేపట్టి నకిలీ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు.



# వేములవాడ వార్త



## ఘనంగా ప్రారంభమైన త్యాగరాజ స్వామి ఉత్సవాలు

**- ఉత్సవాలను ప్రారంభించిన ఈఓ రమాదేవి**

వేములవాడ, ప్రభాతవార్త:



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధమైన భీమేశ్వర స్వామి ఆలయంలో గురువారం శ్రీ త్యాగరాజ స్వామి ఉత్స వాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్స వాలను ఆలయ ఈఓ రమా దేవి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అర్చకులు శరత్ ఆధ్వర్యంలో త్యాగరాజ స్వామి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు, స్వస్తి పుణ్యావచనం చేశారు. అనంతరం పట్టణంలో నగర సంకీర్తన నిర్వహిం చారు. త్యాగరాజస్వామి వారి జీవిత విశేషాలు, పంచరత్న గానం, నృత్య ప్రదర్శన అందరినీ అలరించింది. చౌటి లక్ష్మణ్ మూర్తిచే త్యాగరాజస్వామి సుప్రభాతం, సరిత, సునీత, దివ్య, కళ, అపర్ణ, మాధవి, రమేష్‌చే సుప్రభాత రూపకాన్ని నాదస్వర కచేరిని ఆస్థాన విద్వాంసులు నిర్వహిం చారు. ఉత్స వాలలో కళాకారుల ఆట పాటలు ఎంతగానో ఆలరించాయి.

## బండపల్లి అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన అక్షరాభ్యాసం

**-హాజరైన ఐసిడిఎస్ సిడిపిఓ సౌందర్య**

చందుర్తి ప్రభాతవార్త:



చందుర్తి మండలం బండపల్లి అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన, అక్షరా భ్యాసం కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేములవాడ ఐసిడిఎస్ సీడిపిఓ సౌందర్య హాజరయ్యారు, స్థానిక సర్పంచ్ కటకం మల్లేశం చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో చిన్నారుల శ్రేయస్సు కోసం అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు, చిన్నారుల బాలింతల, గర్భవతుల సంక్షేమం కోసం ప్రత్యేక కృషి చేయడం జరుగుతుందన్నారు, నూతనంగా గెలుపొందిన సర్పంచ్ కటకం మల్లేశం ను శాలువాలతో సన్మానించారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇసాక్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపా ధ్యాయులు అనిల్ రావు. ఐసిడిఎస్ సూపర్వైజర్ శంకరమ్మ అంగన్వాడీ ఉపాధ్యాయులు బుర్ర రేణుక, న్యాత పద్మ, గసగంటి రేణుక ఉపాధ్యా యులు,వార్డు సభ్యులు,పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## నేటి నుండి ఉపాధి హామీ గ్రామసభలు

చందుర్తి,జనవరి8 ప్రభాతవార్త :

చందుర్తి మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఉపాధి హామీ గ్రామ సభలను శుక్రవారం నుండి నిర్వహిస్తున్నట్లు చందుర్తి ఎంపిడివో రాధ, ఏపీవో రాజయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.చందుర్తి మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 1 ఏప్రిల్ 2024 నుండి 31 మార్చి 2025 వరకు కూలీలు చేపట్టిన పనులు రూపాయలు 4,21,41,490, మెటిరియల్ పనులు రూపాయలు 60,55,771, మొత్తం రూపాయలు 4, 81,97,261 పనుల తనిఖీ చేయుటకు సామాజిక తనిఖీ బృందము ఈ నెల 5నుండి 11 వరకు ఆయా గ్రామాలలో పనులు తనిఖీ చేపట్టారు.సదరు తనిఖీ. చేసిన నివేదికలను చర్చించుటకు గాను గ్రామల్లోని గ్రామ పంచాయితీ కార్యలయాల్లో మొదటి విడతలో ఈ నెల 8న కొత్తపేట,9న మూడపల్లి, కిష్టంపేట. రామారావుపల్లి, 10న అనంతపల్లి, రామన్నపేట, లింగంపేట,మర్రిగడ్డ, బండపల్లి, జోగాపూర్, తిమ్మాపూర్, దేవునితండా,ఎన్గల్, ఆశిరెడ్డిపల్లి, 2వ విడతలో 11న చందుర్తి, నర్సింగాపూర్, సనుగుల, మల్యాల, కట్ట లింగంపేట, గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

# విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఏఈకి సర్పంచ్ వినతి

రామగిరి, ప్రభాతవార్త:

రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో విద్యుత్ సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని విద్యుత్ శాఖ ఏఈ కొరండ్ల మహేందర్‌కు సర్పంచ్ పల్లె ప్రతిమ పివి రావు గురువారం వినతి అందజేశారు. రత్నాపూర్, రాంనగర్, సంజీవనగర్, నాగేపల్లి ఎక్స్ రోడ్డు ప్రాంతంలో ఎడ్లబండ్లలో, ట్రాక్టర్లలో, గడ్డికుప్పలు, ఓవర్ లోడ్ లారీలు వెళ్లుతున్నప్పుడు కురుస విద్యుత్ స్థంబాలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వీటి స్థానంలో పెద్ద సిమెంట్ విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేయాలని, ఐరన్ పోల్‌లను గుర్తించి వాటిని తొలగించి పెద్ద సిమెంట్ విద్యుత్ స్థంబాలు వేయాలని, లూజ్ విద్యుత్ వైర్లను సరిచేయాలని, రత్నాపూర్ 33/11 సబ్ స్టేషన్ నుండి అగ్రికల్చర్ ఫీడర్ వేరు చేసి రత్నాపూర్‌కు టౌన్ ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా చేయాలని, లో ఓల్టేజ్ ఉన్న ప్రాంతంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని తదితర సమస్యలను వివరిస్తూ



పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాధ్రపు ప్రవళిక ప్రశాంత్, సబ్ ఇంజనీర్ కుమ్మరికుంట సతీష్, పంచాయితీ సెక్రెటరీ గంగుల సంతోష్, వార్డ్ మెంబర్ పున్నం మణితేజ, వైరెన్ మెన్ బంగారు శివకుమార్, సిబ్బంది గుండ చందు, నాయకులు కొదారి కుమార్, మేదగొండ తిరుపతి తదితరులున్నారు.

# మంథని వార్త



## ఆకట్టుకున్న బొమ్మల కొలువు

రామగిరి, ప్రభాతవార్త:



సింగరేణి ఆర్జీ 3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్‌సిఓ క్లబ్‌లో గురువారం నిర్వహించిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. ఆర్జీ 3 సేవా, లేడీస్ క్లబ్ మాజీ అధ్యక్షురాలు అలివేణి సుధాకర రావు, వెంకటలక్ష్మి నాగేశ్వర రావు అధ్యక్షతన బొమ్మల కొలువు వేడుకలు చేపట్టారు. ముఖ్య అతిథులుగా సింగరేణి డైరెక్టర్ల సతీమణులు మాలతి ఎల్‌వి సూర్య నారాయణ, విజయ లక్ష్మి వెంకటేశ్వర్లు, పద్మ తిరుమల రావు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. తెలుగు ప్రజల సాంప్రదాయంగా నిర్వహించే ఈ బొమ్మల కొలువు వేడుకలు ఎప్పటికీ ఏ మాత్రం వన్నె తగ్గకుండా మహిళలందరూ ఉత్సాహంగా నిర్వహించుకోవడం చాలా సంతోషమని అన్నారు. బొమ్మల కొలువులో భాగంగా రామాయణం ఘట్టం, అష్ట లక్ష్మి మలు, ఆదివరాహ స్వామి, లక్ష్మినరసింహ స్వామి, వినాయకుడు, కృష్ణుడు, తదితర దేవీ దేవతల విగ్రహాలు, ఇతర అలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతేకాకుండా క్లబ్ పరిసరాలలో వేసిన రంగవల్లులు, పల్లె ప్రజల జీవన విధానాన్ని తెలియజేసే వివిధ ఏర్పాట్లు ఆవరణకు అందాన్ని తెచ్చిపెట్టాయి. పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణులను కాపాడటం లాంటి అంశాలతో ఏర్పాటు చేసిన బొమ్మలు అవగాహన కల్పించేలా ఉన్నాయి. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో లేడీస్ క్లబ్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ 3 జిఎం ఎస్.మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ జిఎం కొలిపాక నాగేశ్వరరావు, రిక్రూటెడ్ జిఎం నరేంద్ర సుధాకరరావులు పాల్గొని బొమ్మల కొలువును వీక్షి ంచారు. ఈ కార్యక్రమంలో ఆర్జీ1, 2, భూపాలపల్లి ఏరియాల సేవా, లేడీస్ అధ్యక్షురాల్లు అనిత లలిత్ కుమార్, వనజా వెంకటయ్య, సునీత రాజేశ్వర్ రెడ్డి, లేడీస్ క్లబ్ కమిటీ సభ్యులు హరిత, లావణ్య, నిఖిత, కోమలి, శైలజ, లక్ష్మి తదితరులున్నారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి బాధాకరం

### మంథని జెఎన్‌టియు ప్రిన్సిపల్ బి.విష్ణు వర్ధన్

రామగిరి, ప్రభాతవార్త:



రోడ్డు ప్రమాదంలో మంథని జెఎన్‌టియు మెకానికల్ బ్రాంచ్ ఫైనల్ ఇయర్ విద్యార్థి విఘ్నేష్ మృతి చెందడం బాధాకరమని ప్రిన్సిపల్ బి.విష్ణు వర్ధన్ విచారం వ్యక్తం చేశారు. గురువారం మంథని జెఎన్‌టియు కళాశాల ఆవరణలో విద్యార్థి విఘ్నేష్ చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ప్రిన్సిపల్ విష్ణువర్ధన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, ముఖ్యంగా ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా నడపాలని, కన్న తల్లిదండ్రులకు శోకం మిగల్చవద్దని హితవు పలికారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న విద్యార్థిని కోల్పోవడం చాలా బాధాకరమని, కన్న తల్లిదండ్రుల శోకం తీర్చలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సుందిళ్ల లక్ష్మ నరసింహ స్వామిని దర్శించుకున్న మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు

రామగిరి, ప్రభాతవార్త:



రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో గల ప్రసిద్ధ క్షేత్రమైన లక్ష్మి నరసింహ స్వామి వారిని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ గురు వారం దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మి నరసింహస్వామి దేవాలయంలో సప్తహ మహోత్సవం వేడుకల్లో పాల్గొన్ననగా దేవాలయ చైర్మన్ కొరకొప్పుల సత్యనా రాయణగౌడ్, సుందిళ్ల గ్రామ సర్పంచ్ ముస్కుల నరేందర్ రెడ్డి కలిసి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్‌ను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ సప్తహ మహోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు,అభిషేకాలు, ధార్మిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మి నరసింహస్వామి వారి ఆశీస్సులతో మంథని నియోజకవర్గ ప్రజలందరికీ శాంతి, ఆరోగ్యం, సుభిక్షం కలగాలని తిరుపతి యాదవ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తీగల సమ్మయ్య, కండె పోషం, బాబురావు, తదితరులున్నారు.

## సింగరేణి ఆర్జీ 3 జిఎంను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్

రామగిరి, ప్రభాతవార్త:

సింగరేణి ఆర్జీ 3 జిఎంగా నూతనంగా బాధ్యతలు స్వీక రించిన సుంకర మధు సూదన్‌ను రామగిరి మండలం లద్నాపూర్ గ్రామ సర్పంచ్ వనం రాంచందర్‌రావు గురు వారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిఎంకు శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ సమస్యలపై జిఎం దృష్టికి తీసుకెళ్లగా జిఎం సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అద్దూరి శ్రీకాంత్, వార్డు సభ్యులు మల్లారపు స్వామి తదితరులున్నారు.

## మైదంబండలో విద్యుత్ అధికారుల ప్రజా బాట

ముత్తారం, ప్రభాతవార్త:




ముత్తారం మండలం మైదంబండ గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు ప్రజా బాట కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో విద్యుత్ సమస్యల గురించి ప్రజల నుంచి ఆరా తీశారు. గ్రామంలలో లూజ్ పోల్స్ గుర్తించి సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. అలాగే గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఏఈ రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బియ్యాని శివకుమార్, ఉప సర్పంచ్ పిట్టల రామస్వామి, లైన్ ఇన్‌స్పెక్టర్ పోచమల్లు,లైన్‌మెన్ అమీర్, వార్డు సభ్యులు, గ్రామస్తు లున్నారు.

## పోస్టాఫీస్ ఎత్తివేస్తే ఆందోళనలు తప్పవు

రామగిరి, ప్రభాతవార్త:

రామగిరి మండలంలోని సెంటినరీ కాలనీ పోస్టాఫీస్‌ను ఎత్తి వేస్తే ఆందోళనలు తప్పవని ప్రజాప్రతినిధులు హెచ్చరించారు. గురువారం సెంటినరీ కాలనీ సింగరేణి క్వార్టర్‌లలో ఉన్న పోస్టాఫీసు ముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సర్పంచులు పల్లె ప్రతిమ పివిరావు, చిందం మహేష్, బిజెపి సీనియర్ నాయకులు మొలుమూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పోస్టాఫీసులో విద్యుత్ జనరేటర్ పనిచేయక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పన్నూరు గ్రామానికి చెందిన తడక శ్రీను అనే వ్యక్తి తల్లికి రూ.లక్షకు పైగా చెల్లించకుండా ఇబ్బందులు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోస్టాఫీసు బాధితులందరికీ తక్షణమే డబ్బులు చెల్లించాలని అన్నారు. ఈ పోస్టాఫీసులో ఇందిరమ్మ గృహాల బిల్లులు, పెన్షన్‌లు, సింగరేణి ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వ పథకాలు సంబంధించి 5 వేల ఖాతాలు ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా వారు పోస్టాఫీసు ముందు ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాధ్రపు ప్రవళిక ప్రశాంత్, వార్డు మెంబర్లు తస్నీరు ప్రదీప్, పున్నం మణితేజ, పెగడ పూర్ణచందర్, నగునూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



## అంగన్‌వాడీ చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం

ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మండలంలోని పోతారం, పారుపల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ సెంటర్లలో గురువారం అంగన్‌వాడీ పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలను నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన చేసి, అక్షరాలు దిద్దించారు. అలాగే గర్భిణులకు శ్రీమంతాలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు ఊట్ల చరణ్, చొప్పరి సంపత్, అంగన్‌వాడీ టీచర్లు వోభారాణి, తిరుపతమ్మ తదితరులున్నారు.

## సింగరేణి ఆర్జీ 3 జిఎంను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్



రామగిరి, ప్రభాతవార్త: సింగరేణి ఆర్జీ 3 జిఎంగా నూతనంగా బాధ్యతలు స్వీక రించిన సుంకర మధు సూదన్‌ను రామగిరి మండలం లద్నాపూర్ గ్రామ సర్పంచ్ వనం రాంచందర్‌రావు గురు వారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిఎంకు శాలువా కప్పి, పూలమాలలు వేసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామ సమస్యలపై జిఎం దృష్టికి తీసుకెళ్లగా జిఎం సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అద్దూరి శ్రీకాంత్, వార్డు సభ్యులు మల్లారపు స్వామి తదితరులున్నారు.

# ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం సందర్శించిన డా. విశారదన్ మహారాజ్

## ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్యపై నిరసన

బుగ్గారం ప్రభాతవార్త:

బుగ్గారంమండలం లోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని గురువారం రోజున మాభూమి రథయాత్ర లో భాగంగా డా. విశారదన్ మహారాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యం కేంద్రంలో సరైన వైద్య సౌకర్యాలు, మౌలిక వసతులు లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలతో నేరుగా మాట్లాడి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. సరైన మందులు, పరీక్షా పరికరాలు, విశ్రాంతి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి ఆవరణలో విద్యార్థులకు తాగునీటి సౌకర్యాలు లేకపోవడంపై డా. విశారదన్ మహారాజ్ విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డా. విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ, విద్యార్థులకు తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలు లేకపోవడం దురదృష్టకరం. ఇది వారి ఆరోగ్యం, విద్యపై ప్రభావం చూపుతోంది. ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి శాశ్వత పరిష్కారం చూపాలి అని డిమాండ్ చేశారు. నీటి సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని డా. విశారదన్



మహారాజ్ ఫోన్ ద్వారా సంబంధిత మంత్రి తో మాట్లాడారు. సమస్యను వివరంగా తెలియజేయగా, మంత్రి తక్షణమే స్పందించి ఈ సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. సమస్య తీరే వరకు ప్రతి క్లాస్ ముందు మినరల్ వాటర్ అందుబాటులో ఉంచుతామని ఎంపీడీఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయునికి రాత పూర్వకంగా హామీ ఇచ్చారు. అధికారుల నిరక్ష్యం కొనసాగితే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని డా. విశారదన్ మహారాజ్ హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక విద్యార్థి సంఘాల ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

## గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి

బుగ్గారం-ప్రభాతవార్త:



బుగ్గార మండల కేంద్రంలో ఉన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ నక్క రాజవ్వ రాజయ్య అన్నారు. గ్రామంలోని రెండు రోజులుగా గ్రామంలో ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నవి గుర్తించి, గ్రామంలోని ముఖ్యంగా డ్రైనేజ్ సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. సర్పంచ్ ఆయా వార్డ్ మెంబర్లతో నేరుగా మాట్లాడి సమస్యలు శాశ్వతంగా పరిష్కరించే దిశగా ముందుండాలని తెలిపారు. మిషన్ భగీరథ పైపులైను వాటర్ లీకేజీలను మిషన్ భగీరథ సంబంధిత అధికారులతో మాట్లాడి పైపులైను వాటర్ లీకేజీ కాకుండా పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నక్క రాజవ్వ రాజయ్య, ఉపసర్పంచ్ జంగ లావణ్య శ్రీనివాస్, సెక్రటరీ అక్బర్ , వార్డు సభ్యుడు బెజ్జాలపు రాజు తదితరులు పాల్గొన్నారు.

## శేషప్ప కళావేదికపై ఈనెల 10న అష్టావధానం

ధర్మపురి,ప్రభాతవార్త.

ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలో గల శేషప్ప కళావేదికపై ప్రముఖ అవధాని,బ్రహ్మశ్రీ మాడుగుల నారాయణమూర్తి చే అష్టావధాన కార్యక్రమం ఈనెల10న నిర్వహించడం జరుగుతుందని దేవస్థానం ఈవో శ్రీనివాస్, పాలక మండలి చైర్మన్ జక్కు రవీందర్ లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం,స్థానిక సాహితీ మిత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ఇట్టి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం 4.00 గం.కు నిర్వహించే ఇట్టి కార్యక్రమానికి తెలుగు భాషాభిమానులు,పండితులు, కవులు, స్థానికులు అధిక సంఖ్యలో హాజరై,అష్టావధాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వైద్య శిబిరం



**గొల్లపల్లి, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్ బి ఎస్ కే ఆద్వర్యంలో గురువారం విద్యార్థులకు వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యపరమైన సమస్యలున్న వారిని ప్రభుత్వ ఆసుపత్రి కి రిఫర్ చేశారు. మంచి పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలని విద్యార్థులకు డాక్టర్లు సూచించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానో పాధ్యాయులు ఏనుగుల మల్లయ్య ,డాక్టర్లు శ్రవణ్, స్వాతి, రవళి, శ్రీలత ,అధ్యాపకులు పాల్గొన్నారు.

## కేజీబీవీ బాలికల పాఠశాలను సందర్శించిన సర్పంచ్

గొల్లపల్లి, ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని కస్తూరి బా గాంధీ బాలికల పాఠశాల ను స్థానిక సర్పంచ్ నల్ల నీరజసతీష్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను పరిశీలించారు పాఠశాలలో నెలకొన్న సమస్యలు, భోజన వసతిపై విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేస్తున్న వంటలను, కూరగాయలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీరజ మాట్లాడుతూ గ్రామపం చాయతీ సహకారం ఎల్లప్పుడు అందిస్తామని ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థినీలతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అక్షరాభ్యాసం

గొల్లపల్లి, ప్రభాతవార్త :

మండలం లోని ఇబ్రహీంనగర్ అంగన్వాడి కేంద్రం 1 లో స్థానిక సర్పంచ్ చే పిల్లలకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలామృతం, కోడి గుడ్ల ను పంపిణీ చేశారు. సర్పంచ్ శోభన్ మాట్లాడుతూ పిల్లలకు మంచి పోషకాలు కలిగిన ఆహారం అందించాల న్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సల్లూరి శోభన్ గౌడ్, వార్డు సభ్యులు సూర్య, పంచాయతీ కార్యదర్శి రాజా కిషన్, అంగన్వాడి సూపర్వైజర్ జ్యోతి, టీచర్ రమాదేవి పాల్గొన్నారు

## ఉపాధిలో స్థిరపడి కుటుంబానికి ఆర్థిక చేయూత అందించాలి

ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. మహేష్

రాయికల్ ప్రభాతవార్త:



పట్టణంలోని చిన్న జీయర్ స్వామి ట్రస్ట్ భవనంలో ప్రతిమ ఫౌండేషన్, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు నిర్వహిం చిన హోమ్ ఎయిడ్ హెల్త్, టైలరింగ్ కోర్సుల్లో మూడు నెలల శిక్షణను పూర్తి చేసుకున్న 65 మంది శిక్షణార్థులకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం. మహేష్ మాట్లాడుతూ..వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ పొందిన యువత ఉపాధి రంగంలో తమ ప్రతిభను నిరూపించి, కుటుంబాలకు ఆర్థిక చేయూత అందించాలన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఏకాంబరం, జిల్లా స్కిల్ కమిటీ సభ్యులు, ప్రతిమ ఫౌండేషన్ ఆర్గనైజర్ నాగిరెడ్డి రఘుపతి, జి.ఆర్ ట్రస్ట్ ఇంచార్జి ఏ.ఎం. రాజురెడ్డి, జీఎంఆర్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ ప్రమోద్, శిక్షకులు నాగేందర్,కృష్ణవేణి,వనిత పాల్గొన్నారు.

# ధర్మపురి వార్త

## వెల్గటూర్ సర్పంచ్ బండమీది కవిత గోపిలకు సన్మానం

వెల్గటూర్, ప్రభాతవార్త :



వెల్గటూర్ గ్రామ నూతన సర్పంచ్ బండమీ కవిత గోపి దంపతులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్గటూర్ ప్రధానోపాధ్యాయులు నందయ్య ఉపాధ్యాయుల బృందం గురువారం సన్మానించారు

## హైస్కూల్లో క్రీడా దుస్తుల వితరణ

వెల్గటూర్, ప్రభాతవార్త :



వెల్గటూర్ మండల కేంద్రంలోని హైస్కూల్లో విద్యార్థులకు క్రీడా దుస్తుల వితరణ కార్యక్రమం జిల్లా విద్యాధికారి రాము ఆధ్వర్యంలో గురువారం జరిగింది. కొండల్ రెడ్డి ఉపాధ్యా యుడి ఆధ్వర్యంలో3,70 ,000 రూపాయలతో ఆర్వో ప్లాంట్ ను స్కూల్ బిల్డింగ్ రైలింగ్ డోర్స్ బాలురకు మూత్రశాలలు 269 విద్యా ర్థులకు క్రీడా దుస్తుల పంపిణీ చేశారు , ఉపాధ్యాయుడు కొండల్ రెడ్డి గతంలో చదువు చెప్పిన విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత స్థితిలో స్థిరపడ్డారు వారి సహకారంతోనే ఈ కార్యక్రమాల్ని చేపట్టానని తెలిపారు కొండల్ రెడ్డికి గ్రామస్తులు ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక సర్పంచ్ బండమీది కవిత గోపి ఉపసర్పంచ్ గంధ్ర ప్రతాప్ రావు ప్రస్తుత వార్డు సభ్యులు ఎర్రోళ్ల దీపక్ సందీప్ రెడ్డి మాజీ సర్పంచులు బండమీద ముత్తయ్య మురళి ఉపాధ్యాయులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఈ నెల 12 నృసింహాలయ హుండి ఆదాయం లెక్కింపు

ధర్మపురి, ప్రభాతవార్త:

ధర్మపురి శ్రీ లక్ష్మీ ్మనరసింహస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని ఈ నెల 12 న లెక్కించడం జరుగుతుందని దేవస్థానం ఈవో శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానం ఆవరణలో ఉదయం 10. గం.కు ఇట్టి లెక్కింపు కార్యక్రమం ఉంటుందని, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, ఇతర సేవకులు ఇట్టి కార్యక్రమంలో పాల్గొని తమ సేవలు అందించాలని ప్రకటనలో ఈ వో కోరారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ

గొల్లపల్లి, ప్రభాతవార్త :

గొల్లపల్లి మండల కేంద్రంతో పాటు,మండలం లోనిఇబ్రాహీంనగర్, గంగదేవి పల్లె, గ్రామాలలో స్థానిక సర్పంచులు మహిళా సంఘాల లో లేని మహిళలకు గురువారం స్థానిక గ్రామపంచాయతీలలో ఇందిరమ్మ చీరల ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలలో సర్పంచులు నల్ల నీరజసతీష్ రెడ్డి, సల్లూరి శోభన్ గౌడ్, కొలకాని జలందర్, ఉపసర్పంచులు గురిజెల బుచ్చిరెడ్డి, గడ్డం కవిత రాజేందర్ రెడ్డి, ఒరగంటి మను సాయి,కార్యదర్శులు రాజాకిషన్, వివోలు లక్ష్మీ, లత, శిరీష, ఉట్కూరి నీరజ , మహిళా సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు



# కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేస్తాం

■టిక్కెట్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దు

■కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:

సంక్రాంతి తరువాత ఏ క్షణమైనా మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడే అవకాశం ఉందని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.గురువారం కరీంనగర్ లోని రేకుర్తి శుభం గార్డెన్స్ లో బండి సంజయ్ అధ్యక్షతన కరీంనగర్ కార్పొరేషన్ బీజేపీ నాయకుల సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణ, మాజీ మేయర్ సునీల్ రావు, కోమాల ఆంజనేయులు, డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, బోయినపల్లి ప్రవీణ్ రావు, వాసాల రమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కరీంనగర్ కార్పొరేషన్ లో బీజేపీకి మంచి వాతావరణం ఉందని, ప్రజలంతా బీజేపీవైపు చూస్తున్నారని చెప్పారు. టిక్కెట్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. తాను ఎవరికీ టిక్కెట్లు ఇస్తానని హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. కొంతమంది తన కుటుంబ సభ్యుల ద్వారా టిక్కెట్లు కావాలంటూ ఒత్తిడి చేయిస్తున్నారని, అలాంటి వారికి టిక్కెట్ ఇవ్వబోనని తేల్చి చెప్పారు. బీజేపీలో కుటుంబ సభ్యుల జోక్యం ఉండబోదని స్పష్టం చేశారు. టిక్కెట్ల



కేటాయింపులో ఏయే అంశాలను పరిగణలోకి తీసుకోవాలో సూచనలు ఇవ్వాలని ఈ సందర్భంగా నాయకుల నుండి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన నాయకులంతా "టిక్కెట్ ఎవరికి ఇచ్చినా మా డివిజన్ లో బీజేపీ అభ్యర్థినే గెలిపిస్తాం. దయచేసి సర్వే ఆధారంగానే టిక్కెట్లు ఇవ్వండి. మాకు టిక్కెట్ రాకపోయినా నారాజ్ కాబోం. రెబల్ గా పోటీ చేయబోం. కలిసికట్టుగా ప్రచారం చేసి కార్పొరేషన్ పై కాషాయ జెండా ఎగరేస్తాం" చేతులెత్తి ముక్తకంఠంతో నినదించారు.

# పాఠశాల అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ శ్రీహర్ష**

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:



పాఠశాల అభివృద్ధి పనులను నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మండలంలో విస్తృతంగా పర్యటించారు. మండలంలోని మడిపల్లి గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, ఉషన్నపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, తారుపల్లి, పందిళ్ళ, మిర్జంపేట , మెట్ల పల్లి గ్రామాల లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను, పెద్దరాత్ పల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,అంగన్వాడి కేంద్రం, పల్లె దవాఖాన, శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ గోడౌన్, నిర్మాణంలో ఉన్న తహసిల్దార్ కార్యాలయ పనులను, మెట్ల పల్లి డిసిఎంఎస్ , శ్రీరాంపూర్ ప్యాక్స్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మంజూరు చేసిన ప్రహరి గోడలు , పాఠశాల పెయింటింగ్ పనులు వేగవంతం చేస్తూ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. మడిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో గేటు నిర్మాణ పనులు, ప్రాథమిక పాఠశాల కాంపౌండ్ వాల్ పనులు నెల రోజులలో పూర్తి చేయాలని



కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఉషన్నపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇంటర్ లాకింగ్ టైల్స్ పనులు 40 రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన డైనింగ్ హాల్స్ ను వినియోగంలోకి తీసుకొని రావాలని కలెక్టర్ పేర్కొన్నారు. మిర్జంపేట పాఠశాలల వంట గదిలో ఎగ్జిట్ ఫ్యాన్ , లైటింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. పెదరాత్ పల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రం వద్ద నిరుపయోగంగా ఉన్న గదిని ఉపయోగంలోకి తీసుకొని రావాలని కలెక్టర్ తెలిపారు. తహసిల్దార్ కార్యాలయపు పెండింగ్ పనులు పూర్తి చేసి జనవరి 26 నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలో రైతులకు అవసరమైన మేర యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఎవరు అనవసరంగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీరాంపూర్ మండలంలోని గోదాములను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసిల్దార్ జగదీశ్వరరావు, ఎంపీడీవో కే.రామ్మోహన్, మండల విద్యాధికారి మహేష్ ,మండల పంచాయతీ అధికారి ఆరిఫ్, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ పవన్, వ్యవసాయ విస్తరణ అధికారి నాగార్జున, మాజీ మండల అధ్యక్షుడు గోపగోని సారయ్య ఆయా గ్రామాల సర్పంచులు సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# బ్యాంకులు ఆర్బీఐ మార్గదర్శకాలను పాటించాలి

**బ్యాంకుల భద్రతపై సీపీ గౌష్ ఆలం సమీక్షా**

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను అన్ని బ్యాంకులు పాటించాలని సిపి గౌస్ ఆలం సూచించారు. గురువారం పోలీస్ అధికారులు బ్యాంక్ అధికారులతో బ్యాంకుల భద్రతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకుల్లో భద్రతా లోపాలు ఉండకూడదని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. బ్యాంకు ప్రవేశ మార్గాలు, క్యాష్ కౌంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌లు , ఏటీఎం కేంద్రాల వద్ద హైక్వాలిటీ సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయాలి. రికార్డింగ్‌ను కనీసం 30 రోజుల పాటు భద్రపరచడం తప్పనిసరన్నారు. ప్రతి బ్యాంకులో అలారమ్ వ్యవస్థ ఉండాలని , అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను అప్రమత్తం చేసేందుకు మేనేజర్ క్యాబిన్, క్యాష్ కౌంటర్లలో పానిక్ బటన్లను ఏర్పాటు చేయాలని సూచించారు. పెద్ద మొత్తంలో నగదును తరలించేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సాయుధ సెక్యూరిటీ గార్డుల పర్యవేక్షణలో, సురక్షి తమైన వాహనాల్లో రహస్య మార్గాల ద్వారా నగదు తరలింపు జరగేలా చూసుకోవాలన్నారు. ఏటీఎంల వద్ద రాత్రి సమయాల్లో సెక్యూరిటీ గార్డులను నియమించాలన్నారు. ఏటీఎంలలో స్కిమ్మింగ్ పరికరాలు లేదా ఇతర అనుమానాస్పద వస్తువులను గుర్తించేందుకు నిరంతరం తనిఖీలు చేయాలని సూచించారు. ఖాతాదారులు సైబర్ మోసాలకు గురికాకుండా బ్యాంకుల్లో అవగాహన బోర్డులు ఏర్పాటు చేయాలి. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌ను ఆశ్రయించేలా ప్రజలను ప్రోత్సహించాలన్నారు. స్థానిక పోలీస్ అధికారులతో బ్యాంక్ మేనేజర్లు నిరంతరం సమన్వయం కలిగి ఉండాలన్నారు. సిబ్బందికి ఆకస్మిక దాడులను ఎదుర్కొనేలా మాక్ డ్రిల్స్ నిర్వహించాలని సూచించారు. బ్యాంకు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, బ్యాంక్ యాజమాన్యాలు కూడా అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునిల్ ఏసీపీ వెంకటస్వామి టౌన్ ఇన్స్పెక్టర్లు వివిధ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.



# గోడౌన్ నిర్మాణ పనులను పరిశీలించిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ జాబితాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న కొత్త గోడౌన్ నిర్మాణ పనులను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు గురువారం రోజున తనిఖీ చేశారు.పనులను వేగవంతం చేయాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు నిర్మాణ పనులను మరింత వేగంగా పూర్తి చేయాలిని,పనులు త్వరగా జరిగేందుకు వీలుగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు ప్రధానంగా నాణ్యత ప్రమాణాల విషయంలో ఎటువంటి రాజీ పడకుండా నిర్మాణాన్ని పూర్తి చేయాలని,పనుల పురోగతి ని ప్రతిరోజూ నివేదించాలని ఆదేశించారు.

# శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన వేణుగోపాల స్వామి వారి ఆలయంలో ధనుర్మాస ప్రత్యేక పూజలు

జగిత్యాల అర్బన్ ప్రభాత వార్త:

జిల్లా కేంద్రంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన వేణుగోపాల



స్వామి వారి ఆలయంలో శ్రీ ధనుర్మాస ఉత్సవ సందర్భంగా లోక కళ్యాణ అర్థమై భగవత్ భాగవత ఆచార్య అనుగ్రహ ప్రాప్తికై, గురు వారం 8 వ రోజు నవాహినిక, ఏకకుండాత్మక, విశ్వ క్షేనఇష్టి మూలమంత్ర హవనం , గణపతి అభిషేకం,జరిగింది. పూర్ణాహుతితో ఈనాటి కార్యక్రమాలు ముగిశాయి. రేపు 9 వ తేదీ శుక్రవారం శ్రీ యాగము, మహా పూర్ణాహుతి ఉంటాయని నిర్వాహకులు చిన్నస్వామి తెలిపారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.ఈ నాటి కార్యక్రమంలో అర్చకులు నంబి నర్సింహా చార్యులు, ( చిన్న స్వామి ) నంబి విష్ణువర్ధనాచార్యులు, తిగుళ్ల సూర్యనారాయణ శర్మ, సూరజ్ శర్మ, అజయ్ శర్మ,రాధాకృష్ణ శర్మ, శ్రీరంగ వైభవ్, విష్ణు చరణ్, నవీన్ శర్మ, రాఘవ శర్మ, అజిత్ కుమార్ శర్మ, ,సామాజిక కార్యకర్త తవుటు రామచంద్రం,భక్తులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో విజయవంతంగా లాప్రోస్కోపిక్ కొలాసిస్టెక్టమీ ఆపరేషన్

**-వైద్య బృందాన్ని అభినందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్**

పెద్దపల్లి, ప్రభాతవార్త:





పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో విజయవంతంగా లాప్రోస్కోపిక్ కొలాసిస్టెక్టమీ ఆపరేషన్ నిర్వహించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ తెలిపారు. పెద్దపల్లి పట్టణానికి చెందిన 46 సంవత్సరాల ఒక మహిళ గత కొంతకాలంగా కడుపులో కుడి వైపు తీవ్రమైన నొప్పితో గ్లాడ్ బ్లాడర్‌లో 14 ఎంఎం స్టోన్ తో బాధపడుతూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ అవ్వడం జరిగింది. ఈమేరకు గురువారం వైద్యులు అన్ని రకాల పరీక్షలు చేసి అధునాతన పద్ధతిలో డాక్టర్ అమర సింహా రెడ్డి లాప్రోస్కోప్ సర్జన్ తో లాప్రోస్కోపిక్ కొలాసిస్టెక్టమీ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సర్జరీలో పాల్గొన్న వైద్యుల బృందం డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ విష్ణు చంద్రిక, డాక్టర్ కృష్ణవేణి, డాక్టర్ రామంలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ప్రజలందరూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక పరిజ్ఞానంతో ఇలాంటి ఎన్నో క్లిష్టమైన శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## 4వ రోజు కొనసాగిన ఎన్ఎస్ఎస్ శిబిరం

పెద్దపల్లి, ప్రభాతవార్త:




పెద్దపల్లి రంగాపూర్ గ్రామంలో గాయత్రి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శీతాకాల శిబిరం 4వ రోజు జరిగింది. ఇందులో భాగంగా ఇంటింటి సర్వేను చేశారు.. ఓటు హక్కు లేని వారిని గుర్తించి వారికి ఓటు హక్కు, దాని నియమ నిబంధనలు తెలియజేస్తూ దాదాపు 30 మంది పేర్లను నమోదు చేసుకున్నారు. అదేవిధంగా వృద్ధాప్య, వికలాంగులు, వితంతు పెన్షన్ దారులను గుర్తించి 50 మంది పేర్లను నమోదు చేసుకున్నారు. గ్రామంలోని చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ప్రిన్సిపల్ జే .రవీందర్ పాల్గొని విద్యార్థులు ఈ నాలుగు రోజులు వారు చేసిన సేవా కార్యక్రమాలు, విద్యార్థులు నేర్చుకున్న, అవగాహన చేసుకున్న విషయాలు వారి అనుభవాలు అడిగి తెలుసుకున్నారు.

## 123 సీనియర్ సిటిజన్ కేసుల పరిష్కారం

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

జిల్లాలో 123 సీనియర్ సిటిజన్ కేసులకు పరిష్కారం చూపడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వయో వృద్దుల నుండి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. వయో వృద్ధులైన తల్లితండ్రులను వారి పిల్లలు పట్టించుకోని సందర్భంలో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో 152 మంది వయో వృద్దులు తమ పోషణ గురించి పిల్లలు ఏ మాత్రం బాధ్యత వహించటం లేదని ఫిర్యాదు చేయగా, వాటిని పరిశీలించి ఇప్పటి వరకు 123 ఫిర్యాదులు పరిష్కరించామని, మరో 29 ఫిర్యాదులు పరిష్కార దశలో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. ట్రిబ్యునల్ లో క్షణ్ణంగా విచారించిన తర్వాత సీనియర్ సిటిజన్స్ సంరక్షణ చట్టం ప్రకారం తల్లిదండ్రులకు పోషణ నిమిత్తం కొంత సొమ్ము ప్రతి నెల చెల్లించాల్సిందిగా పిల్లలకు ఆదేశాలు జారీ చేశామని, వయో వృద్దుల కేసులలో వృద్ధులైన తల్లితండ్రులను పోషించే బాధ్యత వారి పిల్లలకే ఉంటుందని పరిష్కారం చూపామని, ట్రిబ్యునల్ ఇచ్చిన ఆదేశాలు పాటించని పిల్లలకు వారసత్వంగా వచ్చే ఆస్తిని తల్లిదండ్రులకు మార్పు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. వయో వృద్దులు పిల్లలు సరిగ్గా చూడటం లేదనే ఫిర్యాదులను ముందస్తుగా సంబంధిత రెవెన్యూ డివిజన్ అధికారి వద్ద నమోదు చేయాలని, ఆర్డిఓ వద్ద సమస్య పరిష్కారం కాని పక్షంలో జిల్లా కలెక్టర్ వద్ద ఫిర్యాదు నమోదు చేయాలని, నేరుగా జిల్లా కలెక్టర్ వద్ద ఫిర్యాదు నమోదు చేయవద్దని, ఈ అంశాన్ని వయో వృద్దులు గమనించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సమయపాలన తప్పనిసరిగా పాటించాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

ఆర్‌బిఎస్‌కె కార్యక్రమంలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్లు, సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, ప్రతిరోజూ హాజరును పర్యవేక్షస్తామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆర్‌బిఎస్‌కె డాక్టర్లు, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అన్ని పాఠశాలల విద్యార్థులకు సంపూర్ణంగా స్క్రీనింగ్ నిర్వహించి, రిఫరల్ కేసులను పెంచాలని సూచించారు. జన్మ లోపాలు ఉన్న పిల్లల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, పాఠశాలల్లో జరుగుతున్న కంటి స్క్రీనింగ్ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం పాఠశాలలు మరియు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించాలని తెలిపారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ బి.శ్రీరాములు, డాక్టర్ బి.కిరణ్ కుమార్, డాక్టర్ కెవి. సుధాకర్ రెడ్డి, టి.రాజేష్ తదితరులున్నారు.



## విజేతలకు బహుమతుల ప్రదానం

రామగిరి, ప్రభాతవార్త:



రామగిరి మండలం జల్లారం గ్రామ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు గురువారంతో ముగిశాయి. గత నాలుగు రోజుల నుండి గ్రామంలో ఈ ప్రీమియర్ క్రికెట్ పోటీలు జరుగుతుండగా వివిధ టీములు పోటీపడ్డాయి. ఫైనల్‌లో మైసమ్మ టీం, బబ్లు టీంలు, పోటీ పడగా ఫైనల్‌లో మైసమ్మ టీం విజేతగా నిలిచి ట్రోఫీతో పాటు 3000 రూపాయల ప్రైజ్ మనీ దక్కించుకుంది. బబ్లు టీం సెకండ్ ప్రైజుతోపాటు 2000 రూపాయలతో దక్కించుకుందని నిర్వాహకుడు ఏలువాక సతీష్ కుమార్ తెలిపారు.

## పేదల సొంతింటి కల కాంగ్రెస్ తోసాకారం

ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త;



పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కోనరావుపేట మండలం బావుసాయిపేటలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ నియోజక వర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని పొంది త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇల్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, సర్పంచ్ లక్ష్మారెడ్డి,నాయకులు నందుగౌడ్, ఎక్కల్దేవీ శ్రీనివాస్,దేవదాసు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిఎల్ వో లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించాలి

అడిషనల్ కలెక్టర్ గడ్డం నగేష్

చందుర్తి ప్రభాతవార్త భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటరు జాబితాతో బూత్ లెవెల్ అధికారులు తమ పరిధిలోని ఇంటింటికి వెళ్లి పరిశీలించాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు.గురువారం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో రెవిన్యూ అధికారులు, సూపర్వైజర్లు, బీఎల్ఓ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఎస్.ఎస్.ఆర్ 2025 జాబితాలో 40 ఏళ్ల పైబడిన వారిని ఎస్.ఐ.ఆర్ 2002 జాబితాతో మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. రెండు జాబితాలో ఉన్న కామన్ వ్యక్తులకు ఎస్.ఐ.ఆర్.2025 వర్తించదని తెలిపారు. అనంతరం మూడపల్లి లో గల మినీ స్టేడియం స్థలాన్ని పరిశీలించారు. స్టేడియం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని ఆరా తీయగా సంబంధిత అధికారులు ఆరు ఎకరాలు కేటాయించామని తెలిపారు, ఈ కార్యక్రమంలో తహసిల్దార్ భూపతి,ఆర్ ఐలు మహేందర్,శ్రీనివాస్, సర్వేయర్ చామంతి,జిపిఓ లు పాల్గొన్నారు.

## జంతు వధ శాలను పునరుద్ధరించాలి

వరంగల్ సిటీ జనవరి 8 ప్రభాతవార్త

ఖాజీపేట లో గల జంతు వధ శాల (కమేలా)ను పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి అభిప్రాయపడ్డారు. గురువారం బల్దియా పరిధి 63 వ డివిజన్ పరిధి లోగల కమేలా, 28 వ డివిజన్ ఇంతేజాజ్ గంజ్ ప్రాంతం లో మేయర్ శానిటేషన్ తనిఖీలు చేశారు. ప్రతి కమర్షియల్ దుకాణానికి టైం షెడ్యూల్ కేటాయించి చెత్త సేకరణ జరపాలని ఎవరైనా దుకాణ దారులు చెత్తను రోడ్డుపై వేస్తే పెనాల్టీ లు విధించాలని అన్నారు.

## హామీ ఇచ్చారు నెరవేర్చారు..

ఇచ్చిన మాట ప్రకారం గ్రామంలో హెల్త్ క్యాంప్ ల ఎర్పాటు...

బీర్ పూర్ ప్రభాత వార్త.



జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలంలోని కమ్మునుర్ గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి గ్రామ ప్రజల చేత మాటతప్పని మహారాజు అనిపించుకున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల సమయంలో మేనిపేస్టో లో గ్రామ ప్రజలందరికీ ప్రతినెల హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ఆరోగ్య చెకప్ లు చేపించి మందులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం గురువారం రోజున గ్రామంలో మండల వైద్యులచే హెల్త్ క్యాంపు ఏర్పాటు చేసి మందులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తోట శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా నెరవేరుస్తామని ఎంతటి కష్టమైనా గ్రామ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తామని గ్రామ ప్రజల ఆరోగ్య సంరక్షణ తన ధ్యేయమని గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం గ్రామ ప్రజలకు గెలిచిన 15 రోజులలో హెల్త్ క్యాంపు ఏర్పాటుచేసిన సర్పంచ్ తోట శ్రీనివాస్ ను గ్రామ ప్రజలు రైతులు యువకులు అభినందనలతో ముంచేత్తారు. భవిష్యత్తులో యువరైతు శ్రీనివాస్ సర్పంచ్ గా గ్రామం అభివృద్ధిలో ముందుకెళ్తుందని గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దె సత్తా ఉన్న యువకుడు సర్పంచ్ గా తమ గ్రామానికి ఎన్నిక కావడం చాలా ఆనందంగా ఉందని గ్రామ ప్రజలు ఆనందంతో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యులు ఏం.ఎల్.హెచ్.పి ఆశా వర్కర్లు, జిపిఓ కార్యదర్శి గ్రామ ప్రజలు యువకులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీర్పూర్ గ్రామ నూతన పాలకవర్గానికి ఘనంగా సన్మానం

పీఎం శ్రీ ఎంపీపీ ఎస్ బీర్పూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు

బీర్ పూర్ ప్రభాత వార్త.




జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం లోనీ పి ఎం శ్రీ ఎంపీపీ ఎస్ బీర్పూర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులను నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు మరియు రాష్ట్రస్థాయి హరిత మిత్ర అవార్డు గ్రహీత జూపాక సుదర్శన్ ఆధ్వర్యంలో ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికలలో బీర్పూర్ గ్రామంలో అత్యధిక మెజార్టీతో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ ఎలమట్ల హరీష్ మరియు గ్రామ ఉపసర్పంచ్ ఎనుగంటి జితేందర్ గార్లకు ఘనంగా సన్మానం చేసి అభినందనలతో శుభాకాంక్షలు తెలియజేసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్ మాట్లాడుతూ మా పాఠశాల విద్యార్థులకు ఆధునిక విద్య బోధనకు నూతన టెక్నాలజీ విద్యార్థులకు బోధించడానికి జై ఫుల్ లెర్నింగ్ నాణ్యమైన విద్యను అందించడానికి 2 కంప్యూటర్లు మంజూరు చేయాలని సహకరించాలని మరియు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు కొరత ఉండడం వలన తరగతి గదులు అవసరమని విన్నవించడం జరిగిందని తెలిపారు., గ్రామ సర్పంచ్ హరీష్ మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి 2 కంప్యూటర్లు మరియు తరగతి గది కొరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థిని విద్యార్థులంతా కలిసి నూతనంగా ఎన్నికైన గ్రామ పాలకవర్గానికి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎలమట్ల హరీష్, ఉప సర్పంచ్ ఎనుగంటి జితేందర్ ,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సముద్రాల శ్రీలత ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు జూపాక సుదర్శన్, ఉపాధ్యాయులు మ్యాన రమాదేవి, భోగ నాగరాణి,బాణావత్ స్వరూప, షేక్ రజియా,కందుకూరి లలిత ,గంగిపల్లి మోనిక, మరియు విద్యార్థులు పాల్గొన్నారు .

# ప్రత్యేక అభ్యసన వైకల్యం గల పిల్లలకు స్పష్టమైన రోడ్ మ్యాపు

ప్రత్యేక అభ్యసన వైకల్య రాష్ట్రస్థాయి వర్క్ షాప్‌లో

అట్ల శ్రీనివాస్ రెడ్డి




**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**యూనిసెఫ్ మరియు సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో ప్రత్యేక అభ్యసన వైకల్యం పై రాష్ట్రస్థాయి కార్యశాతేది 07 జనవరి 2026 గురువారం రోజున హైదరాబాద్ లోని హోటల్ మెర్క్యూర్ కాన్ఫరెన్స్ హాల్లో యూనిసెఫ్ మరియు సమగ్ర శిక్ష తెలంగాణ ఆధ్వర్యంలో ప్రత్యేక అభ్యసన వైకల్యం పిల్లలను సాధారణ విద్యలో సమగ్రంగా చేర్చే దిశగా ఒక సమగ్ర రోడ్‌మ్యాప్ రూపొందించేందుకు నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్ షాప్ లో జిల్లాకు చెందిన స్పెషల్ ఎడ్యుకేటర్ అట్ల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అట్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక అభ్యసన వైకల్యం గల పిల్లలకు స్పష్టమైన రోడ్ మ్యాపు రూపొందించడం ఎంతో కీలకం అని అన్నారు. ఈ వర్క్ షాప్ లో ప్రత్యేక అభ్యసన వైకల్య పిల్లల గుర్తింపు, తరగతి గది బోధన విధానాలు, తల్లిదండ్రులకు అవగాహన, పరీక్షలు మూల్యాంకనంలో వెసులుబాటు మొదలైన అంశాలను చర్చించడం జరిగిందని అన్నారు ఈ సమావేశంలో యూనిసెఫ్ ప్రతినిధులు బృందా పిళ్లై, పూర్ణిత నపూర్, స్పెషల్ ఎడ్యుకేటర్ సందిటీ గౌతమి, ఎన్. ఐ.పి.ఈ.డి ప్రిన్సిపాల్ గణేష్, ప్రొఫెసర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల మున్సిపల్ చైర్మన్ ఎస్సీలకు ఇవ్వాలి

. జగిత్యాల టౌన్ ప్రభాత వార్త :



జగిత్యాల పట్టణం కేంద్రం లో ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి బెజ్జంకి సతీష్ మాదిఆధ్వర్యంలో విలేకరుల సమావేశం గురువారం నిర్వహించారు.ఈ సమావేశంలో పాల్గొన్న ఎంఎస్పి జిల్లా అధ్యక్షులు దుమల గంగారాం మాదిగ మాట్లాడుతూ జగిత్యాలలో మున్సిపల్ ఏర్పడిన నుండి ఇప్పటివరకు మున్సిపల్ చైర్మన్ ఎస్సిల రిజర్వేషన్ రాలేదు అని అన్నారు, జనాభ దామాశ ప్రకారం మున్సిపల్ చైర్మన్ ఎస్సిలకు రిజర్వేషన్ ఇవ్వాలన్నారు. . మాకు రాజకీయంగా రావలసిన హక్కు మాకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వడం లేదు మా దళితులను రాజకీయంగా అనుగదొక్కాలని అన్ని రాజకీయ పార్టీలు చూస్తా ఉన్నాయి ఇప్పటికైనా అన్ని పార్టీలకు చెందిన నాయకులు స్థానిక ఎమ్మెల్యే మాజీఎమ్మెల్సీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ రాష్ట్ర మంత్రివర్యులు చొరవ తీసుకొని మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్సీ రిజర్వేషన్ అయ్యేవిధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ పి జిల్లా ఉపాధ్యక్షులు బోనగిరి కిషన్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బొల్లె అనిల్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సంగెపు ముత్తు మాది ఎమ్మార్పీ జగిత్యాల నియోజకవర్గ కోకన్వీనర్ పొడేటి సునీల్ మాదిగ పాల్గొన్నారు

# పిఆర్టియు టిఎస్ గీసుగొండ మండల డైరీ-2026 ఆవిష్కరణ

గీసుగొండ ప్రభాతవార్త.

గీసుగొండ మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 పి ఆర్ టి యు టి ఎస్ సంవత్సర డైరీని గీసుగొండ మండల విద్యాశాఖ అధికారి ఎస్. రవీందర్ బుధవారం ఎంఆర్సీ గీసుగొండలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు టిఎస్ గీసుగొండ మండల అధ్యక్షులు కల్లూరి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మార్త శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వెంకట్రావు, జ్యోష్ణ ప్రభ, స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. డైరీ ఉపాధ్యాయులకు ఉపయోగకరంగా ఉంటుందని వక్తలు అభిప్రాయపడ్డారు.

# కమ్మునూరు గ్రామంలో మొదలైన అభివృద్ధి పనులు

ప్రజల సౌకర్యాలు, గ్రామ అభివృద్ధి నా ధ్యేయం

గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్

బీర్ పూర్ ప్రభాత వార్త.



జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండలం కమ్మనూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ గ్రామ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ అభివృద్ధి నా ధ్యేయమంటూ ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుండే గ్రామంలో అభివృద్ధి పనులు చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నారు. అందులో భాగంగా కామ్మునూర్ గోదావరి తీరానికి వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా గుంతలతో చిందరవందరగా ఉండటంతో ట్రాక్టర్ తో చదును చేపించి గోదావరి తీరం వరకు భక్తుల సౌకర్యార్థం మట్టి రోడ్డు చేపిస్తున్నట్టు తెలిపారు. గోదావరి కి మొకులు తీర్చుకోవడానికి నిత్యం వందలాది భక్తులు వస్తుంటారు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకూడదని అతి ముఖ్యమైన రోడ్డు మార్గాన్ని ఎటువంటి గతుకులు లేకుండా సౌకర్యంగా ఉండే విధంగా మట్టి పోయించి పూర్తి చేపిఇస్తున్నట్టు తెలిపారు. గ్రామంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూసుకోవడమే తన ధ్యేయమని గ్రామ అభివృద్ధి లక్ష ్యమని గ్రామ ప్రజల మద్దతుతో ఐక్యంగా అభివృద్ధి పనులు చేసుకుందామని తెలిపారు. పార్టీలకు అతీతంగా అందరూ ఐక్యంగా గ్రామాభివృద్ధిలో పాలుపంచుకోవాలని గ్రామాన్ని జిల్లాలోని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకుందామని తెలిపారు.

# ఐలయ్య కుటుంబానికి ఎన్నికల ఎక్స్ గ్రేషియా మంజూరు చేయాలని వినతి

అదనపు కలెక్టర్ కి వినతి పత్రం సమర్పించిన ఐలయ్య భార్య, పిల్లలు.



**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**

పెగడపల్లి మండలం నామాపూర్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయుడు సెప్టెంబర్ 26 న జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల శిక్షణకు హాజరైన సంద ర్భంలో అకస్మాత్తుగా గుండె పోటుకు గురై చికిత్స పొందుతూ మరణించడం జరిగింది. తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మా కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ ఆయన భార్య పిల్లలు అదనపు కలెక్టర్ రాజా గౌడ్ కి గురువారం వినతి పత్రం సమర్పించారు..వారి వెంట ఉన్న స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్టియు) జిల్లా అధ్యక్ష , ప్రధాన కార్యదర్శులు బైరం హరికిరణ్ , పాలేపు శివరామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉన్న సమయంలోనే ఐలయ్య గుండెపోటుకు గురైనందున ఎన్నికల ఎక్స్ గ్రేషియా ( పరిహారం) మంజూరు చేసి ఐలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మరణించిన ఉపాధ్యాయుడుఐలయ్య కు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు..

# కుటుంబ నియంత్రణ క్యాంపు ప్రారంభం

వరంగల్ సిటి జనవరి8 ప్రభాతవార్త

వరంగల్ నగరంలోని సికిఎం ఆసుపత్రి అనుబంధమైన ఉర్సు ఆసుపత్రి లో పురుషులకు కుటుంబ నియంత్ర క్యాంపు నిర్వహించారు.ఈ క్యాంపు ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడారు. పురుషులకు చేసే వేసేక్టమీ ఆపరేషన్ సాధారణమైనది. ఎలాంటి కోత కుట్లు లేకుండా రెండు నిమిషాలలో నిర్వహించే ఆపరేషన్ అని తెలిపారు.ఈ ఆపరేషన్ చేసుకోవడం వలన పురుషులలో ఎలాంటి వైకల్యాము రాదని,వాళ్ల సాధారణమైన జీవితము గడపవచ్చని, పురుషునిగా కుటుంబ బాధ్యత నిర్వహించవచ్చునని తెలిపారు.

# రైతు ఉత్పత్తి దారుల ద్వారా సహకార సంఘాల ప్రగతి

జిల్లా సహకార అధికారి సి.మనోజ్ కుమార్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



రైతు ఉత్పత్తి సంఘాల ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధి మరింత సులభతరం అవుతుందని జిల్లా సహకార అధికారి సి.మనోజ్ కుమార్ అభిప్రాయపడ్డారు. గురువారం నాడు జిల్లా సమీకృత కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో ఎఫ్పీఓ ( రైతు ఉత్పత్తి సంస్థ) లుగా ఎంపికైన జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కు సామర్థ్య పెంపుదల( కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రామ్) ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న జగిత్యాల జిల్లాలో ఎఫ్పీఓ ల ద్వారా సహకార సంఘాలు రైతులకు చేరువ కావాలని సూచించారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక అభివృద్ధి మార్పులకు శ్రీకారం చుట్టాలని ఎఫ్పీఓ లను కోరారు. మారుతున్న సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో నూతన విధానాలను అనుసరించాలని సూచించారు. జిల్లాలోని అన్ని వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు కావలిసిన ఎరువులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అదేవిధంగా రైతులకు అవసరమైన విత్తనాలు కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎఫ్పీఓ సభ్యత్వ నమోదు లో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన రాయికల్ సొసైటీ పర్సన్ ఇన్ ఛార్జ్ సాయి కుమార్ గౌడ్, కార్యదర్శి రవి ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాల్గొన్న వరంగల్ కాకతీయ సహకార శిక్షణ సంస్థ డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎఫ్పీఓ ల ద్వారా జిల్లాలో రైతులకు జాతీయ స్థాయిలో మార్కెట్లు అందుబాటులో వస్తాయన్నారు. ఎఫ్పీఓ ల ఏర్పాటు లో జగిత్యాల జిల్లా రాష్టం లో రెండో స్థానంలో ఉందన్నారు. కార్యక్రమం లో బుసరి శ్రీనివాస్, బీర్పూర్, రాయికల్ పాక్స్ మాజీ అధ్యక్షులు రాంచందర్ రావు, మల్లా రెడ్డి, ఇతర సంఘ సభ్యులు, సహకార శాఖ సిబ్బంది, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సంక్షేమానికి కృషి

జోనల్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఒరుగంటి రమణారావు.

టి ఎస్ ఆర్ టి సి రిటైర్డ్ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

జగిత్యాల టౌన్ ప్రభాత వార్త:



ఆర్టీసీ రిటైర్డ్ కార్మికుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని జోనల్, జిల్లా గౌరవాధ్యక్షుడు ఒరుగంటి రమణారావు అన్నారు. గురువారం టి ఎస్ ఆర్ టి సి రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 2026 డైరీని అయన ఆవిష్కరించారు. గౌరవ అధ్యక్షుడు ఒరుగంటి రమణారావు ముఖ్య అతిథిగా పాల్గొనగా, రిటైర్డ్ టిఎస్ ఆర్టీసీ జిల్లా కమిటీ అధ్యక్షుడు కమటాల రవీందర్ ఆధ్వర్యంలో డైరీని ఆవిష్కరించారు. జగిత్యాల పట్టణంలోని ఎల్ జి గార్డెన్లో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమం అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా కె హెచ్ పి రావు, ప్రధాన కార్యదర్శిగా జే రాజేశం, జాయింట్ సెక్రటరీగా యం ఏ హకీమ్, కోశాధికారిగా యం ఎల్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా జే దేవయ్య, వి మురళీధర్, అసిస్టెంట్ సెక్రెటరీలుగా బి ఎల్ నర్సయ్య, జనార్దన్, పబ్లిసిటీ, ఆర్గనైజింగ్ సెక్రెటేరిలుగా ఎస్ ఆర్ రావు, జవహార్ లాల్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కస్తూరి సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి సురేందర్ రావు తో పాటు జోనల్ అధ్యక్షుడు తొగిటి గంగాధర్, పల్లెర్ల ప్రభాకర్, వేముల కిషన్ రావు, ఎస్ డి తయార్, వెంకట్రావుతో పాటు పెద్ద సంఖ్యలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు

## నూతనంగా ఎన్నికైన జీపి ప్రజాప్రతినిధులకు సన్మానం

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త: హుజురాబాద్ మండలంలో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులను కూరపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ



మందిరంలో జరిగిన సన్మాన సభలో కూరపాటి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కూరపాటి రమేష్, డాక్టర్ కూరపాటి రాధిక లు ప్రజా ప్రతినిధులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి రమేష్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, సేవా రంగం కలిసి పని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు గ్రామ స్థాయిలో విస్తరించేందుకు కూరపాటి ఫౌండేషన్, కూరపాటి హాస్పిటల్స్ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## మహిళా శక్తిని అభివృద్ధి చేయడమే లక్ష్యం

### -- డాక్టర్ బియన్ రావు

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త: మహిళల్లో ఉన్న శక్తిని అభివృద్ధి చేయడమే లక్ష్యమని బియన్ రావు హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బిఎన్ రావు అన్నారు. గురువారం హుజురాబాద్ పట్టణ శివారులోని కేసీ క్యాంపులో గల న్యాక్ శిక్షణ కేంద్రంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో మహిళలకు ఉపాధి కార్యక్రమంలో కుట్టు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల



అభివృద్ధి కోసం కుట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని అన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కల్పించడం, వారి ఆర్థిక దిశగా అడుగులు వేయడమే లక్ష్యంగా ఫౌండేషన్ ముందుకు సాగుతుందని అన్నారు. శిక్షణ పొందిన అనంతరం మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాన్ని బాగుపరచుకోవాలని అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు పలుచోట్ల నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు కరీంనగర్ ఆర్డీఓ మహేశ్వర్ సర్టిఫికెట్ లు అందజేశారు. అనంతరం రెండో బ్యాచ్ కుట్టు శిక్షణ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో న్యాక్ అధికారి శ్రీనివాస్ రావు, మహిళలు పాల్గొన్నారు.

## సమ్మక్క జాతర చదును పనులను ప్రారంభించిన పాలక వర్గం...

వీణవంక, ప్రభాత వార్త: ఈ నెలలో ప్రారంభం కానున్న సమ్మక్క - సారలమ్మ జాతర కోసం గురువారం వీణవంక గ్రామ పంచాయతీ పాలక వర్గం జాతర స్థల ఆవరణలో చదును చేసే పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో



సర్పంచ్ దాసారపు సరోజన - రాజేంద్ర ప్రసాద్, ఉప సర్పంచ్ తాళ్ళపల్లి మహేష్, మాజీ వైస్ ఎంపిపి రాయిశెట్టి లత - శ్రీనివాస్, మాజీ సర్పంచ్ నీల కుమార్, వార్డు సభ్యులు గెల్లు కొమురయ్య, బిక్షపతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నియమాలు పాటించండి

### -- ఏసిపి ప్రశాంత్ రెడ్డి

### -- గూడూరులో రోడ్డు భద్రత వారోత్సవాలు...

కమలాపూర్, ప్రభాత వార్త: వాహనాలు నడిపేటప్పుడు డ్రైవర్లు రోడ్డు భద్రత నియమాలను తూచ తప్పకుండా పాటించాలని ఏసిపి ప్రశాంత్ రెడ్డి అన్నారు. కమలాపూర్ మండలం గూడూరు రైతు వేదికలో గురువారం రోడ్డు భద్రత వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి, సిఐ హరికృష్ణ వాహనదారులకు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ... సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్ చేయవద్దని, నిర్దేశించిన వేగాన్ని మించకుండా వాహనాలు నడపాలని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పాటిస్తూ వాహనాలు నడపాలని సూచించారు. ప్రయాణీకుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి డ్రైవరు కృషి చేయాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. సుదూర ప్రయాణం చేసే డ్రైవర్లు విశ్రాంతి ప్రదేశంలో వాహనాలు ఆపుకొని నిద్రించడం మంచిదని, సమయస్ఫూర్తితో వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రాత్రివేళ రోడ్లపై వాహనాలు నిలపవద్దన్నారు. ప్రతి ఒక్క వాహనదారులు వారిపై వారి కుటుంబాలు ఆధారపడి ఉన్నాయనే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ప్రతి ఒక్కరికి నియమ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు సబ్ డివిజన్ పరిధిలో సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు కాజీపేట ఏసిపి ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వికలాంగునికి ట్రై సైకిల్ సహాయం

### -- రాజయ్య ఆదర్శం..

కమలాపూర్, ప్రభాత వార్త: కమలాపూర్ మండలం మర్రిపల్లిగూడెం గ్రామానికి చెందిన వికలాంగుడైన తాడెం రాజయ్య, తోటి వికలాంగురాలికి ట్రై సైకిల్ అందజేసి ఆదర్శంగా నిలిచాడు. ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సహకారంతో తాను ట్రై సైకిల్



కొనుగోలు చేశానని, తాము కూడా తోటి వికలాంగులకు సహాయ సహకారాలు అందించడం కోసం మా వంతు ప్రయత్నం చేస్తామని రాజయ్య తెలిపారు. హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ప్రణవ్ సారథ్యంలో వికలాంగుల కోసం త్వరలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా రాజయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కదురు కవిత, ఉప సర్పంచ్ తాడెం రాజేందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుల్లూరి వెంకటేశ్వర్లు, జక్కుల రవి తదితరులు పాల్గొన్నారు.

## కమలాపూర్‌లో కోతుల బీభత్సం

### -- పేద మహిళ దాచుకున్న నగదు మాయం

కమలాపూర్, ప్రభాత వార్త: కమలాపూర్ మండలం భీంపల్లి గ్రామంలో కోతుల బెడద పతాకస్థాయికి చేరింది. గురువారం గ్రామ నివాసి తోట లక్ష్మి ఇంట్లోకి చొరబడిన కోతుల మంద తీవ్ర అలజడి సృష్టించింది. ఈ ఘటనలో బాధితురాలు కష్టపడి దాచుకున్న నగదు కనిపించకుండా పోవడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది. ఘటన వివరాల ప్రకారం... కూలీ పనులు





చేసుకునే తోట లక్ష్మి, తను సంపాదించిన రూ. 5,000 నగదును భద్రత కోసం ఇంట్లోని ఓ పప్పు డబ్బాలో దాచుకుంది. అకస్మాత్తుగా ఇంట్లోకి ప్రవేశించిన కోతులు సామాన్లను చిందరవందర చేశాయి. ఈ క్రమంలో నగదు ఉన్న డబ్బాను కూడా ధ్వంసం చేయడంతో, ఆ డబ్బులు ఎటుపోయాయో తెలియక బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది. కోతులు తనపై దాడికి ప్రయత్నించడంతో ప్రాణభయంతో ఇంటి సభ్యులంతా బయటకు పరుగులు తీశారు. కోతుల బెడదపై బాధితురాలు లక్ష్మి, ఆమె కుమారుడు రాంప్రసాద్ స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామంలో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయిందని, ఏ క్షణంలో ఎవరిపై దాడి చేస్తాయో తెలియక ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మేము రెక్కాడితే గాని డొక్కాడని వారము అని, కష్టపడి దాచుకున్న డబ్బులు కోతుల వల్ల పోగొట్టుకున్నామని, ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు. గ్రామ పంచాయతీ, అటవీ శాఖ అధికారులు వెంటనే స్పందించి, కోతులను బంధించి అడవిలో విడిచిపెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## నేను టీఆర్ఎస్ పార్టీ వీడటం లేదు

చిగురుమామిడి, ప్రభాత వార్త: చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ గురువారం రోజున ఏర్పాటు చేసిన విలేకరుల ప్రత్యేక సమావేశంలో మాట్లాడుతూ తాను టీఆర్ఎస్ పార్టీ వీడటం లేదని, తన మీద వస్తున్న పుకార్లు నమ్మవద్దని కోరారు. తెలంగాణ రాష్ట్ర సమితి కుటుంబ సభ్యులకు, అన్ని రాజకీయ పార్టీల నాయకులకు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడి



ఎన్నిక వరకే నా ప్రకటన పరిమితం అని నేను టీఆర్ఎస్ పార్టీ మారుతా అనే దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నాను అని అన్నారు. సర్పంచుల సమస్యలపై మండల అధ్యక్షుడి విషయంలో నేను ప్రధాన కార్యదర్శిగా సర్పంచుల కోసం నా వంతు కృషి చేస్తానని, అంతేకానీ తెలంగాణ రాష్ట్ర సమితిని వదిలి వేరే పార్టీలో చేరే ఆలోచన నాకు లేదని రమేష్ అన్నారు.

## టీ పీ సీ సీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ కవ్వం పల్లి...

తిమ్మాపూర్, ప్రభాత వార్త: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ని రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్ పర్సన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం హైదరాబాదులో టీపీసీసీని కలిసి సన్మానించి బొకేని అందించారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కి తన పేరు ప్రతిపాదించినందుకు, తనపై నమ్మకంతో రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్ష పదవిని అప్పగించినందుకు ఆయన మహేష్ కుమార్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు శ్రీగిరి రంగారావు తదితరులు ఉన్నారు.



## ఎరువుల పంపిణీలో ఇబ్బందులు రావద్దుజిల్లాలో కొరత లేదు

**సిరిసిల్ల టౌన్ , ప్రభాతవార్త**

: జిల్లాలో ఎరువుల కొరత లేదని, పంపిణీలో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. యూరియా పంపిణీ, ఇతర అంశాల పరిశీలన, జిల్లా, మండల టాస్క్ ఫోర్స్ టీమ్ ఏర్పాటు తదితర అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి గురువారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితేతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 1,87,000 ఎకరాల్లో వివిధ పంటల సాగు అవుతున్నాయని, దానికి 21 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని తెలిపారు. 13 వేల మెట్రిక్ టన్నుల యూరియా విక్రయాలు జరిగాయని వెల్లడించారు. ఇంకా రెండు వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. యూరియా ఇబ్బందులు రాకుండా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని ఆపేరల పార్కులో నిల్వ చేశామని వెల్లడించారు. పంటల సాగుకు అనుగుణంగా ఎరువులు తెప్పిస్తున్నామని వివరించారు. పీ ఏ సీ ఎస్, ఐకేపీ, డీసీఎంఎస్, ప్రైవేట్ ఫెర్టిలైజర్ డీలర్లు ఈపాస్ యంత్రాల ద్వారానే ఎరువులు విక్రయించాలని, రిజిస్టర్లలో పట్టాదారు పాసుపుస్తకం రైతుల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. పీఏసీఎస్ ల వద్ద రైతుల కోసం షామియానా ఏర్పాటు చేయాలని, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. టాస్క్ ఫోర్స్ టీమ్ లు తనిఖీ చేయాలిజిల్లాలో ఎరువుల పంపిణీ, నిలువలు తదితర అంశాలను టాస్క్ ఫోర్స్ టీమ్ లు తనిఖీ చేయాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. మండల, జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ టీంలు ఏర్పాటు చేస్తున్నామని, జిల్లా స్థాయి టీమ్ లో కలెక్టర్, ఎస్పీ, అదనపు కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి, జిల్లా సహకార అధికారి, డి ఆర్ డి ఓ, మార్క్ ఫెడ్ డీఎం తదితరులు ఉంటారని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ టీమ్ లో తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి, ఎస్ హెచ్ ఓ ఉంటారని వెల్లడించారు మండల స్థాయి టాస్క్ ఫోర్స్ టీం తమ పరిధిలోని రెండు షాపులను రోజూ తనిఖీ చేయాలని సూచించారు. ఆయా షాపులలో ఉదయం స్టాక్ నిలువలు, రాత్రి స్టాక్ నిలువల రిజిస్టర్లు తనిఖీ చేయాలని ప్రస్తుతం రిజిస్టర్ లో స్టాక్ నిలువలు దుకాణంలో నిలువలు పరిశీలించాలని ఆదేశించారు

## ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

**సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త**

:ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, హెల్మెట్ మరియు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పర్ణారాములు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా రోడ్డు సుర్క్షా అభియాన్ -2026 గురువారం సిరిసిల్ల పట్టణంలోని విద్యానగర్ చౌరస్తాలో జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎల్ ఏ డి సి ఎస్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ వాడుతూ వాహనం నడపకూడదని, రోడ్డు ప్రమాదాల ద్వారా అమూల్యమైన ప్రాణ నష్టం జరగకుండా ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జూపెల్లి శ్రీనివాసరావు, ఆర్టీఏ సభ్యులు సంగీతం శ్రీనాథ్, ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, న్యాయవాదులు ఆడెపు వేణు, కడగండ్ల తిరుపతి, రాగుల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.




## సమస్యల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్ష

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



మండలములో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని సామాజిక ఉద్యమ కారుడు రాకేష్ గురు వారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు దీక్షకు పూనుకున్నారు. ముఖ్యంగా డిగ్రీ కళాశాల, రోడ్ల మరమ్మతులు లాంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చేంత వరకు దీక్ష విరమించే ప్రసక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి తీపిరెడ్డి తిరుపతి రెడ్డి, ఎం ఆర్ పి ఎస్ రాష్ట్ర నాయకుడు గుండ్రెడ్డి రాజు మాదిగ, రాష్ట్ర నాయకులు, మ్యాకల మల్లేశం పాల్గొన్నారు.

## అర్వపల్లి గ్రామ పంచాయతీలో తొలి గ్రామ సభ నిర్వహన

**జాజిరెడ్డిగూడెం, జనవరి 08 (ప్రభాత వార్త):**

జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని అర్వపల్లి గ్రామ పంచాయతీలో మొట్టమొదటి గ్రామ సభను నిర్వహించారు. ఈ గ్రామ సభలో సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్, ఉపసర్పంచ్ మామిడి శ్రీను, పాలకవర్గ సభ్యులు సాయిని కళమ్మ, వీరాస్వామి, మామిడి మల్లేష్, నోముల కార్తీక్, మేడి సంపత్, పులిచర్ల స్నేహ ప్రభు, కడెం మానస యాదగిరి, లింగంపల్లి యశోద, అంకిరెడ్డి ప్రవీణ్, మాచర్ల రేణుకతో పాటు కార్యదర్శి నవీన్ రెడ్డి, బిల్ కలెక్టర్ సాయిని యాగనందం, అంగన్వాడీ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, గ్రామ ప్రజలు మరియు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వీధిదీపాల సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, మౌళిక వసతులు, పారిశుధ్యంపై విస్తృతంగా చర్చించి, గ్రామానికి అవసరమైన అత్యవసర అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు.

## ఖమ్మం సిపిఐ శతాబ్ది సభను విజయవంతం చేయండి

**సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్**
**భీమదేవరపల్లి జనవరి 8 (ప్రభాతవార్త)**




ఖమ్మం లో జరిగే వంద సంవత్సరాల సంవత్సరాల బహిరంగ సభను జనవరి పద్దెనిమిది న జరిగే సభను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గురువారం మండలంలోని ముల్కనూర్ అంబేద్కర్ చౌరస్తాలో గోడ పత్రికను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు హాజరయ్యే మహా సభను విజయవంతం చేయడానికి కృషి చేయాలని, ఈ సభలో వంద సంవత్సరాల పార్టీ ఆవిర్భావ నుండి చేసిన కార్యక్రమాలు, ఉద్యమాలను నెమరు వేసుకుంటూ భవిష్యత్తులో పార్టీ నిర్మాణం కోసం కృషి చేయాలని కోరారు. ఈ బహిరంగ సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి రాజా, సిపిఎం వామపక్ష పార్టీల జాతీయ కార్యదర్శులు, ఆదేవిధంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మంచాల రమాదేవి, మండల కార్యదర్శి ఆదరి రమేష్, నాయకులు సుంచు కుమారస్వామి, మార్పు సంజీవరెడ్డి, బోద బాలరాజు, కవ్వం పల్లి కిషన్, చిలుక శీను, సన్నిల రవి, పిట్టల రమేష్, స్వామి, అరుణ్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

**.భీమదేవరపల్లి: జనవరి 8 (ప్రభాతవార్త)**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామ సర్పంచ్ బొల్లంపల్లి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం రోడ్డుకి ఇరువైపులున్న మట్టిని శుభ్రపరిచారు.. ఈ సందర్భంగా సర్పంచ్ అజయ్ కుమార్ మాట్లాడుతూ కొత్తకొండ వీరభద్ర స్వామి జాతర సమీపిస్తున్న సందర్భంగా ఇతర గ్రామాల నుండి ప్రజలు సౌకర్యవంతమైన ప్రయాణం చేయడం కోసం రోడ్డుకి ఇరువైపులా చెత్తను తీసివేయడం జరిగిందని తెలిపారు. గ్రామంలో ఎలాంటి సమస్యలున్న గ్రామపంచాయతీ దృష్టికి తీసుకురావాలని, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందడుగు వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొడిగె శ్రీనివాస్, కార్యదర్శి మధు, వార్డు సభ్యులు బొల్లంపల్లి రాజయ్య, మాడుగుల అమర్, పంచాయతీ సిబ్బంది, ములుగు కిరణ్, చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వరంగ బ్యాంకులను ప్రైవేటీకరణ నిలిపివేయాలి

**కాజీపేట్ మండల్ జనవరి08(ప్రభాతవార్త)**

ప్రభుత్వరంగ బ్యాంకులను రక్షి ం చుకుందామని, ప్రైవేటీకరణను తరిమికొడదామని, ప్రభుత్వ బ్యాంకింగ్ రంగ సమస్యలు, వాటిలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రజా జాగృతి యాత్రతో పేరుతో కెనరా బ్యాంక్ సీఎస్పి ఉమామహేష్ చేపట్టిన 700 కిలోమీటర్ల రాష్ట్రవ్యాప్త సైకిల్ యాత్ర గురువారం సాయంత్రం వరంగల్ లో చేరుకున్నారు. ఈ సందర్భంగా సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగి ఇమ్రాన్ సీఎస్పి ఉమామహేష్ ను పూలమాలవేసి సన్మానించారు. ఈ సైకిల్ యాత్ర లో పాల్గొన్నారు. బ్యాంక్ యూనియన్ల నాయకులు, బ్యాంక్ ఉద్యోగులు, ఈ సైకిల్ యాత్రలో పాల్గొని విజయవంతం చేశారు. ప్రభుత్వ రంగ బ్యాంకులను కాపాడుకోవడం, వాటి ప్రైవేటీకరణ కుట్రలను తిప్పికొట్టడం, ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఖాళీ పోస్టులను తక్షణమే భర్తీ చేయడం, బ్యాంక్ ఉద్యోగుల చిరకాల కోరిక అయిన వారానికి ఐదు రోజుల పనిదినాలను అమలు చేయడం వంటివి ఈ సైకిలయాత్ర, బ్యాంక్ ఉద్యోగుల ముఖ్య డిమాండ్లను వివరించారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**భీమదేవరపల్లి: జనవరి 8 (ప్రభాతవార్త)**

హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సమీపంలోని సమ్మక్కసారలమ్మ గుట్ట ప్రాంతంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే ముల్కనూర్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ముల్కనూర్ ఎస్సై రాజు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం మృతుడికి 30 నుంచి 40 సంవత్సరాల వయసు ఉండొచ్చు అన్నట్లుగా , ఎడమ వైపు ఛాతి మీద ఆంగ్లంలో అమ్మ అనే పచ్చబొట్టు కలిగి ఉందని, నలుపు రంగు జీన్స్ ప్యాంటు, పింక్ కలర్ చొక్కా ఫుల్ హాండ్స్ వేసుకొని, శవం బాగా కుళ్లిన స్థితిలో గుర్తుపట్టడానికి వీలు లేకుండా ఉందని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపారు.

## ప్రత్యేక గ్రీవెన్స్ కు భారీగా తరలివచ్చిన ప్రజలు

**యాదాద్రి భువనగిరి బ్యూరో ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టర్ హనుమంతరావు గురువారం మధ్యాహ్నం నుంచి కలెక్టర్



ఛాంబర్లో నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ ఉద్యోగవాణి కార్యక్రమానికి ప్రజల నుంచి భారీగా వినతులు అందాయి. ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి, కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి గురువారం నిర్వహించే ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో ముఖ్యంగా ధరణి వ్యవస్థలో దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, సంబంధిత అధికారులను పిలిపించి సుమారు 80 ఫైళ్లను క్లియర్ చేశారు. అలాగే బొమ్మల రామారం మండలం మర్యాల గ్రామంలో సమాధుల స్థలాన్ని కొందరు వ్యక్తులు అక్రమంగా కబ్జా చేశారనే వినతి అందడంతో, జిల్లా కలెక్టర్ వెంటనే సంబంధిత బొమ్మల రామారం తహసీల్దార్కు ఫోన్ చేసి కబ్జా చేసిన స్థలాన్ని తక్షణమే స్వాధీనం చేసుకొని గ్రామ ప్రజలకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రతి గురువారం నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు కోరారు.